# తిరుప్పావై పాశురాలు

Contributor: Anusha Ganapavarapu



DAY 1:

ప్రతి పాశురానికి చివర ఎలోరెమ్పావై అనేటటువంటి మాట వస్తున్నది. ఎమ్పావై అంటే వ్రతము అని అర్థం. అందరినీ పిలిచి మనం ఈ వ్రతాన్ని సార్థకం చేసుకుందాం. ఇది జగతికి మంగళ ప్రదము అనేటటువంటి భావాన్ని చెప్తున్నారు. మార్గశీర్ష మాసం వచ్చినది. అది ఎలా ఉన్నది అంటే నిండు చంద్రుడి శోభలతో వచ్చినటువంటి మార్గశీర్ష మాసం. అంటే మీరు ప్రాతఃకాలంలో స్నానానికి వెళ్తూ ఉన్నారు గనుక ఆ సమయంలో ఉన్నటువంటి చంద్రశోభని వర్ణిస్తున్నది. అందుకే సంవత్సరానికే బ్రాహ్మీ ముహూర్తం వంటి పరమపావనమైన మార్గశీర్ష మాసంలో



Copyright@gurujnanam.org Sri Gurubhyo Namaha

నీరాడ ప్పోదువీర్ - అంటే స్నానం చేయడానికి సిద్ధపడిన వారందరినీ కూడా అమ్మ ఇక్కడ మేల్కొలుపుతూ పోదుమినో - వెళదాం రండి అని పిలుస్తున్నది. సాటి గోపికలను పిలుస్తున్నది. నేరిళైయీర్ - అంటే చక్కని అలంకారములు కలిగినటువంటి ఓ గోపీకలారా! అని. పైగా మీరు ఎటువంటి వారు అంటే శీర్ మల్గుం ఆయ్ ప్పాడి చ్చెల్వచ్చిరుమీర్గాళ్ - అంటే గొప్ప ఐశ్వర్యం కలిగినటువంటి ఈ వ్రేపల్లెలో ఉన్నటువంటి ఓ గోపికలారా! అని దీనియొక్క భావం. అంటే మొత్తం విల్లిపుత్తూరులో తనతోపాటు స్నానానికి వస్తున్న వారిని సాటి గోపికలుగా భావిస్తున్నదీ తల్లి. పైగా ఎటువంటిదా వ్రేపల్లె అంటే మంచి సంపదలు గల్గినటువంటి వ్రేపల్లె అని భావించాలి. కూర్వేల్ కొడుందోళిలన్ నందగోపన్ కుమరన్ - చేతిలో ఆయుధాన్ని పట్టుకొని రక్షిస్తున్నటువంటి నందగోపుడి యొక్క కుమారుడు అని కృష్ణ పరమాత్మ యొక్క విశేషం. అంటే నందునియొక్క కొడుకు. ఎటువంటి నందుడు? - మొత్తం వ్రేపల్లెలో ఉన్నటువంటి వ్రజవాసులందరికీ అతను ప్రభువు. ఆ ప్రభువైనప్పుడు చేతిలో ఆ ప్రభుత్వానికి చిహ్నముగా ఒక వేలాయుధమును పట్టుకొని ఉన్నాడుట. అలాంటి ఆయుధం పట్టుకున్నటువంటి నందగోపుడి కొడుకు అంటే కృష్ణుడు జగత్తును రక్షిస్తుంటే ఆ కృష్ణుడికి ఒక తండ్రిగా తన వాత్సల్య రక్షణనిస్తున్నటువంటి వాడు నందగోపుడు. ఆ నందునియొక్క కుమారుడైన కృష్ణ పరమాత్మ మనల్ని అనుగ్రహిస్తాడు ఈ స్నానం వల్ల అని అయితే ఇక్కడ మార్గశీర్ష మాసం నిండు చంద్రునియొక్క శోభ అని చెప్పడంలో ఉద్దేశ్యం ఏంటంటే ఈ వాతావరణం ఒకవిధమైన మానసిక స్థితికి సంబంధించినటువంటిది. మార్గశీర్ష మాసం అంటే ధ్యాన స్థితి. బ్రాహ్మీ ముహూర్తం అంటేనే ధ్యానానికి అనుకూలమైనటువంటి కాలం. అలాంటి ధ్యానానుకూలమైన



Copyright@gurujnanam.org

స్థితి మార్గశీర్ష మాసం. అందునా నిండు చంద్రుడి వెలుగు అన్నప్పుడు శుద్ధ సాత్త్విక భావం వికసించినటువంటి పూర్ణ సమయం. అలాంటి సమయంలో స్నానానికి వెళ్తున్నారు. స్నానం అనగానే "స్నానం మనోమల త్యాగం" అని శాస్త్రం మనకి చెప్తున్నది. మానసిక మాలిన్యాలన్నీ పోగొట్టేదే స్నానం అనేది. కృష్ణ ధ్యానంలోనే చిత్తశుద్ధి ఏర్పడుతున్నది కనుక మనం ఆ కృష్ణ సంకీర్తన, కృష్ణ భావన, కృష్ణ ధ్యానం అనే స్నానం చేద్దాం. ఆ స్నానంలోకి వెళ్ళేటప్పుడు ఆ కృష్ణ భక్తి కలిగినటువంటి యే చిత్తవృత్తి ఉన్నదో ఆ చిత్తవృత్తి సన్నద్ధమవుతున్నది. ఆ చిత్తవృత్తే ఇక్కడ అమ్మ గోదాదేవి. ప్రతి భక్తునియొక్క హృదయం ఆ కృష్ణ ధ్యానానికి వెళ్ళాలి అని ఉవ్విళ్ళూరుతున్నప్పుడు ఆ హృదయమే గోదాదేవి అవుతుంది. అలా వెళుతున్న చిత్తవృత్తి తన మనసులో ఉన్న అన్ని తలంపులనీ కూడా కూడదీసుకొని ఏకాగ్రంగా కృష్ణ ధ్యానానికి వెళ్తున్నది. ఆ కూడదీసుకోవడమే గోపికలందరినీ మేల్కొలిపి స్నానానికి వెళ్ళడం అనే దానిలో ఉన్న భావం. ఇది యశోదమ్మ యొక్క కుమారుడు యశోదమ్మ ఒడిలో ఉన్నటువంటి సింగము అని వర్ణించారు ఇక్కడ. అంటే యశోదమ్మ పుత్రుడైన కృష్ణ పరమాత్మ సింహం లాంటి వాడు, ప్రతాపమూర్తి అని చెప్పడం. పైగా యశోదమ్మ ఎటువంటిది అంటే "ఏరారంద కణ్ణి" అన్నారు. అంటే అందమైన కళ్ళు కలది యశోద. ఆమె కళ్ళకి అందం ఏమిటి అంటే కృష్ణ పరమాత్మను చూడగలుగుతోంది. అదీ అందం. ఆ పరమాత్మను దర్శించే నేత్రములే దివ్య నేత్రములు. అలాంటి ఆ స్వామిని చూస్తున్నటువంటి అందమైన కళ్ళు కలిగినటువంటి యశోదమ్మ పుత్రుడు. ఆ పుత్రుడు ఎటువంటి వాడు అంటే కార్మేని చ్చెంగణ్ - ఇక్కడ కార్మేని అంటే నల్లని మేను కలిగినటువంటి వాడు.



Copyright@gurujnanam.org 

ఎర్రని కనులు కలిగినటువంటి వాడు. కదిర్మదియం పోల్ ముగత్తాన్ - సూర్యునివంటి, చంద్రుని వంటి ముఖం కలవాడు. ఇక్కడ భావం ఏమిటంటే ఆయన నేత్రములు సూర్యచంద్రాత్మకములు. ఆ నేత్రములతో శోభిల్లుతున్న ముఖము అని చెప్పవచ్చు. లేదా ఆయన ముఖమే సూర్యుని వంటిది, చంద్రుని వంటిది అని. ఉంటే చంద్రుడు ఉండాలి, లేకపోతే చంద్రుడు ఉండాలి, రెండు కలిసి ఉండడమేమిటి? అంటే సూర్యుని వంటి ప్రకాశము, చంద్రుని లాంటి ప్రసన్నత - ఈ రెండూ కలిగినది కృష్ణుని యొక్క వదనం. పైగా నల్లని మేని సొయలు కలవాడు. ఈ స్నాన ఫలంగా ఆ నారాయణుడు మనలను అనుగ్రహించబోతున్నాడు. నమక్కే పరైతరువాన్ - మనకు ఆ నారాయణుడు; ఇక్కడ నమక్కే - మనకే; మనకే అనడంలో ప్రత్యేకత కనిపిస్తోంది. అంటే ఈ సాధన చేస్తున్న మనకు ఆ నారాయణుడు పరమును ఇస్తాడు. ఇక్కడ పరమును ఇస్తారు అంటే 'పర' అనే వాజ్యాన్నిస్తారు అని సంప్రదాయజ్ఞులు చెప్పినటువంటి వ్యాఖ్యానం. పర వాయిద్యం అని ఒక వాయిద్యం ఉందిట. గోపికలు వాయించేవారట. ఆ పరవాజ్యం స్వామి అనుగ్రహించాలి. ఈ పరవాజ్యం ఏమిటో కాదు త్రికరణ శుద్ధిగా చేసే భగవత్ సంకీర్తన. ఆ సంకీర్తన భగవదనుగ్రహం వల్ల లభిస్తుందనే భావం. అయితే పరైతరువాన్ అన్నప్పుడు ఆ కృష్ణ పరమాత్మ మనకు పరమును ఇస్తాడు అని. పరము అంటే సర్వోత్కృష్టమైనది అని అర్థం. కృష్ణ పరమాత్మతో సాంగత్యమే సర్వోత్కృష్టం. ఆ సర్వోత్కృష్ట స్థితి మనకి ఇస్తాడు. దానికోసమే మనం ఈ స్నాన వ్రతాన్ని చేస్తున్నాం. ఈ స్నాన వ్రతం ఎటువంటిది అంటే పారోర్ పుగళప్పడిం - అందరూ కీర్తించేటటువంటి వ్రతము. అంటే ఈ వ్రతం చేసినందుకు పదిమందీ



Copyright@gurujnanam.org 

కీర్తిస్తారుట. అలా కీర్తించదగిన పవిత్రమైన ఈ వ్రతాన్ని మనం చేద్దాం అని ఒక సన్నద్ధం మొట్టమొదటి పాశురంలో చెప్తున్నారు.

DAY 2:

రెండవ పాశురంలో ఆ వ్రతము పాటించవలసిన విధానాలు చెప్తున్నది తల్లి. దీనియొక్క భావమేమిటంటే ఆ వ్రతంలో మేము ఈ నియమాలు పాటిస్తున్నాం. సాటి గోపికలకు, సాటి సాధకులకు తల్లి చెప్తున్నది.

వైయెత్తు వాళ్ వీర్గాళ్ - ఈ సంబోధనలో గొప్పతనం ఏమిటంటే ఈ లోకంలోకెల్లా గొప్ప ఆనందాన్ని అనుభవించే వారు అని. ఈ సంబోధన అంత విశేషం. గోపికలు ఎటువంటి వారంటే ఈ లోకంలో ఎవరూ పొందని ఆనందం వాళ్ళు పొందుతున్నారుట. ఏమిటా ఆనందం? అంటే కృష్ణుడి కోసం వ్రతం చేయడమే ఆ ఆనందం. కృష్ణుడే తమ జీవిత లక్ష్యమని ఎంచుకోవడమే ఆనందం. వాళ్ళదీ ధన్య జీవనం, సార్థక జీవనం.

నాముం నం పావైక్కు శెయ్యుం కిరిశైగళ్ కేళీరో - కేళీరో అంటే వినండి. ఈ వ్రతంలో మనం చేస్తున్నది

పాఱ్కడలుళ్ పైయత్తుయిన్ల పరమనడి పాడి - పాలకడలి నుంచి ఉద్భవించినటువంటి వాడు పాలకడలిలో ఆ తరంగాలయొక్క కదలికలలో ఊగులాడేటటువంటి ఆ నారాయణుని గురించి చక్కగా కీర్తన చేద్దాం. ఇది కీర్తన ప్రధానం. అందుకే ఆ సంకీర్తన చేసేటప్పుడు భౌతిక నియమాలు ఏమిటంటే \

నెయ్యుణ్ణోం పాలుణ్ణోం - నేతిని మనం స్వీకరించరాదు. పాలను స్వీకరించరాదు. నాట్కాలే నీరాడి - అంటే ఏమీ స్వీకరించకుండా సుప్రభాత వేళలోనే/ప్రభాత వేళలోనే/బ్రాహ్మీ ముహూర్తం లోనే; నీరాడి - స్నానం చేసి



Copyright@gurujnanam.org 

మైయిట్టెళుదోం - అంటే కంటికి కాటుక కూడా పెట్టుకోకుండా
మలరిట్టు నాం ముడియోమ్ - తలకి పువ్వులు ముడుచుకోకుండా
శెయ్యాదన శెయ్యోం - అంటే చేయకూడనివి చేయకుండా; పెద్దలు ఏవైతే చేయలేదో అవి మనం చేయకూడదు. నిషేధములు/చేయరాని పనులు చేయకుండా ఉండాలి. నియమబద్ధంగా ఉండాలి.
తీక్కుఱళై చ్చెన్ఱోదోమ్ ఐయముం పిచ్చెయుం - కూడని మాటలు ఆడకుండా ప్రవర్తిస్తూ, ఒకరి గురించి ఒకరికి చెడుగా చెప్పకుండా ప్రవర్తిస్తూ దానము చేస్తూ, భిక్ష చేస్తూ పవిత్రమైన జీవనాన్ని గడపాలి. ఇటువంటి నియమాలతో ఈ దివ్య వ్రతాన్ని చేద్దాం అని తల్లి చెప్తున్నది రెండవ పాశురములో.

DAY 3:
అమ్మ గోదాదేవి శ్రీ వ్రతాన్ని ఆచరిస్తూ కీర్తిస్తున్న పాశురములలో మూడవ పాశురం ఈరోజు చెప్పుకోబోతున్నాం.
దివ్యమైన భావంలో చెప్తున్నదేమిటంటే మేము ఈ కీర్తనలో స్వామియొక్క పేర్లను కీర్తిస్తాం అని చెప్తున్నారు. అంటే ఈ వ్రతంలో ప్రధానం భగవత్సంకీర్తన. అది రెండవ పాశురంలో కూడా ప్రస్తావన చేశారు. ఎటువంటి భగవానునియొక్క పేర్లు మేము పలుకుతున్నాం అంటే

ఓంగి ఉలగళంద ఉత్తమన్ పేర్ పాడి - ఓంగి అంటే పెరిగి; ఉళగు అంటే లోకములను; ఆళంద అంటే కొలిచిన; తాను పెరిగి ఈ లోకాలన్నింటినీ కొలిచినటువంటి ఉత్తమునియొక్క నామములను మేము కీర్తిస్తున్నాం. తాను పెరిగి లోకాలను కొలిచినవాడు అంటే వామనుడై వచ్చి త్రివిక్రముడై పెరిగి


Copyright@gurujnanam.org

ముల్లోకాలూ ఆక్రమించినటువంటి పురుషోత్తముడు. ఈ వ్రతం చేస్తూ ఈ నీరాడడం వల్ల వచ్చే ఫలితములేమిటి? అవి

తీంగిన్టి నాడేల్లాం తింగళ్ ముమ్మారి పెయ్దు - అంటే ఈతిబాధలు లేకుండా ఈ దేశమంతా క్షేమంగా ఉంటుంది. ఇది మొదటి ఫలితంగా చెప్పారు. భగవత్ సంకీర్తన వల్ల ఈతిబాధలు పోతాయి అని చెప్పారిక్కడ. అంటే అనావృష్టి, అతివృష్టి ఇలా పంటలకి వచ్చే ఈతిబాధలు కొన్ని చెప్పారు. ఇవి మొత్తం ఆరు - అతివృష్టి, అనావృష్టి, ఎలుకలు, చిలుకలు, మిడతలు, క్రూరులైనటువంటి పాలకులు - వీళ్ళ వల్ల పంటలకు హాని కలుగుతూంటుందిట. ఈ హాని కలగకుండా, ఈ ఆరుగురి బాధా లేకుండా ఉండడాన్ని ఈతిబాధలు లేకుండా ఉండడం అని అంటారు. ఈ దివ్య సంకీర్తన వల్ల ఈతిబాధలు లేకుండా పంటలు పండుతాయి. ఎంత చక్కగా పండుతాయి అంటే ఇక్కడ చెప్తూన్నారు.
తింగళ్ ముమ్మారి పెయ్దు - అంటే నెలకి మూడు వానలు కురుస్తాయి.
ఓంగు పెఱుం జెన్నెలూడు కయల్ ఉగళ

పూంగువళై ప్పోదిల్ పోఱిపండు కణ్-పడుప్ప - ఇక్కడ పెరిగినటువంటి పంటచేల మధ్యలో చేపలు ఎగురుతూ ఉంటాయి అని వర్ణించారు. పైగా వికసించిన తామర పువ్వులలో

పూంగువళై ప్పోదిల్ పోఱిపండు కణ్-పడుప్ప - వికసించినటువంటి తామర పువ్వులలో/కలువ పువ్వులలో ఈ తుమ్మెదలు చేరి హాయిగా నిద్రిస్తున్నాయిట. నిద్రిస్తున్నాయి అంటే ఆనందంగా అక్కడ నిలిచి ఉన్నాయి. అలాంటి వాతావరణం ఏర్పడుతున్నది.


Copyright@gurujnanam.org

శీర్ త్త ములై పత్తి

వాంగ క్కుడం నిఱైక్కుం పళ్ళల్ పెరుం పశుక్కళ్ - ఇందులో ఉన్న విశేషం ఏమిటి అంటే జంకకుండా కొట్టంలో ప్రవేశించి అంటే పశువులయొక్క కోష్టంలోకి వెళ్ళి ఈ గోపాలకులు పాలు పితుకుతున్నారుట.

తేంగాదే పుక్కిరుందు శీర్ త్త ములై పత్తి

వాంగ - ఆవిధంగా కొట్టములలోకి చేరి చక్కటి పొదుగులు కలిగినటువంటి ఆవుల వద్ద కూర్చొని - పొదుగులు ఎలా ఉన్నాయి అంటే బలిసిన పొదుగులుట. అంటే పుష్టి కలిగిన గోవులు అవన్నీ కూడా. అందుకే అక్కడికి వెళ్ళేవాళ్ళు మంచి ధైర్యవంతులే వెళ్ళి ఆ పాలు పితుకుతున్నారు. ఆ పుష్టి కలిగిన పొదుగులనుంచి ఆ పాలని పిదికేటప్పుడు ఆ పాలు కుండల నిండా సమృద్ధిగా ఇస్తున్నాయిట ఆవులు. పళ్ళల్ పెరుం పశుక్కళ్ - పైగా కుండలనిండా; క్కుడం నిఱైక్కుం - ఆ దివ్యమైనటువంటి కలశాలనిండా ఉదారముగా అంటే ధారాళంగా ఏమాత్రం తగ్గకుండా ఆ పశువులు పాడిని ఇస్తూన్నాయి. ఇలా

నీంగాద శెల్వం నిఱైందే - ఈమాట చాలు. మొత్తం సారభూటంగా చెప్తున్నటువంటి మాట. ఈవ్రతం యొక్క ఫలితం ఏమిటంటే నీంగాద శెల్వం నిఱైందే - అంటే శాశ్వతమై తరగనటువంటి సంపద నిలిచి ఉంటుంది. మొత్తానికి భగవత్ సంకీర్తన, ఈ వ్రతము.

ఆ వ్రత ఫలం ఏమిటంటే తరగని సంపద నిలిచి ఉండుట. భక్తులు చేసే వ్రతములు, తపస్సులు ఒక పంట పండించుకోవడం లాంటిది. జన్మ సాఫల్యం పొందాలి.


Copyright@gurujnanam.org

దానికోసం సాధన చేసేటప్పుడు ఈ దివ్యమైన భగవత్ సంకీర్తన వల్ల ఈ వ్రతాల వల్ల ఏం జరుగుతోంది అంటే సాధనకున్న ఆటంకాలు తొలగిపోతాయి. అది ఈతిబాధలు తొలగడమంటే. అలాగే సాధన వృద్ధి చెందడానికి కావలసినటువంటి అనుకూలతలు వస్తాయి. అనుకూలతలే నెలకి మూడు వానలు కురియడము అనేటటువంటి భావంలో చెప్తున్నారు. పైగా పెరిగినటువంటి పంట చేల మధ్యలో చేపలు ఎగురుతూ ఉంటాయి అని చెప్పడంలో ఉద్దేశ్యం ఏంటంటే ఆ సాధనవల్ల మనలో ఉత్పన్నమైనటువంటి జ్ఞానాంకురములు సస్యములై వచ్చినప్పుడు అంతరంగంలో ఉన్నటువంటి రసమయ భావనలు ఎగురుతూ ఉంటాయి అంటే అర్థం ఆ హర్షంతో మనస్సులో ఉప్పొంగుతూ ఉంటాయి దివ్య భావాలు. ఆ దివ్య భావాలే ఇక్కడ మత్స్యములుగా చెప్పబడుతున్నాయి. పైగా వికసించిన కలువ పూలలో తుమ్మెదలు నిద్రిస్తున్నాయి అంటే అర్థం ఏమిటంటే ఆ భావనలో అంతర్ముఖమైనటువంటి చిత్తవృత్తులేవైతే ఉన్నాయో అవి ఆ కృష్ణ ధ్యానంలో పరవశించిపోయి నిశ్చలంగా ఉండిపోయాయి. తుమ్మెదలు నిశ్చలంగా ఉండడం ఎప్పుడవుతుంది? - మకరందాన్ని బాగా ఆస్వాదించి ఆ పారవశ్యంతో ఉండిపోయాయి. అలాగే అంతరంగ కమలంలో ఆ భగవన్ మకరందాన్ని ఆస్వాదిస్తూ ఆ చిత్తవృత్తులనే తుమ్మెదలు ఆ శాంతిని పొందుతూన్నాయి అనే భావాన్ని చూపించారు.

పైగా ఆవుపాల పొదుగుల నుంచి కుండలనిండా పాలు వస్తూన్నాయి. అని చెప్పడంలో ఇక్కడ సాధన ఫలమైనటువంటి అమృతత్త్వ ప్రాప్తి. ఆ అమృతత్త్వమే ఇక్కడ క్షీరముగా చెప్పబడుతున్నది. క్షీరం అంటేనే సాత్త్వికతకీ, ఆనందానికీ, పోషకత్వానికీ సంకేతం. భక్తుడిని పోషించేది భగవద్ధ్యానామృతం. భగవత్ సంకీర్తనామృతం. భగవత్ స్మరణామృతం. ఆ స్మరణామృతం నిండుగా లభిస్తోంది.



Copyright@gurujnanam.org 

నీంగాద శెల్వం నిఱైందే - తరగని సంపద లభిస్తున్నది. ఇది మనం భక్తిపరంగా అన్వయించి చూపించుకున్నాం. కనుక మనం చేసిన సాధనలన్నీ దేనికోసం? పరమాత్మను పొందడం కోసం. ఆ పరమాత్మను పొందడం అనే సాధనా ఫలం మనకు ఈ వ్రతం వల్ల తప్పకుండా లభిస్తున్నది అని తల్లి ఈ కీర్తనలో మనకి చూపిస్తూన్నది.

DAY 4:

ఆండాళ్ళమ్మ గోదాదేవి అనుగ్రహించినటువంటి పాశురాలలో నాలుగవ పాశురం ఈరోజు చెప్పుకోబోతూ ఉన్నాం.
ఇందులో మేఘాలని ఉద్దేశించి కీర్తన చేస్తున్నారు. ఆళిమళైక్కణ్ణా - ఇక్కడ ఆళి అంటే గంభీర స్వభావము అని అర్థం. గంభీరమైనటువంటి ఓ మేఘుడా! మళై అంటే వర్షం; కణ్ణా అంటే నిర్వాహకుడా. వర్షాన్ని నిర్వహించేటటువంటి వాడు పర్జన్యుడని. ఓ పర్జన్యుడా! ఓ మేఘుదైవమా! నువ్వు గంభీర స్వభావం కలిగిన వాడవు. బయటికి చూస్తే మేఘాన్ని అడుగుతున్నట్లు కనిపిస్తున్నది. కానీ మేఘం అనేది సాక్షాత్ కృష్ణ మేఘమే. శ్రీకృష్ణ పరమాత్మనే మేఘరూపంలో అర్చించడం. ముందుగా దీనిలో ఉన్న బాహ్యార్థాన్ని పరిశీలిస్తే ఓ మేఘమా! నీకై ఒన్రు కరవేల్ - అంటే నీ దాతృత్వంలో ఏమాత్రమూ కూడా లోపము చేయకు. సంకోచం వద్దు అని. అంటే సంకోచించకుండా నీ దాతృత్వాన్ని మాకు చూపించు. దాతృత్వం అంటే ఇవ్వడం. మేఘం ఇచ్చేది ఏమిటి? - వర్షం. కనుక చక్కగా వర్షించు. ఏమాత్రమూ తగ్గించకుండా ధారాళంగా వర్షించు అని అడుగుతున్నారు. ఎలా వర్షించాలో ఇక్కడ వర్ణించి చూపిస్తున్నారు.


Copyright@gurujnanam.org

ఆళియుళ్ పుక్కు ముగున్దు కొడార్త్తేరి - ఇక్కడ ఆళియుళ్ అంటే నడి సముద్రంలో నువ్వు చొచ్చుకుపోయి; ముగున్దు కొడు - అంటే నీటిని అంతటినీ బాగా పీల్చివేసి; ఆర్త్తేరి - అంటే ఆకాశంలోకి చేరి అక్కడ నువ్వు గర్జించాలి. ఎలా గర్జించాలి అంటే శ్రీకృష్ణ పరమాత్మ శంఖం వలె గర్జించాలి అని ఇక్కడ అర్థిస్తున్నారు. ఆచార్య రూపంలో మేఘాన్ని భావించినట్లయితే సముద్రమేది అంటే దివ్యమైన వేదములే సముద్రములు. "శృతి సాగరః" అని విష్ణు సహస్రంలో ఒక నామం ఉన్నది. వేదములు సముద్రం వంటివి, అనంతములైనవి, చాలా లోతైనవి. అలాంటి సముద్రములోకి నడిమి భాగంలోకి ప్రవేశించి అనాలిట. అందుకే ఇక్కడ ఆళియుళ్ పుక్కు ముగున్దు కొడార్త్తేరి - అనడంలో సముద్రపు నడిమి భాగంలో ప్రవేశించాలి. ఊళిముదల్వ నురువమ్బోల్ - ఇక్కడ ఊళిముదల్వ న్ అంటే అన్నింటికీ మొదలైన వాడు అని. అంటే సమస్త విశ్వానికీ ఎవడు మొదటి వాడో అతడు. అనగా సర్వ జగత్తుకీ నాయకుడైనవాడు. ఆదియైనటువంటి అనాదియైనటువంటి శ్రీకృష్ణుడు, నారాయణుడు.

ఉరువమ్బోల్ - అంటే నారాయణుని యొక్క శరీరము మేఘశ్యాముడు ఆయన. నీలమేఘశ్యాముడు. అదేవిధంగా నీ శరీర వర్ణం కూడా నారాయణుని వలె నీలకాంతులతో ప్రకాశిస్తున్నది. ఆవిధంగా ప్రకాశిస్తూ

పాళియందోళుడై పర్పనాబన్ కైయిల్

ఆళిపోళ్ - ఇక్కడ పాళియందోళుడై అంటే విశాలమైన, అందమైన భుజములు కలిగినటువంటి నారాయణుని యొక్క చేతిలో ఉన్న చక్రము వలె; ఇక్కడ పర్పనాబన్ అంటే పద్మనాభుడు. పద్మనాభుని యొక్క చేతిలో ఉన్న చక్రంలా నువ్వు మెరిసి పోతూ అని. మేఘం మెరుపులతో మెరిసిపోతున్నప్పుడు ఎలా ఉన్నది అంటే సుదర్శన చక్రంలా మెరిసిపోతున్నదిట. దాని తర్వాత ఆ పాంచజన్యం వలె



Copyright@gurujnanam.org 

వలమ్బురి పోల్ - అంటే శంఖం వలె, పాంచజన్య శంఖం లాగా; ఉరిమి - గర్జించి; తరువాత శార్ఙ్గము ఆయన చేతిలో ఉన్న ధనుస్సు శార్ఙ్గము; ఆ శార్ఙ్గము నుంచి వస్తున్నటువంటి
శరమళైపోల్ - బాణముల వలె వర్షాన్ని కురిపించు అన్నారు. స్వామియొక్క ధనుస్సు పేరు శార్ఙ్గము. ఆ శార్ఙ్గము నుంచి బాణములు ఎలా వస్తాయో వానచినుకులు అలా రావాలి అని చెప్తున్నారు. ఇక్కడ మెరుపులేమో సుదర్శన కాంతులలాగా ఉన్నాయి. మేఘంయొక్క ఉరుములేమో పాంచజన్య శంఖారావాల లాగా ఉన్నాయి. పడుతున్న వాన ఏమో శార్ఙ్గ ధనుస్సు నుంచి కురుస్తున్న బాణ పరంపరలా ఉన్నాయి. అని చెప్పడంలో ఆ మొత్తం మేఘంలో కృష్ణ తత్త్వాన్ని అంత చక్కగా భావన చేస్తున్నది ఆ తల్లి. అయితే ఇక్కడ ఆచార్యునికీ, భగవంతునికీ ఒక అభేద స్థితి ఉన్నది. "మయితే తేషు చాప్యాహం" అని గీతలో స్వామియొక్క వచనం. ఆచార్యునియందు ఆ భక్తుని యందు ఆ పరమాత్మ ఉంటాడు. పరమాత్మ యందు భక్తులు ఉంటారు. అందుకు ఆ భక్తులనుంచి మనవైపు ప్రసరించేదంతా భగవానుని తత్త్వమే. అలాగే ఆచార్య రూపుడైనటువంటి ఆ దివ్యమైన మేఘమునుంచి సాక్షాత్తూ నారాయణ తత్త్వం కురుస్తూన్నది. ఆ నారాయణ తత్త్వమే సుదర్శన చక్రంలా మెరిసిపోతున్నది. అదే పాంచజన్య శంఖంలా గర్జిస్తూన్నది. అదే శార్ఙ్గ ధనువు నుంచి వర్షిస్తున్నటువంటి బాణముల వలె మనవైపు దూసుకు వస్తూ ఉన్నాయి. ఆ వానలు
వులగినిల్ - అంటే లోకానికంతటికీ కూడా; వాళ - సుఖం కలిగించేటట్లుగా కురియాలి అని ఇక్కడ ప్రార్థన చేస్తున్నారు.
పెయ్ దిడాయ్ - అంటే వర్షించు అని అర్థం. ఎలా వర్షించాలి అంటే వాళ వులగినిల్ - ఈ సమస్తమైన జగత్తూ ఆనందించేటట్లు
తాళాదే - ఏమాత్రం ఆలస్యం చేయకుండా వర్షించవయ్యా అని ప్రార్తిస్తున్నారు. పైగా


Copyright@gurujnanam.org

నాంగళుమ్ మార్గళి నీరాడ మగిళిన్దే - మేము ఈ మార్గళి స్నానం చేయడానికి అలా చేసి ఆనందించడానికి వర్షించు అని. అమ్మ గోదాదేవియొక్క దివ్య భావుకత ఉదాత్తమైన కృష్ణ తత్త్వాన్ని మనకందిస్తున్నది.

DAY 5:

అమ్మ గోదాదేవి అనుగ్రహించిన పాశురాలలో ఐదవ పాశురాన్ని ఈరోజు చెప్పుకోబోతున్నాం. ఇందులో పరమాత్మను కీర్తించడం వల్ల కలిగేటటువంటి ఫలితాన్ని చెప్తున్నది. ఆ పరమాత్మయైన కృష్ణుడియొక్క వైభవాన్ని చిన్న చిన్న మాటలతో లోతైన భావాలతో అమ్మ అభివర్ణిస్తున్నది.

మాయనై - ఇక్కడ పరమాత్మని మాయావి అన్నారు. మాయ అన్నప్పుడు స్వామియొక్క విచిత్ర కార్యకరీ శక్తి. ఇక్కడ ఈమాత్రం అర్థం తెలుసుకుంటే చాలు. పరమేశ్వరుడు చేసేటటువంటి దివ్యములైన లీలలన్నీ తన మాయాశక్తితో చేస్తున్నాడు. "యోగమాయాముపాశ్రితః" అని భాగవతం చెప్తున్నది. యోగమాయా శక్తితో చేస్తున్నాడు. ఇక్కడ మాయ అన్నప్పుడు మన ఊహకి అంతుపట్టనిది ఏదో అది మాయ. అది ఈశ్వరునియొక్క కార్యము. "అఘటన ఘటనా పటీయసీ మాయా" అన్నారిక్కడ. అనితరసాధ్యమైన ఈశ్వర శక్తి మాయ. అది విచిత్ర కార్యకరీశక్తి అని శాస్త్రం వర్ణిస్తున్నది. అటువంటి దివ్యమైనటువంటి మాయ కలవాడు.

మన్ను, వడమదురై మైన్దనై - నిత్యమూ భగవత్సంబంధం కలిగినటువంటి మధురకు నాయకుడు అన్నారు. ఈ మధురట ఎప్పుడూ భగవంతునితో సంబంధమున్నది.

అయోధ్యా మధురా మాయా కాశీ కాంచీ అవంతికా!



Copyright@gurujnanam.org 

అంటాం. మధురా నగరం మోక్ష పట్టణాలలో ఒకటి. అయితే మనకు దక్షిణాపథంలో మధుర ఒకటి ఉన్నది. మధురై అని అక్కడ మీనాక్షి దేవి ఉన్నది. పైగా ఈ తల్లి కూడా విల్లిపుత్తూర్ వాసి. దక్షిణాపథంలో తానుంది గనుక ఇక్కడ మధురను చెప్పినప్పుడు వడమదుర్రై అన్నది. వడమదుర్రై అంటే ఇక్కడ ఉత్తరాన ఉన్న మధుర అని. ఉత్తరాన ఉన్న మధురే కృష్ణుని యొక్క ఆవాసము. అక్కడే పుట్టాడు స్వామి. అది కృష్ణునితో నిత్యం సంబంధం కలిగినది. అంటే కృష్ణుడు పుట్టినప్పుడు మాత్రమే విష్ణుమయం కాలేదు అది. అది ఎప్పుడూ విష్ణుమయమే. కనుక కృష్ణుడు అక్కడ అవతరించాడు. తనయొక్క ధామమది. అందుకే ఆనాటి యుగాలలోనే అంబరీషుడు, ధృవుడు మొదలైన వారందరూ కూడా ఈ మధుర పరిసరాలలోనే సాధన చేసుకున్నారు. ఈ మధురానగరంలో పుట్టే తన బలాన్నంతటినీ ప్రకటించాడు. పుట్టినప్పుడే తన అనుగ్రహంతో వసుదేవుడియొక్క శృంఖలాలు ఛేదించిపోయేలా తనయొక్క అనుగ్రహబలాన్ని చూపించాడు. అటుతర్వాత వ్రేపల్లెలో కూడా పూతన, తృణావర్తుడు, శకటాసురుడు, మొదలైన వారిని శైశవ దశలోనే సంహరించాడు. అటుతర్వాత మద్ది చెట్లను కూల్చివేశాడు. గోవర్ధన గిరిని ఎత్తాడు. ఇలా అనేకములైన లీలలను చూపించాడు గనుకనే స్వామియొక్క లీలలలో చూపించిన పరాక్రమాన్ని, ప్రతాపాన్నీ, మహిమనీ తలంచుకొని 'వడమదుర్రై మైన్దనై' అని సంబోధించింది ఆ తల్లి. ఆవిధంగా ఉత్తర మధురకు నాయకుడై బలమైన వాడు. పైగా యమునాతీర విహారి.

త్తూయ పెరునీర్ యమునై త్తురైవనై - అంటే ఇక్కడ శుద్ధమైనటువంటి పెద్ద నీరైన యమునానదీ తీరములో ఉన్నవాడు. ఇక్కడ యమునకు రెండు విశేషణాలు ఉన్నాయి. త్తూయ పెరునీర్ - అంటే శుద్ధమైన పెద్ద నీరు - పెద్దనీరు అంటే లోతైన



Copyright@gurujnanam.org 

విశాలమైన నీరు - యమునా నదికి ఉన్న గొప్పతనం అది. ఆ యమునను తలంచుకుంటే చాలు, ధన్యులమౌతాం. అత్యంత పవిత్రమైన నది.

ఆయర్ కులత్తినిల్ - అంటే ఉత్తమమైన గోప వంశంలో ఉద్భవించినటువంటి

మణి విళక్కై - మంగళ దీపము అన్నారిక్కడ. ఉత్తమ వంశంలో పుట్టాడాయన. సాత్వత వంశం అది. ఆ దివ్యమైనటువంటి వసుదేవుని పరంగా చూసినా, ఇక్కడ నందుని పరంగా చూసినా ఉత్తమ వంశం. అలాంటి వంశంలో ఆయన ఉద్భవించాడు. పూర్వ కాలంలో మణిదీపాలు ఉండేవి. అవి ఎవరూ వెలిగించనక్కరలేదు. వాటంతట అవే ప్రకాశిస్తూ ఉంటాయి. అవి వెలగగానే మొత్తం చీకటి పోతుంది. ఇక్కడ స్వామిని మణిదీపం అని చెప్పడంలో విశేషం ఏమిటంటే ఆయన స్వయం ప్రకాశక స్వరూపుడు అనే భావం ఇందులో ఉంది.

త్తాయైక్కుడల్ విళక్కమ్ శెయ్ద - అంటే తల్లియైన యశోదాదేవి యొక్క గర్భాన్ని ప్రకాశింపజేశాడు. అంటే యశోదాదేవి కొడుకుగా పుట్టి ఆమె కడుపును పండించాడు, వెలిగించాడు అని అంటే వైభవాన్ని తెచ్చాడు. అటువంటి

దామోదరనై - ఆ దామోదరుని మేము కీర్తిస్తున్నాము. యశోదకి, నందునికి ఘనకీర్తి కృష్ణుని వల్ల వచ్చింది. ఆయన అక్కడ ఉద్భవించడం చేతే ఆ కులము ఉత్తమ కులమైంది. ఆతల్లి గర్భము ప్రకాశమానమైనది. అలాంటి యశోదమ్మ చేత తాటిచే రోటికి కట్టబడ్డాడు స్వామివారు. ఆ యశోదమ్మ భక్తికి ప్రతీక. ఆమె మాత్రమె కట్టగలిగింది. బ్రహ్మాది దేవతలు కూడా పట్టుకోలేని పరమాత్మని పట్టుకొని కట్టగలిగింది. ఆయనయొక్క భక్త సౌలభ్యమేదైతే ఉన్నదో దామోదర లీలలోనే కనపడుతుంది. అందుకే ఇక్కడ దామోదర అని చెప్పడంలో విశేషం అది. ఈవిధంగా త్రికరణములతో స్వామిని మేము ఆశ్రయించి ఆరాధిస్తున్నాం. ఇలా ఆశ్రయించడం వల్ల ఎం జరుగుతున్నది అంటే



Copyright@gurujnanam.org 

పోయపిళ్ళైయుమ్ పుృగుదరువా నిన్రనవుమ్ - స్వామిని చేతులారా సేవించడం వల్ల, నోరారా పాడడం వల్ల, మనసారా ధ్యానించడం వల్ల అంతవరకూ చేసిన సమస్త పాపములూ తరువాతి కాలంలో ఏం చేయబోతామో తెలియదు గానీ ఆ పాపములున్నూ ఇవన్నీ కూడా దగ్ధమైపోతాయి. ఎలాగు అంటే

తీయినిల్ తూశాగుం - అంటే అగ్నిలో దూది వలె అన్నారు. అగ్నిలో వేసిన దూది ఎలా భస్మీపటలం అవుతుందో భగవంతుని సేవించిన వారి పాపరాశి అంతా దగ్ధమౌతుంది. సమస్త పాపములూ భస్మీపటలం అయిపోయాయి అంటే సరిపోతుంది. కానీ ఇదివరకు చేసిన పాపములూ, ఇకపై రాబోయే పాపములు చెప్పడంలో ఉద్దేశం ఏమిటి? ఇది మనం ఆలోచిస్తే భగవత్ చింతన చేసేవాళ్ళు మళ్ళీ పాపాలు చేస్తారా? ఇవాళ భగవత్ చింతన చేశాం కనుక రేపు పాపాలు చేసినా ఫరవాలేదు ఎలాగో పోతాయి అని భావం ఇందులో లేదు. ఇందులో ఉన్న ఆంతర్యాన్ని పరిశీలించాలి. రాబోయే పాపములు అంటే మనం గత జన్మలలో ఎన్నెన్ని కర్మలు చేసి ఉన్నామో మనకు తెలియదు. మనకు కనపడుతున్నది ఈ జన్మ మాత్రమే. ఈ జన్మలోనే మనం కర్మక్షయం చేసుకోవాలి. కర్మక్షయం చేసుకోవాలి అంటే ఈ కర్మ శరీరాన్ని మనం పవిత్రం చేసుకోవాలి. ఈ కర్మ శరీరంలో మూడు కరణములున్నాయి. అది శరీరము, మాట, మనస్సు. ఈ మూడు కరణములూ కృష్ణమయం చేసుకొని కృష్ణార్పణం చేసుకోగలిగితే మన శరీరంలో ఉన్న సమస్త కర్మలూ దగ్ధమౌతాయి. ఈ కర్మలు ఇప్పుడు అనుభవిస్తున్నవి కొన్ని ఉన్నాయి. ఇక తర్వాత జన్మలలో అనుభవించబోయే పాప ఫలములు కూడా దాగి ఉన్నాయి మనదగ్గర. సంచితములుగా ఎన్నో కర్మలు దాగి వున్నాయి. ప్రారబ్ధ కర్మలు ఈ శరీరంతో తెచ్చుకున్నాం. ఇప్పుడు ఆగామి కర్మలు ప్రోగుచేసుకుంటున్నాం. కానీ ఆ సంచిత కర్మలు కూడా దహనమైతే తర్వాత జన్మలు లేకుండా ఉంటుంది. ఆ సంచితములు ఏవి


Copyright@gurujnanam.org 

ఉన్నాయో మనకు తెలియదు. అవే తరువాత రాబోయే జన్మలకి మూలములైన కర్మలు. అందుకు రాబోయే పాపములు అంటే తర్వాతి జన్మలలో అనుభవించబోయే కర్మ ఫలములేవైతే ఉన్నాయో అవి కూడా దగ్ధమైపోతాయిట భగవత్ సంకీర్తన వల్ల. అందువల్ల ఈ సంచితమూ, ఆగామి కూడా నశించి పోతాయి. ఆ కారణం చేత నువ్వు శుద్ధుడవవుతావు అని చెప్తున్నారు. సర్వ పాప నాశకమైనటు వంటి ఆ పరమాత్మను

శెప్పు - అంటే కీర్తించు అని చెప్తున్నారు. ఇలా కీర్తిస్తూ త్రికరణములతో ఆశ్రయించడమనే కృష్ణ భక్తి వైభవాన్ని ఈ పాశురంలో వర్ణించింది తల్లి.

DAY 6:

అమ్మ ఆండాళ్ళమ్మ గోదాదేవి అనుగ్రహించిన పాశురాలలో ఆరవరోజు పాశురాన్ని ఈరోజు చెప్పుకోబోతున్నాం.

ఇందులో తనతో పాటు స్నానానికి సాటి గోపికను మేల్కొల్పుతున్నటువంటి ఒక గోపికా భావం ఈ పాశురంలో మనకు కనపడుతోంది.

పిళ్ళా యెళుంది రాయ్ – అంటే ఓ బాలా మేలుకో అని అర్థం. ఇక్కడ బాల అని పిలవడంలో గోపికయొక్క అమాయకత్వమూ, ముగ్ధ భావమూ ఈ రెండూ స్ఫురిస్తూ ఉన్నాయి. అందుకే ఓ బాలా! అంటే ఓ పిల్లా! మేలుకో అని చెప్పడం. అయితే ఈ మేల్కొలిపేటప్పుడు మేల్కొల్పటానికి కావలసిన ధ్వనులెన్నో వినబడుతున్నాయి. అయినా నువ్వు మేల్కొలేదా? అని చెప్పడం కనపడుతున్నది.



Copyright@gurujnanam.org 

పుళ్ళుమ్ శిలుంబినకాణ్ – అంటే పక్షులు కూడా కూస్తున్నాయి కదా!

మరొకవైపు పక్షుల రాజైన గరుత్మంతుని వాహనంగా చేసుకున్నటువంటి నారాయణుని ఆలయంలోంచి శంఖనాదం వినిబడుతోంది.

పుళ్ళరయ్యన్ – అంటే గరుత్మంతుని వాహనం కలిగినటువంటి నారాయణుని యొక్క

కోయిలిల్ – ఆలయం నుంచి

వెళ్ళై విళిశంగిన్ – తెల్లని శంఖం నుంచి వస్తున్న నాదం; ఆ నాదం ఎలా ఉన్నదంటే

పేరరవమ్ – పెద్ద ధ్వని; ఏదో చిన్న చిన్న సవ్వడి కాదు. పోనీ పక్షుల కిలకిలలు అంటే చిన్న చిన్నగా ఉన్నాయి. కానీ శంఖనాదం. ఆ శంఖనాదం కూడా విష్ణు మందిరంలోంచి వస్తోంది. అలాంటి దివ్యమైన శంఖనాదం నీకు వినబడలేదా? ఇంకా మేల్కోనవేమి? అని అంటున్నారు. నాదములలో భాగంగా పక్షులని చెప్పారు, గరుత్మంతుణ్ణి చెప్పారు. గరుత్మంతుడు వేద పురుషుడు కనుక వేదమంతా శబ్దబ్రహ్మ స్వరూపం గనుక ఇక్కడ గరుడ వాహనారూఢ అని మాట చెప్పడంలో ప్రత్యేకత. వేదవేద్యుడైన నారాయణుని ఆలయంలోనుంచి తెల్లని శంఖము అంటే శుద్ధ సత్త్వ భూమికతో కూడిన దివ్య నాదం. పైగా పేరరవం – పెద్ద ధ్వని అని అర్థం. పెద్ద ధ్వని అంటే క్షుద్రములైన ధ్వనులు కాకుండా దివ్యమైన, గొప్పదైన ధ్వని అని అర్థం. ఏది దివ్య భావాన్ని, దివ్యత్వాన్ని కలిగి ఉంటుందో అది గొప్ప నాదం. అదే ఇందులో పేరరవం అన్నారు. ఇలాంటి దివ్యనాదములు నీకు వినబడడం లేదా? అనడంలో విశేషం ఏమిటంటే ఆ దివ్యనాదములు విని జాగృతి చెందాలి. అదీ చెప్పడం ఇక్కడ. ఓ పిల్లా! మేలుకో. అయితే నన్ను లేపడానికి మీరందరూ వచ్చారు. ధ్వనులు వినలేదా? అని అడిగారే! మరి ఏ ధ్వనులు విని



Copyright@gurujnanam.org 

మీరు లేచి వచ్చారు? అని అడగవచ్చు. మేము ఏ ధ్వనులు విన్నామో చెప్తున్నాము విను అంటున్నారు. వీళ్ళు విన్న ధ్వనులు అంటే మేల్కొలుపుతున్న వాళ్ళు విన్న ధ్వనులు ఏమిటయ్యా అంటే

మునివర్గళుమ్ యోగిగళుమ్ మెళ్ళ వెళున్దు ఆరియన్ర పేరరవమ్ ఉళ్ళమ్ పుగున్దు కుళిర్ న్దు – దీనియొక్క భావం ఏమిటంటే మునిశ్రేష్ఠులు, యోగులు, వీరందరూ కూడా తమ మనస్సులలో నారాయణుని ధ్యానిస్తూ; మెళ్ళ వెళున్దు – ఆ ధ్యాన భూమిలోంచి పరవశ భావంతో వెలికి పలికినటువంటి హరి హరీ అనే నాదములు మా హృదయంలో ప్రవేశించి మాలో తాపాన్ని పోగొట్టి మమ్మ మేల్కొలిపాయి. అలా మేల్కొన్న మేము నీవద్దకు వచ్చి మేల్కొలుపుతున్నాం. పైగా ఆ మునులు, యోగీశ్వరులు ఎవరిని ధ్యానిస్తున్నారు అంటే

వెళ్ళత్తరవిల్ తుయిల మర్ న్ద విత్తినై ఉళ్ళత్తు క్కొండు – వెళ్ళత్తరవిల్ అంటే క్షీర సముద్రము, పాలకడలి. ఆ పాలకడలిలో యోగనిద్రాశయనం చేసినటువంటి జగత్కారణుడైన నారాయణుడు. ఇక్కడ విత్తినై అన్నారు. విత్తినై అంటే జగత్తుకు మూలమైన వాడు అని అర్థం. ఇది భాగవత ప్రబోధం. సాధారణంగా సుప్రభాతాలలో భగవంతుణ్ణి మేల్కొలుపుతారు. కానీ ఈ పాశురాలలో మాత్రం భాగవతులను మేల్కొల్పడం జరుగుతుంది. పైగా తానొక్కతే స్నానానికి వెళ్ళడం కాకుండా తోటి గోపికలను కూడా తీసుకువెళ్ళడం అనేది నాటి ప్రేపల్లెలో చేసినటువంటి విషయం. ఆ భావాన్ని ఇక్కడ సమన్వయించుకొని అమ్మ ఈ వ్రతాన్ని ఆచరిస్తోంది. అయితే ఇందులో ప్రత్యేకత ఏంటంటే ఒక్కొక్క గోపికను మేల్కొల్పడం అంటే భగవదనుభూతి పొందినటువంటి ఒక్కొక్క ఆచార్యుని మేల్కొల్పడం. ఆ ఆచార్యుని మేల్కొలిపి నువ్వు నీ దివ్యానుభూతిలో ఉండడమే కాకుండా ఆ అనుభూతి నుంచి వెలికి వచ్చి మాకూ ఆ భగవదనుభూతిని పంచు. నీ మార్గదర్శకంలో మేము నడుస్తాం. నీతోపాటు మేము నడిచి ఆ భగవద్వ్రతాన్ని



Copyright@gurujnanam.org 

పాటిస్తాం అనడం. అందుకే ఇక్కడినుంచి చెప్పబడుతున్న ఒక్కొక్క గోపిక ఒక్కొక్క ఆచార్యుడు. వైష్ణవ సంప్రదాయంలో ఆళ్వారులు అని చెప్పబడుతూ ఒక్కొక్క ఆచార్యుని మేల్కొలిపి ఆచార్యుని ద్వారా ఉపదేశం పొంది ఆ ఆచార్యునితో వెళ్ళడం కనపడుతున్నది. అటువంటి ఆ నారాయణుని దివ్య తత్త్వాన్ని అందుకొనడానికై గోపికలను నిద్ర లేపి ఆండాళ్ళమ్మ దివ్య గానం చేస్తూన్నది. అయితే ఇక్కడ నారాయణుని మునులు ధ్యానిస్తున్నారు అన్నప్పుడు ఇక్కడ వైకుంఠ వాసియైన నారాయణుడు బాలకృష్ణుడైన నారాయణుడిగా ఇక్కడ వర్ణించబడుతున్నాడు.

పేయ్ ములై నంజుణ్డు కళ్ళచ్చగడం కలక్కళియ క్కాలోచ్చి – అంటే పూతన ఇచ్చినటువంటి విష స్తన్యాన్ని పానం చేసి శకటాసురుని కీళ్ళు ఊడేలా తన కాలితో కొట్టినటువంటి నారాయణుని మునులు ధ్యానిస్తున్నారు. అన్నప్పుడు శేషశయనుడైన నారాయణుడే ఇక్కడ పూతనా సంహారము, శకటాసుర సంహారము, చేసినటువంటి కృష్ణ మూర్తి. అటువంటి కృష్ణుని గానం చేసినటువంటి మునులయొక్క పలుకులు విని మేము మేల్కొన్నాం. అనగా భగవదనుభూతి పొందినటువంటి ఆచార్యుల మాటలతో మేము మేల్కొన్నాం, మళ్ళీ నీయొక్క ప్రబోధం కావాలి అని మరియొక ఆచార్యుని ప్రార్థించినట్లుగా ఇందులో ధ్వని గర్భితమైన భావమున్నది. అటువంటి దివ్య గానానికి నమస్కరిస్తూ

ఆండాళ్ తిరువడగలై శరణం!!

DAY 7:

అమ్మ గోదాదేవి అనుగ్రహించిన శ్రీవ్రతం లోని పాశురాలలో ఏడవరోజు పాశురం

ఇందులో ఇంకొక గోపికను మేల్కొల్పుతూ తమతో పాటు వ్రతానికి రమ్మని పిలుపు కనిపిస్తున్నది. ఇక్కడ నిద్రపోతున్న గోపికని మేల్కొల్పడం అంటే



Copyright@gurujnanam.org 

భగవదనుభూతిలో ఉండి బహిర్ముఖత్వాన్ని విడిచిపెట్టి అంతర్ముఖమైన జ్ఞాన సమాధిలో ఉన్నటువంటి సిద్ధులని మేల్కొలిపి ఆ దివ్యానుభూతిని మాకు కలిగించి మమ్మల్ని ఈ వ్రతంలో ధన్యులని చేయండి, ప్రేరేపించండి, మాకు మార్గం చూపించండి అని ఆచార్యుడిని వేడుకొనడమే ఇక్కడ గోపికలని మేల్కొల్పుట అనే దానిలో ఉన్న భావం. పైగా గోపికా భావాన్ని ఆదర్శంగా తీసుకున్న అమ్మ గోదాదేవి ఆ గోపికల్ని ఆచార్యునిగా భావిస్తున్నట్లుగా ఇందులో మనం భావించవచ్చు. ఇప్పుడు పక్షుల కూతలు నీకు వినబడడం లేదా? అయితే ఈ పక్షులు విశేషమైన పేరు చెప్పారు. ఆనైచాత్తం - ఈ పక్షికి సంస్కృతంలో భరద్వాజ పక్షి అని అంటారు. ఈ భరద్వాజ పక్షులు ఎలా అరుస్తున్నాయి అంటే అవి కలిసి కీశు కీశెన్ను - కీచు కీచుమని మాట్లాడుకుంటూన్నాయి. ఆ ధ్వనులు నువ్వు వినలేదా ఓ గోపికా? అంటున్నారు. ఇక్కడ మూడు సంబోధనలు ఉన్నాయి. పేయ్ ప్పెణ్ణే , నాయకప్పెణ్ణిళ్ళాయ్, తేశ ముడైయాయ్. ఇక్కడ పేయ్ ప్పెణ్ణే అంటే ఓ పిచ్చిపిల్లా అని అర్థం ఒకటి. నాయకప్పెణ్ణిళ్ళాయ్ అంటే నాయకురాలైన ఓ పిల్లా! తేశ ముడైయాయ్ - మంచి తేజస్సు కలిగిన దానా! ఈ మూడింటిలో ఉన్న దివ్యత్వాన్ని మనం పరిశీలించాలి. అదేవిధంగా

కాశుమ్ పిరప్పుమ్ కలగలప్పక్కై పేర్తువాశ నరుజ్ఞుళల్ - అంటే పువ్వులు తురిమినటువంటి జుట్టుతో, వాసనలతో కూడివున్న తలతో ఉన్న గోపకాంతలు చల్ల చిలుకుతూ ఉన్నారు. ఆ ధ్వనులు నీకు వినబడలేదా? ఇప్పటికే లేచి చల్ల చిలుకుతున్నటువంటి గోపకాంతల యొక్క చేతి కంకణ ధ్వనులు, ఆ చిలుకుతున్న పెరుగు సవ్వడులు నీకు వినపడలేదా? పైగా వారు రకరకాల ఆభరణాలు ధరించి ఉన్నారు. కాశుమ్ పిరప్పుం - అంటే తాళిబొట్టు, మంగళ ఆభరణములు, ఇవన్నీ ధరించి అవి గలగలమని మ్రోగుతూ ఉండగా ఆ చేతులతో


Copyright@gurujnanam.org 

చల్ల చిలుకుతూ ఉన్నారు. అప్పుడు చేతికున్న కంకణముల మ్రోతలు కూడా వినపడుతూన్నాయి. ఆ ధ్వనులు నీకింకా వినపడలేదా?

మత్తినాల్ ఓశై పడుత్త - అంటే కవ్వాన్ని పెట్టి పెరుగును చిలుకుతున్నటువంటి తయిర రవమ్ - పెరుగు యొక్క ధ్వనులు

కేట్టిలైయో - వినబడలేదా? ఇందులో ఉన్న ప్రత్యేకత చూద్దాం. ముందు పక్షుల కిలకిలలు చెప్పారు. దాని తర్వాత గోపకాంతలు చల్ల చిలుకుతున్న సవ్వడి, ఇక్కడ ఈ చల్ల చిలకడం అర్థం ఏమిటంటే శాస్త్రాన్ని మథనం చేసి సారమైన భాగవత్తత్త్వాన్ని తీసేటప్పుడు చేస్తున్నటువంటి సాధనారూపమైన చర్చాధ్వనులు ఏవైతే ఉన్నాయో భగవత్ సంబంధమైన విషయ గోష్ఠులు అవే ఇక్కడ చల్ల చిలుకుతున్న సవ్వడులు. పైగా వారు ఎలా చల్ల చిలుకుతున్నారు అనేది చాలా గొప్ప విషయం. ఆ గోపికని పిచ్చిపిల్లా అని సంబోధించిన నోటితోనే నాయకురాలైన ఓ పిల్లా అన్నారు. నాయకుడు అంటే నడిపించు వాడు. మమ్మల్ని మీరు నడిపించాలి. భక్తి మార్గంలో మమ్మల్ని నడిపించాలి. పైగా తేశ ముడైయాయ్ - తేజస్సుతో ప్రకాశించుదానా! అని మరొక సంబోధన. ఆ భగవత్ గర్భితమైన తేజం.

నాయకప్పెణ్ణిళ్ళాయ్ ! నారాయణన్ మూర్తిఎప్పుడూ దేనిని చింతన చేస్తామో ఆ తత్త్వమే మనలో ప్రవేశించి తన్మయంగా మనం మారిపోతాం. ఎప్పుడూ కృష్ణ చింతన చేయడం వల్ల ఆ తేజోమూర్తియైన నారాయణుని తత్త్వము ఆ గోపికలో ప్రకాశిస్తూ ఉన్నది. అందుకు

తిర - అంటే తలుపు తెరువు. తలుపు మూసుకొని నిద్ర పోతున్నావేం? నీ ముందు ఆ నారాయణ గానం చేస్తూ మేల్కొల్పుతూన్నాం. మేల్కొని తలుపు తెరువు అంటున్నారు. పైగా మేము పాడుతున్న కేశవ కీర్తనలు నీకు వినపడలేదా? అని మరొక మాట ఉన్నది.



Copyright@gurujnanam.org

నారాయణన్ మూర్తి కేశావనై ప్పాడవుమ్ - నారాయణన్ మూర్తి అంటే నారాయణునియొక్క మూర్తి; నారాయణుడు అంటే విష్ణువు; విష్ణువు యొక్క మూర్తి అంటే ప్రకటింపబడిన స్వరూపాన్ని మూర్తి అని అంటాం. ఎక్కడో వైకుంఠంలో ఉన్న నారాయణుడు ప్రకటింపబడి కేశవుడయ్యాడు. కేశవుడు అంటే కృష్ణుడు అని అర్థం. నారాయణుడు కృష్ణుడై ప్రకటింపబడ్డాడు. అలాంటి కృష్ణ పరమాత్మను మేము గానం చేస్తూన్నాం. నువ్వింకా వినలేదా? అదేవిధంగా మేము ఇక్కడ నువ్వు ఏ పరమాత్మను ధ్యానిస్తూ వివశురాలవై నిద్ర అనబడే సమాధిలో ఉన్నావో ఆ పరమాత్మనే గానం చేస్తూన్నాం. ఆ పరమాత్మ కేశవుడు. అనగా కేశి అనే రాక్షసుడిని సంహరించినటువంటి నారాయణుడు. ఆయనని మేము గానం చేస్తూన్నాం. నీకు వినబడలేదా? మేలుకో. తలుపు తెరువు అని ఇక్కడ తల్లి పేర్కొంటోంది. విల్లిపుత్తూర్ నే వ్రేపల్లె అని అమ్మ ఇక్కడ సంభావించి కావేరీ నదిని యమునా తరంగాలుగా భావిస్తూ ఈ శ్రీవ్రతానికి తాను సిద్ధమై వెళుతూ ఉన్నది. అటువంటి తల్లికి నమస్కరిస్తూ
ఆండాళ్ తిరువడిగలై శరణం!!

DAY 8:

ముందుగా తూర్పు దిక్కు తెల్లవారింది అన్నారు. ఇక్కడ తూర్పు దిక్కు అంటే మంగళకరమైన దిశ. తెల్లవారింది అనగానే శుద్ధ సత్త్వ భూమిక ఉదయించింది. సత్త్వగుణం యొక్క రంగే తెలుపు. తెల్లవారింది అంటే ఇక్కడ సత్త్వగుణం ఉద్బుద్ధమైనది. భక్తికి ప్రధానం సత్త్వ గుణం. సత్త్వ గుణం లేని వాళ్లకి భక్తే లేదు. అందుకు సాధనకు ప్రధానమైనది శుద్ధమైన సత్త్వము గనుక "సత్త్వాత్ సంజాయతే జ్ఞానం" అని శాస్త్రం చెప్తున్నది. ఆ సత్త్వగుణంతో కూడిన జ్ఞానమే ఇక్కడ తూర్పు దిక్కు. ఉదయం అనగానే జ్ఞానోదయమే. అ ఉదయ స్థానం


Copyright@gurujnanam.org 

తూర్పు కనుకనే చక్కని శుద్ధ సత్త్వముతో కూడిన జ్ఞానము కలిగినది. ఈ జ్ఞానం కలుగగానే గేదేలన్నీ కూడా మేత కోసం వెళ్ళిపోయాయి అన్నారిక్కడ. గేదెలు అంటే నల్లగా ఉంటాయి. ఇవి రాజస, తామస ప్రవృత్తులకి సంకేతం. ఈ రాజస తామస ప్రవృత్తులు ఈ మనస్సు అనే కొట్టంలోంచి బయటికి పోయాయి. వాటి మేతల కోసం బయటికి పోయాయి. అంటే మనస్సులో శుద్ధ సత్త్వ జ్ఞానం ఉదయించితే రాజస తామసలు అంటే గేదెలు బయటికి పోయాయి. అప్పుడు భక్తి ప్రవృత్తులు మేల్కొని ఆ భగవదనుభూతి కోసం తాపత్రయ పడుతున్నాయి. ఆ భక్తి ప్రవృత్తులనన్నింటినీ ఒకచోట గుమిగూడేలా చేసి ఆచార్యుని శరణు వేడాలి. పోతున్న పిల్లలందరినీ ఆపి తీసుకువచ్చాం అంటే అర్థం ఏమిటంటే మేల్కొన్న భక్తిరూప భావనలే ఇక్కడ పిల్లలు. భావనలన్నీ ఒకచోట సమకూర్చుకొని ఆచార్యుని శరణువేడుచున్నాం. ఈ ఆచార్యుడు ఎటువంటి వాడు? భగవంతునిపై తీవ్రమైన కుతూహలము, ఆసక్తి కలిగిన మహాయోగి. కోదుకలముడైయ పావాయ్ అంటే ఇదీ అర్థం. అటువంటి ఓ స్వామీ! నీయొక్క ప్రేరణలో బోధనలో మేము ఆ పరమాత్మను గానం చేస్తాం. గానం చేస్తే ఆయన మాకు పరమును ఇస్తాడు. పరము అంటే పొందవలసిన కైవల్యాన్ని అతడు ప్రదానం చేస్తాడు. అతడు ఎటువంటి వాడు అంటే గుర్రాన్ని సంహరించాడు. గుర్రం అంటే దూకుడు తనానికి, మహా వేగానికీ సంకేతం. ఆగకుండా దూకే అహంకారమే ఇక్కడ గుర్రం. అహంకారం వల్ల కలిగిన తీవ్రమైన రాజస, తామస ప్రవృత్తులు లేదా అహంకార మమకారాలే చాణూర ముష్టికులు. వాళ్ళిద్దరినీ కూడా సంహరించిన వాడు నారాయణుడు. అనగా మనలో దుష్ప్రవృత్తులను సమూలంగా నాశనం చేసి పరమును ప్రసాదించుచుతాడు. ఎప్పుడైనా పరమపద ప్రాప్తి కావాలి అంటే మనలో దుష్ట ప్రవృత్తులు నశించాలి. దుష్ట ప్రవృత్తులు నశించాలి అంటే మార్గం ఏమిటి? - భగవన్నామ సంకీర్తన. ఆయన దివ్య గుణ పరిపూర్ణుడు గనుక ఆ అనంత కళ్యాణ


Copyright@gurujnanam.org

గుణమయుడైనటువంటి నారాయణుని గానం చేయడం చేత మనలో దుష్ప్రవృత్తులు నశించి పోతాయి. అప్పుడు పరమము లభిస్తున్నది. అందుకు దుష్ప్రవృత్తులు నశింపజేసేవాడూ ఆయనే, పరమ పదాన్ని ప్రసాదించే మోక్ష కారకుడూ ఆయనే. అందుకే ఆయన దేవాదిదేవుడు. చాలా చక్కటి మాట. దేవతలందరికీ ఆదియైన దేవుడతాడు.

పూర్తి నారాయణ భావాన్ని దేవాధిదేవ లక్షణాన్ని ప్రకటించిన దివ్యావతారం, పరిపూర్ణావతారం కృష్ణావతారం. అలాంటి దేవదేవుడిని మేము 'చెన్రు' - అంటే చేరుకొని; శేవిత్తాల్ - సేవించితే ఆయన మాపై దయ చూపిస్తాడు. ఎలా దయ చూపిస్తాడు అంటే

ఆవాపెన్రా రాయ్ న్ద్ - అంటే అయ్యో అయ్యో అని మన బాధలని పోగొట్టి; అరుళ్ - కృప చూపిస్తాడు. ఆవాపెన్ - అయ్యో అయ్యో అంటాడుట భగవానుడు. ఎవరైనా కష్టంలో వెళ్ళి శరణు వేడితే ముందు కావలసింది సానుభూతిగా మన కష్టాన్ని గ్రహించాలి. అయ్యో నీకు ఇంత కష్టం వచ్చిందా? నేను ఉన్నానులే, నీబాధ పోగొడతాను అని తర్వాత అభయమివ్వడం జరగాలి. ముందు చూపించేది సానుభూతి.సానుభూతి అంటే నీయొక్క కష్టాన్ని అర్థం చేసుకున్నాను. అందుకు జాలిని ప్రకటించాలి. ఆ జాలిని ప్రకటించడమే అయ్యో అయ్యో అనడం. వెంటనే ఏం చేస్తాడు? బాధలని పోగొడతాడు. ఊరికినే అయ్యో అయ్యో అని కూర్చోవడం కాదు. బాధను పోగొట్టాలి అందుకు ఆరాయ్ న్ద్ - బాధలను పోగొట్టాలి.బాధలను పోగొట్టి ఆరుళ్ - కృప చూపిస్తాడు. ఇక్కడ మూడు. మొదట మనయొక్క ఆర్తిని ముందు గమనించుట, తర్వాత వేదనని తొలగించుట, మూడవది సంపూర్ణమైన కృపను చూపించుట. ఈ మూడూ చేస్తాడు స్వామి. ఎప్పుడు? మనం పాడి ఆయనని చేరి సేవించితే. అంటే పాట ద్వారా మనకు ఆ భగవంతుని సన్నిధి కావాలి. ఆయనకి మనల్ని మనం అర్పించుకోవాలి. అది చేస్తే స్వామి తప్పకుండా జన్మజన్మల



Copyright@gurujnanam.org 

తాపాన్ని పోగొడతాడు. పైగా మర్యాదా పురుషోత్తముడు. అవతలి వాడి ఆర్తి ఏమిటో తెలితే ముందు ఎటువంటి పరిస్థితిలో తాను ఉన్నప్పటికీ చక్కగా ఆదరిస్తాడు. అలా ఆదరశీలుడైన కృపామయుడైన నారాయణుడు మనకు పరమును ప్రసాదిస్తాడు అని చెప్తూ ఉన్నది ఇక్కడ గోదాదేవి. ఆ తల్లికి నమస్కరిస్తూ

ఆండాళ్ తిరువడిగలై శరణం!!

DAY 9:

తూమణి మాడత్తుచ్చుట్రుమ్ విళక్కెరియ - తూమణి - పరిశుద్ధమైన మనస్సులు; తూ అనే మాటకి ఇక్కడ నిర్మలమైన అని అర్థం. ఈనిర్మలమైన మణులతో నిర్మించినటువంటి; మాడత్తు - అనగా సౌధం. ఆ సౌధంలో నిద్రిస్తున్నదిట. ఆ నిద్రిస్తున్నప్పుడు

చుట్రుమ్ విళక్కెరియ - అన్ని వైపులా దీపాలు ప్రకాశిస్తూ ఉండగా ఆ మధ్యలో నిద్రిస్తున్నది. దీపాలే కాదు, ధూపం కూడా ఉందిట. ధూపమ్ కమళ - ఇక్కడ కమళ అంటే పరిమళం. ధూపముయొక్క పరిమళాలు వ్యాపించి ఉండగా చక్కటి శయ్యపై ఉందిట. ఎలాంటి శయ్య అంటే ఆ శయ్య చూస్తుంటేనే నిద్ర వస్తుందిట. అంత చక్కగా అమర్చబడినటువంటి శయ్య.

త్తుయిలణై మేల్ కణ్ వళరుమ్ మామాన్ మగళే - అలాంటి శయ్య మీద హాయిగా కళ్ళుమూసి నిద్రపోతున్న ఓ మేనమామ కూతురా! మేనమామ కూతుర్ని మేల్కొల్పడమే కాకుండా అక్కడ అత్తకి కూడా చెప్తోంది

అవళై యెళుప్పీరో మామీర్ - అంటే ఓ అత్తా! నువ్వయిన లేపచ్చు కదా! అని చెప్పడంలో విశేషం ఏమిటంటే ఆ లేపడంలో ఇంట్లో వాళ్ళ సాయం తీసుకుంటున్నారు. అయితే ఇలా అంటున్నప్పుడు చనువు ఎక్కువ చూపించరు


Copyright@gurujnanam.org Sri Gurubhyo Namaha

కదా! ఆ చనువులో కొంచెం దెప్పిపొడుపులు కూడా కనిపిస్తూ ఉంటాయి. మాటలో కొంచెం వెక్కిరింతలు, ఇత్యాదులు కూడా గోచరిస్తున్నాయి. ఇది చనువు వల్ల వచ్చినటువంటి విషయం.

ఉన్ మగళ్ దాన్ ఊమైయో ? అన్రిచ్చెవిడో ? అనన్దలో - అంటే నీకూతురికేమి మూగతనం వచ్చిందా? లేక చెముడా? లేక జడురాలా? ఎంత మేము పిలుస్తూ ఉన్నా లేవడం లేదు.

ఏ మప్పెరున్దుయిల్ మన్దిరప్పట్టాళో ? - పెద్ద నిద్ర పట్టేటట్లుగా ఎవరైనా మంత్రం వేశాడా? ఎంత లేపినా లేవడం లేదంటే ఎవడైనా పెద్ద మంత్రం వేశాడా నిద్రపట్టేటట్లు. అయితే ఈమెని లేపాలి. ఎందుకు? ఆమె కోసం కాదు మాకోసం. మాకు ఆ మహాయోగినియొక్క సహవాసం కావాలి. ఆమె సాన్నిధ్యం చేత ఆ గోపీ భావం బాగా మాకు వస్తేనే మేము పరమాత్మను చేరగలం. అందుకే ఆ గోపీ భావంలో ఆ యోగినియొక్క దివ్యానుగ్రహం మనకు కావాలి. మనం మేల్కొలపాలి. ఓ అత్తా! మేల్కొలుపు. ఎంత లేపినా లేవడం లేదని మీరే చెప్తున్నారు కదా! నేనెలా మేల్కొల్పాలి అని అంటే ఆ చెవి దగ్గరికి వెళ్ళి మేము చెప్పిన మాటలు అను. అప్పుడు లేస్తుంది. ఏమిటా మాటలు? అంటే మామాయన్ మాధవన్ వైకున్దన్ - మామాయన్ అంటే ఓ మాయావీ! మాధవా! వైకుంఠా! అంటూ

నామమ్ పలవుమ్ - అనేక నామములు పలుకు అని. అంటే విష్ణు నామములు ఆ చెవి దగ్గర పలికితే ఆమె మేల్కొంటుంది. ఇంక వేటికీ బయటికి రాదు ఆవిడ. ఈ నామములు ఆ చెవివద్ద పలుకు.

ఎన్రెన్రు - అంటే అని అని అర్థం. ఆ మాటలు అంటూ అంటూ ఉంటే ఆ భగవంనామములు పైగా పక్తి రెండు కాదు 'పలవుం' - అనేకములను


Copyright@gurujnanam.org

నవిన్రు - కీర్తించు. భగవన్నామాలని అసంఖ్యాకంగా కీర్తిస్తే ఆమె వెలికి వచ్చి మమ్మల్ని అనుగ్రహిస్తుంది. ఈ చెప్పడంలో విశేషం ఏమిటంటే భగవదనుభూతిలో ఉండేటటువంటి వారు ఆ దివ్యానుభూతి నుంచి బయటికి రారు. వాళ్ళు బయటికి రావాలంటే ఆ అనుభూతిలో ఏ విషయం ఉందో వెలుపల అది ఉండాలి. అందుకే బయట కూడా భగవత్సంకీర్తనం చేయమని ఇక్కడ చెప్తున్నది. ఇలా ఈ ప్రాతఃకాల ఆ భాగవత శిఖామణియైనటువంటి తల్లి ఈవిధంగా గోపికా భావాన్ని తాను ఆశ్రయించుతూ ఈ దివ్యమైన సమాధి భూమికలను తానే పొందుతూ ఉన్నది. గోపీ తత్త్వాన్ని మొత్తం తనలో అలవరచుకొని ఆ గోపీమయమైన భావనలో ఉంది కనుకనే గోపీ జన వల్లభుడైనటువంటి శ్రీకృష్ణ పరమాత్మను పొందగలిగింది ఆ తల్లి. మనకీ ఆ దివ్య మార్గాన్ని చూపిస్తున్నది. ఆ కృష్ణ కీర్తన చేయించి మనలో ఉన్నటువంటి కల్మషాలను తొలగించి నారాయణుని అనుగ్రహం పొందేలా చేస్తున్నటువంటి ఈ తొమ్మిదవ రోజు పాశురంలో ఇంత దివ్యమైన భావం మనకు కనపడుతూ ఉన్నది. అటువంటి ఆ తల్లియొక్క దివ్య చరణాలకు నమస్కరిస్తూ ఆండాళ్ తిరువడిగలై శరణం!!

DAY 10:

ఇందులో మేల్కొల్పబడుతున్నటువంటి ఆ తల్లియొక్క ప్రత్యేకత సంబోధనలో విశేషంగా చూపిస్తున్నది అమ్మ.

నోట్రుచ్చువర్కమ్ పుహిగిన్రవమ్మనాయ్ - అంటే నోము నోచుకొని అప్పుడే స్వర్గాన్ని పొందినట్లుగా ఉన్నటువంటి ఓ అమ్మా! ఇక్కడ చెప్పడంలో విశేషం ఏమిటంటే మనందరం కూడా తెల్లవారుఝామున బద్ధకాన్ని విడిచిపెట్టి నది నీటికి స్నానానికి వెళ్ళాలి. ఇది మన వ్రతం. అందుకు పొద్దున్న లేచి అందరం వచ్చాం. నువ్వింకా సిద్ధం కాలేదా? ఇంకా నిద్రపోతున్నావా? లే. ఈ నిద్ర పోవడం ఎలా


Copyright@gurujnanam.org

ఉన్నదంటే అనుకున్న పని చేసేసిన వాడు హాయిగా నిద్రపోతాడు.

నోట్రుచ్చువర్కమ్ - ఇక్కడ చువర్కం అంటే స్వర్గం. నోము నోచుకొని స్వర్గంలో ప్రవేశించినట్లు ఆనందంగా నిద్రపోతున్న అమ్మాయీ! నువ్వు తలుపు తెరవడం లేదు సరే! కొంచెం మాటలైనా మాట్లాడరాదా!

మాట్రముమ్ తారారో - మాట్లాడడం కూడా వీలుకాదా?

వాశల్ తిరవాదార్ - తలుపే తెరవలేదు అసలు. పోనీ మాట్లాడవచ్చు కదా! అని. ఎందుకంటే మనం చేస్తున్నటువంటి ఈ వ్రతానికి ఆ నారాయణుడు పరమును ఇస్తాడు. మాటిమాటికీ కూడా వ్రతం యొక్క లక్ష్యం ఏమిటో మర్చిపోకూడదు. ఈ వ్రతాచరణ చేస్తున్నప్పుడు ఆ ఆచరణలో ఉన్న విషయములపై మన జాగ్రత్త, శ్రద్ధ ఉండాలి కానీ లక్ష్య శుద్ధి ఉండాలి. ఎవరికోసం, దేనికోసం ఇది చేస్తున్నాం? నారాయణుని యొక్క అనుగ్రహం కోసం. నారాయణ స్మరణ ఈ ఆచరణ సమయంలో ఉంటూ ఉండాలి. అందుకే మనం ఏ పూజ చేసినా పునస్కారం చేసినా వ్రతాలు చేసి నియమాలు పాటించినా దానికి లక్ష్యమైన భగవంతుని ధ్యానం నుంచి మాత్రం జారిపోకూడదు. అందుకే ఇక్కడ మాటిమాటికీ ఆ నారాయణుని స్మరిస్తున్నది. ఎటువంటి నారాయణుడు అంటే

నాట్రత్తుళాయ్ ముడి - అనగా పరిమళాలు వెదజల్లుతున్నటువంటి, తులసిని ధరించినటువంటి

నారాయణన్ - నారాయణుడు; తులసిని దాల్చిన నారాయణుడు. తులసీ వనమాలా భూషితుడాయన. ఎటువంటి తులసి అంటే పరిమళాలు వెదజల్లుతున్నది. తులసి అంటేనే ఒక దివ్యమైన సాత్త్విక భావం మనకి కనిపిస్తోన్నది. దానిని ధరించి ఉన్నాడు నారాయణుడు. అది పరిమళం కూడా. సర్వవ్యాపకంగా అది భాసిస్తున్నది. అంటే నారాయణుని యొక్క ఉనికి ఆ పరిమళ రూపంలో తెలుస్తోంది. అలాంటి స్వామిని


Copyright@gurujnanam.org Sri Gurubhyo Namaha

నమ్మాళ్ పోట్ర - మేము ఆయనని మంగళ కీర్తనలు చేస్తున్నాం. ఆయనపట్ల మంగళములు పలుకుతూన్నాం. అలా మంగళ గానం చేస్తే ఆయనేం చేస్తున్నాడు?

ప్పరైత్తరుమ్ పుణ్ణియనాల్, - మనకు పరము ఇచ్చేటటువంటి పుణ్యాల రాశి అతడు. మనము ఆయనపట్ల మంగళ కీర్తన చేస్తే ఆ కీర్తనలకి ఫలంగా ఆయన మనకు పరమును ఇస్తాడు. ఆయన పుణ్ణియనాల్ - చక్కటి మాట ఇది. పుణ్యాల రాశిట ఆయన. పుణ్య స్వరూపుడు. అసలు భగవానుడే పుణ్య స్వరూపుడు. పాపమనేదే ఏదీ లేదు ఆయన దగ్గర. పాపం అంటే దోషం అని అర్థం. దోషమేమీ లేదు ఆయన దగ్గర. పుణ్య స్వరూపుడు. ఆయన అనుగ్రహం కోసం మనం ఈ సాధన చేస్తున్నాం. ఈ సాధనకి వెళుతూ ఉండగా నీకీ నిద్ర ఏమిటి? వల్లమాలిన నిద్ర ఇది. కూడదు సుమా! ఈ నిద్ర చూస్తూ ఉంటే కుంభకర్ణుడి నిద్ర అంతా నీదగ్గరికి వచ్చినట్లుంది. కుంభకర్ణుడు తమోగుణానికి పెద్ద ప్రతీక. వాడికి రెండే తెలుసు. తినడం పడుకోవడం. మరొకటి తెలియదు. తినడం కూడా ఎందుకంటే నిద్దర్లో పోకుండా ఉండడం కోసం తింటాడుట. కనుక వాడి జీవిత లక్ష్యం ఏమిటయ్యా అంటే తినడం, నిద్ర పోవడం. అందుకు ఇక్కడ చెప్తున్న మాట ఏమిటంటే ఈ కుంభకర్ణుడు ఏమయ్యాడు? గతంలో మరణించాడు. ఎవరి చేతిలో మరణించాడు. ఈ కృష్ణుడే రాముడై ఆనాడు సంహరించాడు.

పణ్ణొరునాళ్, కూట్రత్తిన్ వాయ్ విళన్ద కుమ్బకరుణనుమ్ - పణ్ణొరునాళ్ - అంటే పూర్వం ఒకప్పుడు

కూట్రత్తిన్ వాయ్ విళన్ద -మృత్యువు నోట్లోకి తోయబడినటువంటి

కుమ్బకరుణనుమ్ - ఆ కుంభకర్ణుడు. అంటే నారాయణుడి చేత సంహరింపబడినటువంటి కుంభకర్ణుడు

తోట్రు మునక్కే - ఆయన ఓడిపోతూ



Copyright@gurujnanam.org 

పెరున్దుయిల్ తాన్ తన్దానో ? - ఓడిపోయి వెళ్ళిపోతూ ఆ నిద్రంతా నీకిచ్చేశాడా? ఏమిటి? ఆయనేమో ముక్తి పొందిపోయాడు. నిద్ర ఎక్కడికి పోతుంది? ఆ నిద్రకానీ నికిచ్చాడా? అలా నిద్ర పోతున్నావు నువ్వు.

ఆట్రవనన్దలుడై యా య్ - అని చెప్పినప్పుడు గొప్ప మత్తులో ఉన్నదానా! అని అర్థం. పైగా పోనీ మత్తులో ఉన్నావు అని ఇది నిదా వాక్యమా అంటే వెంటనే మరొక వాక్యం ఉంది చూడండి.

అరుంగలమే - చక్కటి మాట ఇది. అంటే అరుదైనటువంటి ఓ భూషణమా! అని అర్థం. అలంకారామా! అని చెప్పడంలో ఇది మామూలు నిద్ర కాదు అని మనకు తెలుస్తున్నది. ఈ కుంభకర్ణ ఇవన్నీ బాహ్య శబ్దములు. కానీ ఒక దివ్యమైన అనుభూతిలో ఉండి ఏమాత్రం బాహ్య స్మృతి లేనటువంటి సిద్ధావస్థను తెలియజేస్తున్నది. ఆ సిద్ధావస్థలో ఉన్నటువంటి గోపికయొక్క భావమున్నదే అది అరుంగలమే - అదే గొప్ప అలంకారం. భగవదనుభూతితో సర్వాన్ని విస్మరించడం కంటే గొప్ప అలంకారం ఉంటుందా? అందుకే ప్రపంచ విస్మృతి, భగవత్ స్మృతి. ఈ రెండూ చాలా విశేషం. జగద్విస్మృతి, భగవత్స్మృతి.

తేట్రమాయ్ వన్దు తిర - నువ్వు తేరుకొని వచ్చి; తిర - అంటే తెరువు, మూసినా తలుపులు తెరువు తేరుకొని వచ్చి. అంటే సమాధి స్థితి నుంచి వెలికి వచ్చి నువ్వు ఈ తలుపు తెరిచి అనుగ్రహించు.

DAY 11:

ఇందులో మేల్కొల్పబడుతున్నటువంటి గోపికని సంబోధిస్తూ గొప్ప వంశంలో పుట్టినదానా! అన్నారిక్కడ. వంశంయొక్క వైభవాన్ని ఎక్కువ వర్ణించారు. ఏమిటా వంశం? - గోప వంశం. అంటే గోపకుల వంశంలో పుట్టినటువంటి గోపిక. పైగా ఈ గోపిక శెల్వప్పెణ్ణాట్టి ! - అంటే సంపన్నురాలా! అని అర్థం. సంపన్నురాలైన ఓ



Copyright@gurujnanam.org 

అమ్మా! అని. ఏమిటా సంపద? అంటే భగవత్ గుణ సంపద కలిగి ఉండడమే గొప్ప సంపద. భక్తి సంపద కలిగిన భక్తురాలు ఈవిడ. ఈ సంపదలన్నీ కూడా బాహ్య వర్ణనలు లేవు. ఇవన్నీ కూడా దివ్యమైన భక్తి సంపదలనే వర్ణిస్తున్నారు. ఎటువంటి వంశంలో పుట్టావు నువ్వు అంటే అది కపటము లేని, దోషము లేని వంశము.

కుట్రమొన్రిల్లాద కోవలర్తమ్ పొర్కొడియే - కుట్రమొన్రిల్లాద - అంటే ఏవిధమైన దోషమూ లేనటువంటి; కోవలర్తమ్ - గోపాల వంశంలో; పొర్కొడియే - బంగారు తీగలా పుట్టినటువంటిదానా! బంగారు తీగలా ఉందిట ఆమె. బంగారు తీగ అంటే శుద్ధమైన, ప్రకాశవంతమైన జ్ఞాన తత్త్వమే ఇక్కడ సువర్ణము. అలాంటి తీగలా ఉన్నది.

కట్రుక్క ఱ పైక్కణంగళ్ పలక అన్దు - దూడలు ఎన్నో కలిగినటువంటి అనేకములైన ఆవుల మందలని పితికేటటువంటి సమర్థత గలవారు అని అర్థం. గోపకులలో నిపుణత్వం ఏమిటి? - అతి తేలికగా అతి తక్కువ సమయంలో ఎక్కువ ఆవుల పాలు పితకగలగాలి. అటువంటి వారు. పైగా ఆవులు ఎటువంటివి? గొప్ప దూడలు కలిగినటువంటి ఆవులు. ఇందులో ఉన్న ప్రత్యేకతను పరిశీలిద్దాం. అయితే కేవలం పాలు పితకడమే కాదు. వాళ్ళు శౌర్యవంతులు కూడా.

శట్రార్ తి ఱలళియచ్చెన్రు శెరుచ్చెయ్యుమ్ - దీనియొక్క బావం ఏమిటంటే శత్రువులయొక్క బలం తరిగిపోయేలాగ వాళ్ళపై దాడిచేసి యుద్ధం చేయగల నైపుణ్యం కలిగినటువంటి వారు. అంటే పాలు పితికేటటువంటి సమర్థతా ఉంది, వాళ్ళను బాధించే శత్రువులని ఎదుర్కొనగలిగే ప్రతాపము కూడా ఉన్నది. ఆ రెండూ ఉన్నది. ఇక్కడ చెప్పడంలో ఆ గోపకుల వంశ వైభవాన్ని చెప్పడమే కాదు ఆ గోపకులలో ఒకడైన వాడు కృష్ణపరమాత్మ. ఆయన ఎటువంటి వాడు? ఆయన


Copyright@gurujnanam.org

పాలూ పితక గలడు, అవసరమైతే శత్రువులను అవలీలగా సంహరించగలడు. అలాంటి గోపనాధుడైన కృష్ణపరమాత్మకు చెందినదానా! ఇందులో భావాన్ని పరిశీలిద్దాం. గోవులు అన్న మాటకి శాస్త్ర సిద్ధమైన అర్థం ఏమిటంటే వేదమంత్రములే గోవులు. ఆ వేదమంత్రములకు దూడలు ఉన్నారుట. దూడలు అంటే ఋషులు అని అర్థం. భాగవతంలో మనకు ఈ పరిభాష కనపడుతూ ఉంటుంది. అందుకు వేదమంత్రములు గోవులు, ఋషులు దూడల వంటి వారు. అంటే ముందు దూడలు చేపితేనే మనకు పాలు దొరుకుతాయి. అలాగే ఋషుల వల్లనే మంత్రములు దివ్యమైన ఫలాలు మనకిస్తాయి. ఆ భావనతో ఇక్కడ చెప్తున్నారు. అందుకు అనేకమంది ఋషులు కలిగినటువంటి ఈ వేదమంత్రములు అంటే గోవుల సారాన్ని వాళ్ళు పిండారు. అంటే వేదమంత్రముల యొక్క సార స్వరూపమైన భగవత్ జ్ఞానాన్ని వాళ్ళు పొందారు అని అర్థం. అంతేకాదు సాధన చేసి జ్ఞానం పొందడమే కాదు శత్రువుల బలాల్ని వాళ్ళు తృణీకరించి ఓడించారు. దీని అర్థం ఏమిటంటే జ్ఞాన సాధనలో ఉండవలసినది శత్రువులను జయించగలగటం. ఇక్కడ శత్రువులు అంటే బాహ్యమైనటువంటి పెద్ద పెద్ద యోధులు అని అర్థం కాదు ఇక్కడ. ఇక్కడ శత్రువులు అంటే కామక్రోధలోభాది దుర్వికారాలు. ఇక్కడ దివ్యమైన వేదవాక్యముల ద్వారా భగవత్తత్వాన్ని తెలుసుకొని వాళ్ళు ఈ కామక్రోధాధి శత్రువులను జయించారు అని అర్థం. అసుర ప్రవృత్తులను జయించారు. అటువంటి వారు మహాత్ములు, గోపకులు. అలాంటి వారి వంశంలో ఈమె కలిగినది. అంటే భాగవత పరంపర కలిగినది. పైగా కుట్రమొన్రిల్లాద - ఏమాత్రం దోషం లేని అర్థం. భాగవతులు నిష్కపటమై, నిర్మలమైన శుద్ధమైన చిత్తవృత్తి కలిగినటువంటివారు. అలా నిర్మలమైన ఆ భాగవత పరంపరకి చెందిన ఓ తల్లీ! నువ్వు బంగారు తీగవి. పొర్కొడియే - అంటే బంగారు తీగె అనడంలోనే అక్కడ సువర్ణమయమైనటువంటి


Copyright@gurujnanam.org 

దివ్య తత్త్వాన్ని చెప్తున్నారు. ఇక్కడ సంబోధనలో పరాకాష్టకు చెందిన శబ్దం వాడింది తల్లి గోదాదేవి.

పుట్రరవల్ గుల్ పునమయిలే - అంటే ఒక పుట్టలో పాము ఎలా ఉంటుందో అలాంటి నితంబము కలిగిన దానా! అని. నితంబము అంటే పిరుదులు అని అర్థం. ఇక్కడ మనం భావన పరిశీలిస్తే చక్కని జడ, ఆ జడ పిరుదుల దాకా ఉందిట. ఇలా చెప్పడమే కాదు. మరొకవైపు అందమైన మాట పునమయిలే - అంటే విచ్చుకున్న పింఛంతో ఉన్నటువంటి నెమలి వంటి దానా! అని. పింఛం విచ్చుకున్నట్లుగా ఉన్నది. అలాంటి ఒక మహాయోగినియై కుండలినీ యోగ సిద్ధి పొందినటువంటి యోగీశ్వరి వంటి ఓ గోపికా! పోదరాయ్ - వెళదాం పద. ఎక్కడికి? దివ్యమైన స్నాన వ్రతానికి మనం ఇప్పుడు బయలుదేరదాం. పైగా నీయొక్క దివ్య తత్త్వముకి మేము పరవశించి ఇక్కడికి వచ్చాం. నీయొక్క చెలులము, నీయొక్క బంధువులము. శుట్రత్తుతోళిమా - శుట్రము - దీనినుంచే మనకు చుట్టము అనే మాట వచ్చింది. ఈ చుట్టాలు ఇక తోళిమార్ అంటే తోడు ఉన్నటువంటి చెలులు, వీళ్ళందరూ కలిసి ఇక్కడికి వచ్చి గానం చేస్తున్నారు. ఎక్కడ అంటే నీ ముంగిట. నీ ముంగిటకి చేరుకొని

పుహున్దు ముగిల్వణ్ణన్ పేర్పాడ - ఇక్కడకి వచ్చి నీ ముంగిట నిల్చొని గానం చేస్తున్నాం. మేఘవర్ణునియొక్క; పేర్పాడ - నామములను కీర్తన చేస్తూ ఉన్నా ఇంకా

శిట్రాదే పేశాదే - కదలవేమి? మాట్లాడవేమిటి? అలా కదలకుండా మాట్లాడకుండా నీ ఎట్రుక్కు రంగమ్ పొరు - నీయొక్క నిద్రకు ఏమిటమ్మా అర్థము? అంటున్నారిక్కడ.

DAY 12:



Copyright@gurujnanam.org 

విష్ణుచిత్తుల వారి ఇంట ఉద్భవించిన తల్లి మనందరికీ కూడా దివ్యమైనటువంటి మధుర భక్తి మార్గాన్ని ఉపదేశించినటువంటి ఆండాళ్ళమ్మ గోదాదేవి అనుగ్రహించిన పాశురాలలో 12వ పాశురాన్ని ఈరోజు ప్రస్తావన చేసుకుంటూ ఉన్నాం.

ఈదివ్యమైన పాశురములలో ఆ గోపకాంతని మేల్కొల్పుతున్నది. ఇది కూడా ఇక్కడ గోపకాంత అన్నప్పుడు దివ్యమైనటువంటి భగవత్ భావనా భూమికలో తాదాత్మ్య స్థితిలో ఉంటూ బహిర్ముఖత్వము లేని ఆచార్యుని ఆశ్రయించినటువంటి శిష్యులుతమకు దివ్యమైన భక్తి మార్గాన్ని నిర్దేశించమని ప్రార్థిస్తున్న భావమే ఇందులో కూడా దర్శిస్తూ ఉన్నారు.

కనైత్తిళం కట్రెరుమై - ఇక్కడ మొట్టమొదట కనైత్తు అనే మాట మొదలవుతున్నది. అంటే అరచి అని అర్థం. గేదెలు అరుస్తున్నాయి అని. ఇది కూడా తెల్లవారుఝామున ఉన్న వాతావరణాన్ని చూపిస్తుంది. ఎలాంటి గేదెలు అంటే

ఇళంగత్తు ఎరుమై - అంటే లేగదూడలు కలిగినటువంటి గేదెలు. అవి దూడలకోసం అరుస్తున్నాయి. ఆ అరుస్తూ ఉండగా; పైగా

ఇరంగి - ఆ దూడల పట్ల జాలి, వాత్సల్య భావం కలుగుతూ ఉన్నది. దగ్గరలో ఆ దూడలు లేవు. కనుక దూరంగా ఉన్న దూడల కోసం వాత్సల్య భావంతో జాలి కలిగి అరుస్తున్నటువంటి ఆ గేదెలయొక్క పొడుగులలో నుంచి తమంత తాముగా పాలు స్రవిస్తూ ఉన్నాయి. ఎందువల్ల అంటే



Copyright@gurujnanam.org 

నిస్తైత్తుముల్లై వళియే నిన్రుపాల్ శోర - అంటే ఆ దూడలను తలంచుకుంటున్నాయి. దగ్గరలేని దూడలని వాత్సల్య భావంతో తలంచుకోవడం వల్ల ఆ పొదుగులో క్షీరము తమంత తాము స్రవిస్తున్నాయి. ముల్లై వళియే - అంటే ఆ పొదుగుల యొక్క శిరములనుంచి; నిన్రు - నిండుగా ఎడతెగకుండా; పాల్ శోర - పాలు కారుతూ ఉన్నాయి. ఆ కారణం చేత ఆ ప్రాంతమంతా తడిసిపోయింది పాలతో.

నస్తైత్తిలమ్ శేరాక్కుమ్ - ఆ పాలతో తడిసిన మట్టి ఒక చిత్రమైన బురదగా మారింది. అలాగ ఎవరియొక్క గేదెలు యొక్క పాలు బురదగా మారాయో ఆ గేదెల యజమానియైనటువంటి ఒక మహానుభావుడున్నాడు, గోపకుడు. ఆ గేదెల యజమానియొక్క చెల్లెలా! నిద్రలే అన్నారిక్కడ. ఇక్కడ చిత్రమైన సంబోధన ఉంది. ఓ గోపికా నిద్రలే అనే భావమైనా ఈ గోపిక ఎవరు? ఒక గోపకునియొక్క చెల్లెలు. ఆ గోపకుడు ఎవరు? అంటే అతని దగ్గర ఆవులు, గేదెలు ఎన్నో ఉన్నాయి. ఆ గేదెల పాలు తమంత తాము స్రవించి ఆ భాగమంతా బురదతో ఉన్నది. ఇక్కడ ఎలాంటి భావము అంటే పొద్దున్నే ఇక్కడ ఈ గోపకాంతలు శ్రీవ్రతం చేద్దాం అని చెప్పి స్నానానికి బయలుదేరారు. వెళుతూ ఈ గోపికను కూడా నిద్రలేపడానికి ఆమె ఇంటికి వెళ్ళారు. వెళ్ళేటప్పటికల్లా ఆ యింటి భాగమంతా ఎలా కనిపించింది అంటే ముందున్న మట్టి భాగమంతా బురద బురదగా ఉంది. ఆ బురద ఎక్కడిది? అక్కడునటువంటి గేదెలు, ఆవులు, వాటి యొక్క పాలవల్ల వచ్చిన బురద. నీటివల్ల వచ్చిన బురద కాదు. ఆ పాలు ఎలా కింద పడిపోయినయ్యి అంటే అవి తమంత తాము స్రవించాయి. ఇప్పుడు ఈ క్రింది భాగమంతా తేమతేమగా ఉంది నీ ఇంటికి వచ్చేటప్పటికీ. పైభాగం కూడా తడితడిగానే ఉన్నది. ఆకాశంలోంచి మంచు పడుతోందిట.


Copyright@gurujnanam.org

పనిత్తెలై వీళ నిన్ వాశల్ కడైపట్రి - పనిత్తెలై వీళ అన్నప్పుడు పైనుంచి పడుతున్న మంచుతో తల తడిసిపోతూ ఉన్నది. అందుకు ముందు మంచు పడకుండా ఉండడం కోసం అని; ద్వారం దగ్గరకు కదిలాము. నిన్ వాశల్ కడైపట్రి. ద్వారం వద్దకు రాగానే కింద మట్టియొక్క తేమ ఉన్నది. పైన మంచుయొక్క తేమ ఉన్నది. ఆ కారణం చేత క్రింద కాలుపడి జారిపడిపోకుండాను, పైన మంచుపడి తడిసిపోకుండానూ ఆ ద్వారం దగ్గరికి చేరి పైన ఉన్నటువంటి దూలము, కమ్మి అంటారు ఆ దూలాన్ని పట్టుకొని నిలబడి ఉన్నాము మేము. నిలబడి ఆ నారాయణుని గానం చేస్తూ నిన్ను లేపుతున్నాము. ఇంకా నిద్రలేవవేమి? ఆమె పరంపర, ఆమె ఇంటియొక్క సంసారం ఎటువంటిది అంటే గొప్ప సంపన్నమైన, సంస్కారవంతమైన కుటుంబములో ఆమె పుట్టింది. ఆ సంపద ఎంత అంటే గొప్ప గో సంపద ఉంది వాళ్ళ దగ్గర. గోవులు తమంత తాము స్రవిస్తున్నాయి. ఇందులో ఉన్న భావాన్ని పరిశీలించాలి. ఇక్కడ దూరంగా ఉన్న దూడాలని తలంచుకుంటే ఆవులో వాత్సల్య భావం పొంగి ఆ మాతృవాత్సల్యంతో క్షీరం తమంత తాము స్రవించింది. దీనిలో భావం ఏమిటంటే వాత్సల్యం కలిగినప్పుడు హృదయం నిండుగా ఉన్నటువంటి ఆ అమృత భావన పైకి పొంగి వ్యక్తమవుతున్నది. అలాగ శిష్యులు దూరంగా ఉన్నప్పటికీ కూడా ఆచార్యుడు కరుణతో వారిని తలంచుకోగానే ఆయన హృదయం నిండా ఉన్న భగవదనుభూతి భగవత్ జ్ఞానము అనే క్షీరము వెలికి వస్తోంది. చక్కటి భావన ఇది. సాధారణంగా అనుభూతి కలిగినటువంటి వారు, సాధన చేసినటువంటి వారు, సిద్ధి పొందిన వారు, జ్ఞానులైన భక్తులు అనుభూతితో నిండిపోతారు. అలా నిండి పోయినటువంటి వారికి శిష్యులపై వాత్సల్యం కలిగితే అనుభూతి, ఆ జ్ఞానం ఉపదేశంగా వెలికి వస్తుంది. ఇక్కడ వాత్సల్య భావం అంటే దూడ, ఆవుకి



Copyright@gurujnanam.org 

ఉన్నటువంటి ఆ ప్రేమ బాంధవ్యాన్ని మనం వాత్సల్యం అనచ్చు. పెద్ద వాళ్ళకి పిల్లల పట్ల ఉన్న ప్రేమని వాత్సల్యం అని అంటారు. అలా గురువులకి కూడా శిష్యులపట్ల వాత్సల్యం ఉంటుంది. లేకపోతే ఏం చూసి జ్ఞానాన్ని ఉపదేశిస్తారు వాళ్ళు? ఇచ్చే దక్షిణలు చూసి కాదు. వాళ్ళ యోగ్యతలు చూసి వీళ్ళ మనసు కరిగి చెప్పాలి. ఈ దివ్యమైన ఆచార్య స్వరూపమైనటువంటి ఆళ్వార్ రూపిణియైన గోపిక ఉన్న ఇల్లు అటువంటి భగవదనుభూతితో తడిసిపోయింది. ఆ ఇంటి పరంపర అంతే. అందుకే ఇంటి యజమానికి చెల్లెలా అన్నప్పుడు ఆ అనుభూతి అటువంటిది. ఆ యింటినిండా ఉన్నది. భగవదనుభూతితో తేమ అయింది. పైనుంచి పడుతున్న మంచు కూడా తెల్లని తేమ. చల్లదనమూ, తేమ, రెండూ ఉన్నాయి. అందులో భాగం. ఇదేమిటంటే పైనుంచి పడుతున్న మంచు అన్నప్పుడు ఇక్కడ శాస్త్రములనుంచి బ్రహ్మ జ్ఞానులయొక్క అనుభూతులలోనుంచి కురుస్తున్న బోధ అనేటటువంటి ఆర్ద్రమైన జ్ఞానవృష్టి అది. అటువంటి జ్ఞానరూపమైన, భక్తిరూపమైన వృష్టి పైనుంచి కురుస్తున్నది. ఇతను భగవదనుభూతి కలిగినటువంటి మహాత్ముడు అనేటటువంటి పేరు జగత్తులో వ్యాప్తి చెందిపోయింది. పైగా అటువంటి నిన్ను మేము మేల్కొల్పుతున్నాం. మా మేలుకొలుపు విని దయచేసి రావమ్మా! అని అంటూ ఉన్నారు. ఇక్కడ రామచంద్రమూర్తి గురించి చెప్పేటప్పుడు కోపగించుకోని అన్నారు. రామచంద్రమూర్తికి కోపం ఉందా? అంటే జితక్రోధుడు. ఆయనకు కోపం లేదు. కానీ జగద్రక్షణ కోసం ఆయన చూపించినటువంటి ధర్మాగ్రహం ఉన్నదే అది కూడా మనస్సుకు ఆహ్లాదం. భగవత్ కథ మనస్సుకు ఆహ్లాదం. పైగా రామచంద్రుడు, ఆయనను చూసినా ఆయనను తలన్చుకున్నా మనస్సు పరవశిస్తుంది. అందుకు


Copyright@gurujnanam.org

మనత్తుక్కినియానై - మనస్సును పరవశింపజేసే ఆ రామచంద్రుని గానం చేస్తూ ఉన్నాం. మేల్కొను తల్లీ! అని ప్రార్థిస్తున్నది ఇక్కడ ఆండాళ్ళమ్మ.

DAY 13:

అమ్మ గోదాదేవి మార్గళి వ్రతంలో అనగా ధనుర్మాస వ్రతాన్ని ఆచరిస్తూ కృష్ణాంకితమైన భావాలతో పలికిన పాశురాలలో పదమూడవ దినమునాటి పాశురము – ఇది కూడా దివ్యమైనటువంటి ప్రబోధమే. భాగవత ప్రబోధంగా యోగాస్వరూపులైనటువంటి భాగవతులను మేల్కొల్పేటటువంటి కీర్తన ఇది.

ఇక్కడ మేల్కొల్పబడుతున్నటువంటి గోపిక మరొక విలక్షణమైన భావనతో చెప్పబడుతున్నది. ఇందులో పావాయ్ అనేటటువంటి సంబోధన ఉంది. అంటే ఓ సుకుమారీ అని అర్థం. సుకుమారియైన ఓ గోపికా! ఇంకా పడుకున్నావా? మేమందరం కూడా చల్లగా ఈ పవిత్రమైన రోజులలో

నన్నాళాల్ – అంటే మంచి రోజులు; మార్గళి వ్రతం; ఈ వ్రతం చేస్తున్న పవిత్రమైన రోజులలో స్నానం చేయాలని బయలుదేరుతూ ఉంటే నువ్వింకా స్నానానికి సిద్ధపడకుండా ఇంకా నిద్రిస్తున్నావేం? కపటాన్ని విడిచిపెట్టి మాతో కలియు అంటున్నారిక్కడ.

కళ్ళమ్ తవిర్ న్దు కలన్ద్ – ఇక్కడ కళ్ళం అంటే కపటం; కల్లాకపటం అంటాం; అలాంటి కపటాన్ని విడిచిపెట్టి మాతో కలియు అని మేల్కొల్పుతూ ఉన్నారు. ఇక్కడ మేము గానము చేస్తూ వెళ్తూ ఉన్నాం. పైగా మాతోపాటు బయలుదేరిన వ్రతం చేసే గోపికలు కూడా గానం చేస్తూ వెళ్తున్నారు. ఆ రోజులలో గోపికలందరూ కాత్యాయనీ వ్రతం చేసేటప్పుడు వాళ్ళందరి లక్ష్యం ఒక్కటే. అది కృష్ణ పరమాత్మని



Copyright@gurujnanam.org 

పొందాలి అని. అదేవిధంగా వ్రతం చేసే విధానమూ ఒకటే. ఆ పద్ధతిలోనే ఇక్కడ అనేకమంది గోపికలతో వ్రతం చేస్తున్న భావనను అనుభవిస్తూ ఉన్నది గోదాదేవి.

ప్పిళ్ళైగళ్ – అంటే పిల్లలు; పిల్లలు అన్నప్పుడు ఇక్కడ గోపకాంతలు అని అర్థం. పిల్లలు అని ఎందుకు చెప్పారు అంటే జ్ఞాని ఎప్పుడూ బాలుడు లాగే ఉంటాడుట. ఇక్కడ బాల్యము అంటే అజ్ఞానావస్థ కాదు. బాల్యము అంటే నిష్కపటమైన భావం. పసిపిల్లలు ఎలాగైతే నిష్కపటంగా ఉంటారో భక్తి కూడా అలా నిష్కపటంగా ఉండాలి. అది బాల భావం. అందుకే పండిన భక్తిలోని, పండిన జ్ఞానంలోని బాలభావం కనపడుతోంది. నిష్కపట భావం కనపడుతూ ఉంటుంది. అలాగ

ప్పిళ్ళైగళెల్లారుమ్ – పిల్లలందరూ కలిసి గానం చేస్తూ

పావైక్కళమ్ – అంటే వ్రతం చేసే చోటికి

బుక్కార్ – ప్రవేశించారు. వ్రతం చేసే చోటుకు చేరుకున్నారు. ఎలా చేరుకున్నారు అంటే భగవత్ గుణగానం చేస్తూ వెళ్తున్నారుట. ఎలాంటి భగవానుని గానం చేస్తున్నారో ఇక్కడ వర్ణిస్తున్నారు.

పుళ్ళిన్ వాయ్ కీణ్డానై – పక్షి నోటిని చీరిన వారు అని అర్థం. పక్షి నోటిని చీల్చాడట స్వామి. ఏమిటా పక్షి? అంటే బకాసురుడు. కొంగ రూపంలో వచ్చిన రాక్షసుని చీల్చాడు పరమాత్మ గోపకులను రక్షించడం కోసం. ఆవిధంగా ఒక పక్షి నోటిని చీరిన వాడు. దుష్ట వాక్కులు, దుష్టములైన తెలివితేటలూ, ఇవి కలిగి ఉంటే ఆ తలలన్నీ దుష్ట శిరస్సులే. ఎవరి భావన భగవత్ భావనతో మంచి పలుకులతో ఉంటాయో ఆ తలలే సార్థకమైన తలలు. ఎందుకంటే తలే అన్నింటికీ ప్రమాదం. తలలో వచ్చే ఆలోచనలు, తలనుంచి వచ్చే పలుకులు, ఇవేకదా! మంచికి కానీ, చెడుకి కానీ పనికొస్తాయి. అవి మంచి పలుకులు పలుకుతూ, మంచి ఆలోచన చేసినట్లయితే ఆ శిరస్సులు రక్షించబడతాయి. ఆ శిరస్సుల వల్ల అందరూ


Copyright@gurujnanam.org

రక్షింపబడతారు. కానీ దుష్టమైన తలంపులు, దుష్టమైన వాక్కులు ఏవైతే ఉంటాయో అవి ప్రమాదకారులు. వాటిని అణచుతాడు పరమాత్మ. అందుకే రామ, కృష్ణ అవతారాలను మనం గానం చేసి తరించాలి. అలా తరించుతూ వెళ్ళారు పిల్లలు అందరూ కూడాను. ఎక్కడికి? ఆ దివ్యమైన వ్రతం చేస్తున్నటువంటి చోటుకు వెళ్ళారు. తెల్లవారింది. ఇంకా నువ్వు నిద్ర లేవవేమిటి?

పుళ్ళుమ్ శిలుంబినకాణ్ – అంటే పక్షులు కూస్తూ ఉన్నాయి అన్నారు. ఇదివరకు చెప్పిన భావమే ఇది. ఈ జ్ఞానాన్ని అంది పుచ్చుకుని దానిని బోధన రూపంలో గురువులు అందిస్తున్నారు. పక్షులు ఎక్కడ వాడినా ఋషులు, గురువులు అనే ఉద్దేశ్యంతోనే వాడబడుతున్నాయి. ఆ జ్ఞానబోధ చేస్తున్నటువంటి అనుభూతిని పలుకుతున్నటువంటి బ్రహ్మవేత్తలని ఇక్కడ పక్షులతో పోలుస్తారు. అనుభూతిని పలుకుతారు. అంతే కానీ ఒకదగ్గర చదివి తిరిగి వల్లించడం కాదు. అనుభూతిని గానం చేసినప్పుడు, చెప్పినప్పుడు పక్షుల కూతలు అనే వర్ణన ఒక సంకేతం అది.

పోదరిక్కణ్ణినాయ్ – చక్కని కళ్ళు కలిగినటువంటి నువ్వు మాతోపాటు బయలుదేరి రా! అని చెప్తున్నారిక్కడ. ఈ సంబోధనలో కణ్ణినాయ్ అనే మాట ఉన్నదే అంటే కనులు కలదానా! ఎలాంటి కనులు అన్నప్పుడు ఇందులో చాలా చక్కటి భావం ఇందులో మనకి కనపడుతున్నది. అది తామర పువ్వులలోని తుమ్మెదలలా ఉన్న కన్నులు కలదానా అనేటటువంటిది ఇందులో ఉన్న భావం. పోదరిక్కణ్ణినాయ్ – అంటే వికసించిన తామరపువ్వులో తుమ్మెదలు ఉంటే ఎలా ఉంటుందో అలా ఉన్న కళ్ళుట. నిజానికి కళ్ళు మూసుకొని ఉంటారు నిద్రపోతున్నప్పుడు. కానీ మేల్కొల్పుతూ అలాంటి కన్నుల దానా అంటే నువ్వు మేల్కొని ఆ కళ్ళని మాకు చూపించు, మేలుకో అని చెప్పడం ఇది. పద్మంలో దూరిన తుమ్మెద మకరందాన్ని ఎలా ఆస్వాదిస్తుందో భగవత్ సౌందర్యాన్ని


Copyright@gurujnanam.org 

హృదయపద్మంలో ఆస్వాదిస్తూ ఆ అనుభూతిని నేత్రములలో చూపించేటటువంటి కళ్ళు. అది ఇందులో ఉన్న, భావంలో ఉన్న గొప్పతనం. అలాంటి నువ్వు ఈ మంచి రోజున, ఈ వ్రతం పాటిస్తున్న రోజున మేమందరం చల్లబడాలని స్నానం చేస్తూ ఉంటే నువ్వు రాకుండా ఇంకా నిద్రపోతున్నావా? మమ్మల్ని తరింపజేయడం కోసం నీయొక్క ధ్యాన భూమిక నుంచి వెలికి వచ్చి ఆ నిద్రను మాని అనగా సమాధి స్థితిని విడిచిపెట్టి మమ్మల్ని అనుగ్రహించు అని ప్రార్థిస్తూ ఉన్నారు. గతంలో చెప్పినట్లుగా ప్రతి చోటా కూడాను ఆళ్వారులయొక్క ఇతివృత్తములే చెప్పబడుతున్నాయి. ఆరవ పాశురం నుంచి పధ్నాలుగవ పాశురం వరకు గోపకాంతలు నిద్ర లేపడం అన్నది కనపడుతున్నది. ఒక్కొక్క గోపకాంతయొక్క స్వభావం ఒక్కొక్కలా ఉంటుంది. భక్తి అనేటటువంటి తత్త్వం ఒకటే అయినప్పటికీ వారి స్వభావ రీత్యా భక్తి ఒక్కొక్కరిలో ఒక్కొక్కలా వ్యక్తమవుతూ ఉంటుంది. మొత్తానికి ఆళ్వారులు అనబడేటటువంటి భగవదనుభూతి పొందినటువంటి మహాత్ములే ఇక్కడ గోపికలుగా చెప్పబడుతూ వాళ్ళని ప్రార్థన చేస్తూ వాళ్ళు ఆ దివ్యభావనల నుంచి వెలికి వచ్చి మనలని భగవాన్ మార్గంలో నడిపించాలని ప్రార్థిస్తూ ఉన్నది ఇక్కడ అమ్మ గోదాదేవి.

DAY 14:

విష్ణుచిత్తుని యొక్క కుమార్తె విల్లిపుత్తూరులో శ్రీవ్రతాన్ని అనుసరిస్తూ పాడుతున్న దివ్యపాశురాలలో 14వ పాశురాన్ని ఈరోజు చెప్పుకోబోతూ ఉన్నాం. ఈ పాశురంలో కూడా మేల్కొలుపు గీతమే. ఇది నిజానికి మేల్కొలుపు గీతాలలో ఆఖరుది అని చెప్పుకోవచ్చు. దాని తర్వాత సంవాద గీతం ఒకటి వస్తూ ఉన్నది మనకి. ఇందులో విశేషంగా చెప్పేటప్పుడు ఎవరినైతే మేల్కొల్పుతున్నారో ఆ గోపిక ఇంటిలో ఉండేటటువంటి వాతావరణాన్ని ముందు వర్ణిస్తున్నారు. నీ ఇంటి


Copyright@gurujnanam.org 

పూలతోటలో, అనగా నీ ఇంటి పెరట్లో ఉన్నటువంటి పూలతోటలో ఒక చక్కని బావి ఉన్నది. ఆ బావిలో పద్మాలు వికసిస్తూ ఉన్నాయి. అంటే తెల్లవారింది అని చెప్పడం అక్కడ.

ఉజ్జల్ - అంటే నీయొక్క

పుళైక్కడై తోట్టత్తు - పెరటితోటలో ఉన్నటువంటి

వావియుల్ - ఇదొకటి గుర్తు పెట్టుకోవలసినటువంటి మాట. వావి అంటే ఇక్కడ బావి అని అర్థం. లోతైన నీరు ఉన్న ఒక జలాశయము. అందులో

శెజ్జ్ఘళునీర్ - అనగా ఎర్ర తామరలు,

వాయ్ నెగిలి న్ద - చక్కగా వికసిస్తూ ఉన్నాయి. ఇక నల్ల కలువలు అందులోనే ఉన్నాయి. అవి ముడుచుకు పోతున్నాయి. తెల్లవారింది కనుక రాత్రి వికసించిన నల్ల కలువలు ఇప్పుడు ముడుచుకుపోతున్నాయి. పొద్దున్న వికసించవలసినటువంటి తామరలు విచ్చుకుంటూ ఉన్నాయి. అది వాతావరణం ముందు వర్ణించారు. తర్వాత ఏమిటంటే యతీశ్వరులు ఆలయానికి వెళ్తూ ఉన్నారు అనేటటువంటి విషయం. సన్యాసులు, భగవత్ భక్తులు, వైరాగ్యంతో కూడి భగవంతుని పట్ల రాగము కలిగిన మహాత్ములని ఇక్కడ వర్ణిస్తూ ఉన్నారు. వాళ్ళు ఎలా ఉన్నారు అంటే

శెజ్జ్ఘల్పొడి - అంటే ఎర్రని రంగు కలిగినటువంటి అని అర్థం ఇక్కడ. జేగురు రాళ్ళయొక్క పొడి ఎలాగ ఎరుపు రంగు ఉంటుందో అలాంటి రంగుతో కూడినటువంటి

కూరై - అంటే వస్త్రములు. అనగా కాషాయ వస్త్రములు ధరించి ఉన్నారు.

వెణ్ పల్ - అంటే తెల్లని పళ్ళ వరుస ఉన్నది. వస్త్రములేమో కాషాయ వస్త్రములు, పలువరుస తెల్లగా మెరిసిపోతోంది. అలాంటి సన్యాసులు అన్నారు. తవత్తవర్ - అంటే సన్యాసులు. వాళ్ళు ఆలయానికి వెళ్తూ ఉన్నారు.


Copyright@gurujnanam.org

తిరుక్కోయిల్ - దేవాలయానికి వెళ్తూ ఉన్నారు. ఎందుకు అంటే శజ్జిడువాన్ పోగిన్రార్ - అంటే ఆరాధన చేయడం కోసం వెళ్తూ ఉన్నారు యతులు. ఇవి ప్రాతఃకాలంలో ఉండే వాతావరణం. ఇక్కడ కమలములు విచ్చుకొనుట. లోపల విచ్చుకుంటున్నాయిట. బావి అంటే లోతైన నీరు అని చెప్పుకున్నాం. హృదయము లోపల లోతైన అంతర్భూమికలో ఆ దివ్యమైన హృదయ పద్మంలో ఆ దివ్య జ్ఞానములు వికసించితే అప్పుడు పరమాత్మ యొక్క అనుభూతి కలుగుతుంది. ఎప్పుడైతే తామరలు విచ్చుకుంటున్నాయో కలువలు ముడుచుకు పోతున్నాయిట.

సుఖం రెండు విధాలు. బాహ్యమైనటువంటి విషయములతో సుఖపడడం ఒకటి. అంతర్గతంగా ధ్యానము ద్వారా, సమాధి ద్వారా, భగవంతునితో కలిసినటువంటి ఆనందంతో, సుఖపడడం ఒకటి. అది భగవదనుభూతి, ఇది జగదనుభూతి. హృదయ పద్మంలో భగవదనుభూతి పొందుతూ ఉన్నాం. అప్పుడు బాహ్యేంద్రియసుఖములు అంతరించి పోతున్నాయి. కనుక బయట విషయాల సుఖములు వదిలివేస్తున్నారు అని చెప్పడమే కలువలు ముడుచుకు పోతున్నాయి అనేది. హృదయంలో, మన లోపల, ఇక్కడ ఇల్లు అంటే మన ఒళ్ళే. ఆ ఒంటి లోపల బావి అంటే హృదయం. ఆ హృదయంలో విచ్చుకున్నటువంటి భగవదనుభవమే ఇక్కడ చెప్పబడుతున్న ఎర్ర తామర. ఇంత విశేషమైన భావమున్నది. అలాగ మనలో సుషుమ్నా నాడిలో మొత్తం ఆరు పద్మములూ విచ్చుకొని క్రమంగా సహస్రార మహా పద్మంలో ఉన్నటువంటి భగవదనుభూతిని పొందడం యోగంలో చెప్తున్న అంశం ఇది. అదే మనలోపల ఉన్న లోతైన భాగమిది. అది బయట కళ్ళకు గోచరించేది కాదు. సూక్ష్మ భూమికి సంబంధించినటువంటిది. అందుకే నీ ఇంటిలోపల, పెరటిలో అని చెప్పడంలో లోలోపల భాగానికి వెళ్ళాలి. బయట కనపడేది కాదది. అందుకు అంతర్గతమైన



Copyright@gurujnanam.org 

భగవదనుభూతిని హృదయపద్మంలో విచ్చుకొని అనుభవిస్తూ బాహ్యమైన సుఖాలన్నీ త్యజించినటువంటి ఓ మహాత్ముాలా! మేలుకొని ఆ దివ్యమైన అనుభూతిలో నుంచి వెలికివచ్చి మాకోసం ఈ భగవన్మార్గాన్ని చూపించు. మాతో పాటు నడచి నడిపించు. భగవత్ సేవకు వెళుతున్నటువంటి వారు వైరాగ్య శబ్దములు. భగవంతుని విలువ తెలిస్తే ప్రపంచం యొక్క విలువ లేని తనం తెలుస్తుంది. ఆ రుచి తెలిసినవాడు ఈ రుచిని సహజంగానే విడిచిపెడతాడు. సూర్యోదయం వచ్చి చక్కటి సూర్యకాంతి వచ్చాక ఇంకా చిన్న చిన్న దీపపు కాంతులు ఎవడైనా పెట్టుకుంటాడా? అదేవిధంగా భగవదనుభూతి పొందినవాడికి లౌకిక విషయాలు త్యజిస్తాడు. ఆ త్యాగానికి గుర్తుగానే కాషాయాన్ని ధరిస్తారు. ఇక పళ్ళు తెల్లగా మెరిసిపోతున్నాయి. పళ్ళు కనపడేది ఎప్పుడు? నవ్వినప్పుడు కనపడతాయి. ఆ యతీశ్వారులు ప్రసన్నంగా నవ్వుతూ ఉన్నారట. నవ్వు ఎప్పుడు వస్తుంది? - మనస్సులో ఆనందం ఉంటే వస్తుంది, జ్ఞానం ఉంటే వస్తుంది. వాళ్ళ మనస్సులో ఎప్పుడూ భగవదనుభూతి జ్ఞానానంద రూపంగా పొంగుతూ ఉంటుంది కనుకనే ఆ అనుభూతి నవ్వు రూపంలో వెలికి వస్తోంది. ఆ నవ్విన పలువరుస తెల్లగా ఉంది అన్నారిక్కడ. పళ్ళని చెప్పడం అంటే పలుకుల స్థానం అది. ప్రసన్నంగా ఉన్నారు, పైగా మంచి పలుకులు పలుకుతున్నారు. తెల్లని అన్నప్పుడు శుద్ధసత్త్వముతో కూడినటువంటివి. అలాంటి సాత్త్విక గుణమైనటువంటి పలుకులు గలవారు, మందహాసము, ప్రసన్నత కలవారు అని చెప్పడం కోసం వారియొక్క స్వరూపాన్ని ఇలా వర్ణించారు. వాళ్ళు వెళుతున్నదెందుకు? భగవదారాధనకి. ఇటువంటి వైరాగ్యంతోనూ అటువంటి ప్రసన్నమైన సాత్త్విక భావంతోనూ భగవంతుడిని ఆరాధిస్తున్నారు వాళ్ళు అని. ఎజ్ఞలై మున్న మెళుప్పువాన్ వాయ్ పేశుమ్ నజ్ఞాయ్ - ఇక్కడ నజ్ఞాయ్ అంటే ఇది ఒక విధంగా ఎత్తిపొడుపు మాట. ఓ పరిపూర్ణురాలా! అని అర్థం. చెప్పిన



Copyright@gurujnanam.org 

మాట నిలబెట్టుకున్నావులే మహా అని చెప్పడం. నువ్వు ఏమి మాట ఇచ్చావు? నేను ముందు వచ్చి మేల్కొల్పుతాను అని. అంటే ఇక్కడ అర్థం ఏమిటంటే శ్రేష్ఠులైన వారు దేనిని ఆచరిస్తారో దానిని చూసి మిగిలిన వారు అనుసరిస్తూ ఉంటారు. మేము అనుసరించవలసిన వాళ్ళం. నువ్వు చేసి చూపించవలసిన దానవు. నువ్వు వచ్చి మమ్మల్ని మేల్కొల్పుతున్నావు అంటే అర్థం ఏమిటంటే నువ్వు మమ్మల్ని మేల్కొలిపి నడిపించాలి. అలాంటిది మేము వచ్చి నిన్ను మేల్కొల్పుతున్నాం అంటే అర్థం నువ్వు మమ్మల్ని మేల్కొల్పడం సాధనలోకి తీసుకు వెళ్తుంది. అందుకు మనం గానం చేయాలి. ఎవరిని? అంటే శంఖచక్రగదాదారియైన పరమాత్మను. ఆయనను మనం గానం చేస్తూన్నాం. శంఖంతో, చక్రంతో ప్రకాశిస్తున్నటువంటి పొడవైన చేతులు కల పుండరీకాక్షుడు. పఙ్గయక్కణ్ణానై - అంటే పద్మముల వంటి నేత్రములు కలిగిన పుండరీకాక్షుడు అని అర్థం. శంఖచక్రములు ధరించి ఉన్నాడు. విశాలమైన నేత్రములతో చూస్తున్నాడు అనగానే స్వామియొక్క దివ్యమంగళ విగ్రహాన్ని హృదయంలో ప్రతిష్ఠించేలా వర్ణించింది ఇక్కడ ఆ తల్లి. శంఖ చక్రములు ధరించి దివ్యమైన శబ్ద స్వరూపమైన శంఖము, కాంతి స్వరూపమైన చక్రము దాల్చి విచ్చుకున్న నేత్రములతో దయతో చూస్తున్న నారాయణుని గురించి
పాడ - పాడుకొనుటకై నువ్వు లేచి రా! మనం శ్రీవ్రతాన్ని ఆచరిద్దాం. అని పలుకుతున్న ఆండాళ్ళమ్మకు నమస్కరిస్తూ
ఆండాళ్ తిరువడగలై శరణం!!

DAY 15:

పరమపావనమైన తిరుప్పావై పాశురాలలో 15వ పాశురం చెప్పుకోబోతున్నాం. ఇక్కడ ప్రధానంగా ఆరునుంచి పధ్నాలుగు పాశురములు అంటే తొమ్మిది


Copyright@gurujnanam.org 

పాశురములు మేల్కొలుపులే పలుకబడుతూ ఉన్నాయి. వివిధములైన ఆళ్వారుల తత్త్వాన్ని వివిధ గోపికా భావాలలో చూపిస్తూ భగవదనుభూతిలో తన్మయులైనటువంటి ఆ పరమ పావన ఆచార్యుల యొక్క అనుగ్రహం మనకు కావాలి. వాళ్ళ చరిత్రలు మనం అధ్యయనం చేయాలి. వాళ్ళు చూపిన మార్గంలో మనం వెళ్ళాలి. మనం చేస్తున్న సాధనలలో వాళ్ళు మనకు తోడై నడిపించాలి. అందుకే వారియొక్క ప్రబోధాన్ని ఆశిస్తూ వారిని మనం మేల్కొల్పుతూన్నాం. వారి మేల్కొలుపు మనల్ని నిద్రావస్థలో నుంచి భగవదనుభూతి లోకి తీసుకు వెళ్తుంది. వారికి మనం చేసే మేల్కొలుపు వారున్న తాదాత్మ్యావస్థ నుంచి బోధ చేసే అవస్థ లోకి తీసుకు వస్తుంది. భగవదనుభూతి పొందేవాళ్ళు రెండు రకాలుగా ఉంటారు. తామనుభవిస్తూ మోక్షం పొంది పోతారు కొంతమంది. కొంతమంది అలా కాకుండా తామనుభవించినటువంటి అనుభవం ప్రకారంగా కొందరికి మార్గదర్శకులై బోధ చేస్తారు. అటువంటి వారు ఉంటేనే మరికొంతమంది తరించగలరు. ఉద్ధవుడు అంటాడు ఆ గోపికల పాద ధూళికణం చాలు అన్నాడు. కృష్ణ పాద ధూళికణం కాదుట. కృష్ణ పాద భక్తులైన గోపికల పాద ధూళికణం చాలు అంటే గోపికలు భక్తికి ఆచార్యులు. అందుకే ఆచార్యుడైన నారదుడు కూడా భక్తి సూత్రాలు చెప్తూ భక్తికి పరమాదర్శంగా చెప్పింది గోపికలనే. 'యథా వ్రజ గోపికానాం' అన్నారాయన. ఇప్పుడు మేల్కొలిపినటువంటి ఆ భక్తులకు ఆచార్య రూపిణియైనటువంటి గోపికకు మధ్య జరిగినటువంటి సంవాదం ఇది. ఇప్పుడు మేల్కొల్పుతున్న వారియొక్క పిలుపు ఎలా ఉన్నదో చూద్దాం.

ముందుగా ఆ గోపికలు అంటున్నారుట మేల్కొల్పుతూ



Copyright@gurujnanam.org 

ఎల్లే యిలంగిళియే - అంటే ఓ లేత చిలుకా! అనేది సంబోధన ఇక్కడ. ఇంకా నిద్రిస్తున్నావా? -యిన్నముఱంగుడియో? - ఇంకా నిద్రిస్తున్నావా? ఓ లేత చిలుకా! అన్నారుట. వెంటనే ఆమె సమాధానం చెప్తుంది.
నఙ్గైమీర్, - అంటే నిండైనటువంటి ఓ చెలులారా! అని. పూర్ణలారా అనే సంబోధన. శిల్లెన్రళై యేన్మిన్? - ఇంక పిలవకండి అన్నదిట. అంటే ఒక్కసారి గట్టిగా వచ్చి పిలిచినప్పుడు మేల్కొనగానే నేను లేచాను ఇక పిలవక్కరలేదు అని చెప్తారే అలా చెప్తున్నది. మీ పిలుపు ఎలా ఉంది అంటే శిల్లెన్ర - అంటే ఝిల్లుమనేలా నన్ను పిలవద్దు అని. అంటే చీకాకు పడేలాగా నన్ను మాటిమాటికీ అలా పిలవద్దు లేచాను కదా! అన్నది. ఎవరు పరిపూర్ణులు అంటే ఎవరు భగవంతుని కోసం తమని తాము అంకితం చేసుకోవడానికి సిద్ధపడతారో, ఎవరు భగవంతునే పరమావధిగా ఎంచుకొని సాధన చేస్తారో వాళ్ళందరూ పూర్ణుల క్రిందే లెక్క. అందుకే "అపిచేత్ సుదురాచారో భజతే మామనన్య భాక్! సాధురేవ సమంతవ్యః" అన్నాడు గీతలో. ఎటువంటి వారైనా నన్ను అనన్య చింతనతో భజించినప్పుడు వారు సత్పురుషులే అని పరమాత్మ చెప్పాడు. అందుకు భగవదాశ్రయ బుద్ధి కలిగిన మీరు పూర్ణులు, ఇంక పిలవద్దు. ఇదిగో నేను వస్తున్నాను. పోదరుగిన్రే - నేను వస్తున్నాను ఇంక బయలుదేరదాం అని. అప్పుడు వాళ్ళు అన్నారుట - మేము ఝిల్లుమని పిలిచాం అన్నావే ఏమిటా మాట చెప్పు. నువ్వు నేర్పుగల దానవే. వల్లై - అంటే నేర్పు గల దానవు. అయితే నీ నేర్పరి మాటలు మాకు ముందే తెలుసులే. అన్నారిక్కడ. నీ నేర్పరితనపు మాటలు ఇప్పుడు మేము వస్తే మేల్కొన్నావు. మమ్మల్ని ఇలా మేల్కొల్పద్దు అని నువ్వు అంటున్నావు. నీ నేర్పరితనపు మాటలు మాకు తెలుసులే అన్నారు. వెంటనే ఆ తల్లి సమాధానం చెప్తోంది లోపలినుంచి. అసలు మీరే నేర్పరులు. సరే నన్ను అన్నారు గనుక సరే నేనుకూడా నేర్పరినే అన్నది. ఇది ఎలాంటిది అంటే మనల్ని ఎవరైనా ఒకమాట


Copyright@gurujnanam.org 

ఎత్తిపొడిచినప్పుడు తిరిగి వాళ్ళనే అంటే సరే మీరన్నదీ ఒప్పుకుంటాను అనడం. నీకెందుకు ప్రత్యేకంగా నీకొక్కదానికే ప్రత్యేకత ఏమిటి చెప్పు ఇక్కడ? మాతోపాటు కలిసి రాకుండా మేము వచ్చి మేల్కొలిపితే కానీ రానివిధంగా నువ్వు ఉన్నావేమిటి? ఏమిటి నీ ప్రత్యేకత? అని అడుగుతున్నారు. ఉనక్కెన్న వేఱుడైయై ? - ఏమిటి నీ ప్రత్యేకత? సరే అవన్నీ తర్వాత అందరూ వచ్చారా? నన్ను నిద్ర లేపారు సరే! అందరూ సిద్ధమై వచ్చారా? అని

ఎల్లారుమ్ ఫోన్దారో? - అందరూ వచ్చారా? అంటే అందరూ వచ్చారు. కావాలంటే లెక్కపెట్టుకో అన్నారు. వచ్చిన వాళ్ళందరూ ఎవరెవరైతే వ్రతంలో నిష్టులమై ఉన్నామో అందరూ వచ్చి ఉన్నాం. కావాలంటే వచ్చి లెక్క చూసుకో. మనం అందరం కలిసి ఇప్పుడు ఇంక బయలుదేరాలి. దేనికి? అంటే ఆ నారాయణుని గానం చేయడానికి. ఆ స్వామికి మూడు విశేషాలు చెప్పారు ఇక్కడ.

వల్లానై కొన్రానై - అంటే బలమైన ఏనుగును చంపినటువంటి వాడు,

మాత్తారై మాత్తళిక్క వల్లానై - శత్రువుల బలాన్ని సులభంగా నశింపజేసేవాడు అయిన

మాయనై - మాయావి అయినటువంటి వానిని అనగా కృష్ణుని అని అర్థం. కృష్ణుని యొక్క మూడు విశేషణాలు ఇక్కడ చెప్తున్నారు. ముందు బలమైన ఏనుగును చంపినా వాడు అనగా కువలయాపీడం అనే మదగజాన్ని అలవోకగా సంహరించాడు కృష్ణ పరమాత్మ కేవలం పద్నాలుగేళ్ళ వయస్సులో. అలాగే బలమైన శత్రువులను ఎందరినో సంహరించాడు. చాణూర ముష్టికులు, కంసుడు, మురాసురుడు, నరకాసురుడు, ఇత్యాది దనుజులెందరినో సంహరించినటువంటి వాడు ఈ చేతలన్నీ కూడా ఆయన చేసిన లీలలు. లీలామయుడు. అందుకే ఇక్కడ మాయనై అంటే లీలామయుడు అని అర్థం. లీలగా చేశాడు, జగద్రక్షణ



Copyright@gurujnanam.org Sri Gurubhyo Namaha

కోసం చేసినటువంటివి. అలాంటి పరాక్రమవంతుని మనం గానం చేద్దాం. అందుకే మనం

నారాయణ సమారంభాం యామునాచార్య మధ్యమాం!
అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరాం!! అని శ్రీవైష్ణవ సంప్రదాయంలో చెప్తాం. పరమాత్మను మొదలుకొని మధ్యలో వచ్చిన మహా ఆచార్యులతో కూడా కలుపుకొని నాదాకా వచ్చిన ఆచార్యుని వరకూ అందరికీ నమస్కారం అంటే అర్థం ఇదివరకు ఆచార్యులు ఎవరూ మనకు కనపడలేదు. ఇప్పుడు మన గురువే మనకు కనపడుతున్నారు. ఈ గురువులో పూర్వ గురువులు అందరూ ఉన్నారు అని భావించాలి. అదేవిధంగా ఇప్పటివరకు చెప్పిన పాశురములలో చెప్పబడ్డ గోపకాంతల రూపంలో ఉన్నటువంటి ఆళ్వార్ లు ఆచార్యులయొక్క భావమంతా ఇక్కడ మనకి కనిపిస్తున్నది. ఆ పూర్వాచార్యుల స్వరూపమైనటువంటి మనకి తోడై, నీడై భగవన్మార్గాన్ని చూపిస్తూ నడిచి నడిపించేటువంటి ఆచార్యుని అనుగ్రహం ఇక్కడ కనపడి నేను వస్తున్నాను అని అభయ వాక్యం ఇందులో గోచరిస్తున్నది. ఇటువంటి దివ్యమైన పాశురాన్ని అనుగ్రహించిన అమ్మకు నమస్కరిస్తూ
ఆండాళ్ తిరువడిగలై శరణం!!

DAY 16:

శ్రీవ్రతమైన తిరుప్పావైలో భాగంగా 15పాశురములు పూర్తిచేసుకొని మార్గళి వ్రతంలో పదహారవ రోజు పదహారవ పాశురాన్ని అమ్మ అనుగ్రహిస్తున్నది. ఇందులో ఉన్న గొప్పతనాన్ని మనం పరిశీలించే ముందు ఇప్పటివరకు జరిగిన విషయంలో ముందుగా ఈ మార్గళి వ్రతాన్ని చేయడానికి సంకల్పించుకోవడమూ అటుపై ఈ మార్గళి వ్రతం చేసే విధానములు, ఆ తరువాత పరమాత్మను


Copyright@gurujnanam.org

ఆశ్రయించడం. ఆయనను ఆశ్రయించి ఆయనను పొందాలి అంటే పూర్వాచార్యులయొక్క నడవడిక మనకు ప్రధానం. వారియొక్క చరిత్రే మన సాధనలో తోడు. ఇప్పుడు వారందరూ ఉన్నారా అంటే వాళ్ళు నడిచి వెళ్ళిన దారి ఉన్నది. వాళ్ళు చెప్పిన మాటలు ఉన్నాయి. వాళ్ళయొక్క చరిత్ర ఉన్నది. ఆ చరిత్ర, వాళ్ళ బోధ. అంటే బోధ, గాధ - ఈ రెండూ మనకు తోడవ్వాలి. అలా తోడుగా ఉంటే ఆచార్యులు తోడున్నట్లే. ఆచార్యుల అనుగ్రహం పొంది ఇప్పుడు భగవంతునియొక్క దివ్యమంగళ ద్వారం వద్దకు వచ్చారట. ఆచార్యుల తోడు ఉంటే కానీ అక్కడకు చేరలేం. స్వామివారి భవనం దగ్గరకు వచ్చారు. శ్రీకృష్ణ పరమాత్మ యొక్క దివ్య భవనం దగ్గరికి మనందరం ప్రవేశించాం. అమ్మ గోదాదేవి యొక్క సాయంతో. ఆ భావన ద్వారములు మూసి ఉన్నాయి. ద్వారం వద్ద కాపలాదారు ఉన్నాడు. నందరాజు సామాన్యుడా? మొత్తం వ్రజభూమికి ఆయన నాయకుడు. ఆయన పుత్రుడు, ఈ మహారాజు, యువరాజు. నిజానికి యువరాజుగా కనపడుతున్నా మహారాజు ఆయనే. దశరథ పుత్రుడైన రాముడు అయోధ్యకి రాజు దశరథుడైనా రాముడే రాజుగా మిగిలిపోయాడు ఆయన యువరాజుగా ఉన్నప్పుడు. అదేవిధంగా కృష్ణ పరమాత్మ అందరి హృదయాలని ఏలుతున్నాడు. కానీ తాను నందకుమారుణ్ణి అనేటటువంటి ఒక యోగాన్ని నందునికి అనుగ్రహించాడు ఆయన. ఆయనకి అటువంటి ప్రీతి ఉన్నది. అతడు ద్రోణుడు అనేటటువంటి దివ్య వసువు. పురాకృత సుకృతం వల్ల బ్రహ్మ యొక్క ఆజ్ఞ చేత నందుడై అవతరించి కృష్ణ పరమాత్మకు తండ్రిగా ఆయనకు గొప్పతనం లభించింది. కృష్ణుడు కూడా సర్వతంత్ర స్వతంత్రుడు. ఆయన ఎవరికీ పరతంత్రుడు కాడు. కానీ నంద గోపునియొక్క కుమారుణ్ణి అని చెప్పుకోవడంలో ఆయనకి ఆనందం ఉన్నది. దానివల్ల నందునికి కొంత గొప్పతనం ఇస్తున్నాడు. తండ్రి పట్ల తన భక్తిని ప్రకటిస్తూ ఉన్నాడు. ఇలాంటి ఉదాత్తమైన ఔదార్యాన్ని రామావతారంలోనూ



Copyright@gurujnanam.org 

చూపించాడు, కృష్ణావతారంలోనూ చూపించాడు. రావణ సంహారం చేసి తిరిగి సీతమ్మతో పుష్పక విమానం నుంచి వస్తూ తన అయోధ్యానగరాన్ని చూసి అంటాడు - "రాజధానీ పితుర్మమ" అంటాడాయన. నా తండ్రి రాజధాని అయోధ్య అదిగో అన్నాడాయన. నిజానికి తండ్రి పోయి ఎన్నాళ్ళుఅయింది? కానీ అయోధ్య తండ్రి రాజధానే అంటున్నాడాయన. అంత గొప్ప భావం, పితృ భావాన్ని, భక్తినీ ప్రకటించాడు రామావతారంలో. అందుకని ఇక్కడ నందుని మనం కీర్తిస్తే నంద నందనుడు సంతోషిస్తాడు. ఆ కారణం చేత నందుని గొప్పతనాన్ని చెప్తూ నందుని ఇంటి కాపలాదారుని బ్రతిమాలుతున్నారు. ఎందుకంటే కాపలాదారు తలుపు తెరిస్తే లోపలి వెళ్ళగలం. ద్వారపాలకుడు ఇక్కడ చెప్పబడుతున్నాడు. సరైన అర్హులను చూసేవాడు, సరియైన అర్హతను చూసి ప్రవేశింప జేసేవాడే ద్వారపాలకుడు. ఇక్కడ మనం ఆచార్యుల బలంతో వచ్చాం కనుక అర్హులమౌతాం తప్పకుండా. ఆ అర్హత చూసి లోపలి పంపించేటటువంటి ఒక కాపలాదారు అక్కడ ఉన్నాడు. మా అందరికీ నాయకుడైన నందగోపరాజు యొక్క ఇంటికి, భవనానికి కాపలాదారుగా ఉన్నటువంటి వాడా! పైగా ఆ ద్వారం ఎలా ఉందో ఇక్కడ వర్ణిస్తున్నారు. అది

కొడిత్తోన్రుమ్ తోరణ వాశల్ కాప్పానే ! - ధ్వజముతో అనగా జెండాతో ఉన్నది, తోరణముతో ఉన్నది అయినటువంటి ద్వారం. ఆ ద్వారం వద్ద ఉన్నటువంటి వాడా! పైగా ఆ ద్వారానికి వేసిన తలుపులు ఎలా ఉన్నాయి అంటే

మణిక్కదవమ్ తాళ్ తిరవాయ్ - అంటే ఆ మణి కవాటము, మణులతో పొదిగినటువంటి తలుపుల్ని తెరువు. దానియొక్క గడియని తీయి అన్నారిక్కడ. అంటే ఆ ద్వారములు/తలుపులు చక్కగా మణులతో ప్రకాశిస్తున్నాయి. అంతకుముందే మణుల కవాటంతో ఉన్న గోపకాంత గురించి చెప్పుకున్నాం. మరి నంద గోపరాజు ఇంటి తలుపులు మణులతో ఉందనడంలో ఆశ్చర్యం ఏమున్నది?


Copyright@gurujnanam.org 

అలా ఉన్నాయి. వాటిని తెరవమని అడుగుతున్నారు. స్వామికి రక్షణ కోసం మరింత ఏర్పాటు చేశాడు నందగోపుడు. ఇప్పుడు వీళ్ళందరూ వచ్చి తలుపు తెరవమంటే తెరుస్తాడా? చూడడానికి అమాయకులలాగా కనపడుతున్నారు. పూతన కూడా అమాయకంగానే వచ్చింది. వీళ్ళూ అలాగే వచ్చినట్టా అంటే వాళ్ళు చెప్తున్నారు - మేము అమాయకులమైనటువంటి గోపా బాలికలం. అందుకే ఇక్కడ

ఆయర్ శిరుమియరోముక్కు - అన్నప్పుడు ఇక్కడ మేము కేవలం గోపా బాలికలం. మరి ఎలా వచ్చాము? అంటే ఆ విశేష భావం కూడా

తోయోమాయ్ వన్దోమ్ - నిష్కపటమైన, శుద్ధమైన భావంతో వచ్చినటువంటి వాళ్ళము. అంటే పరమాత్మను చూడడం ఆయనను చేరడమే ఇదే ప్రయోజనం తప్ప మరి యే కపతమూ లేకుండా ఉన్నటువంటి వాళ్ళము.

తుయిలెళ - నిద్రని వీడిపోయేలాగా మేము వచ్చాము ఇక్కడ. అంటే నిద్రని విడిచిపెట్టి వచ్చాం. పాడడానికి వచ్చాం. భగవత్ గుణగానం చేస్తూ ఉన్నాం. మా నిద్రని విడిచి పెట్టాం. అంటే మా తామసిక అవస్థలన్నీ విడిచిపెట్టి

వన్దోమ్ - ఇక్కడికి వచ్చి వున్నాం. నువ్వు ముందే ముందే వీలుకాదు అని చెప్పకయ్యా. మమ్మల్ని దయచేసి అనుగ్రహించు. అయితే మీరు సిద్ధపడితే చాలా? లోపల ఉన్నవాడు ఒపుకోవాలి కదా! అంటే ఆయన ముందే మాకు మాట ఇచ్చాడు అన్నారు. ఎంత చక్కటి మాటో చూడండి ఇది. ఏమిటా మాట? అంటే అఱై పఱై మాయన్ మణివణ్ణన్ నెన్నెలేవాయ్ నేర్ న్దాన్ - మాకు దివ్యమైన పరవాద్యము అనుగ్రహిస్తాను అని చెప్పి ఆ మణివర్ణుడు మాకు నిన్ననే మాట ఇచ్చాడు. అందుకు నువ్వు ఇంక మమ్మల్ని అడ్డకుండా ఈ దృఢమైన తలుపులను నువ్వు తెరువు. ఎంతగా మనం సాధన చేసినా భగవంతుడి దగ్గరికి వచ్చేటప్పటికి ఎక్కడో ఒక అడ్డంకి ఉంటుంది. ఆ అడ్డంకి మనం తెరవలేం.


Copyright@gurujnanam.org

భగవదనుగ్రహమే తెరవాలి. ఆయన అనుగ్రహం వల్లనే ఆ అర్హత చూసి తెరుస్తాడు అక్కడ ఉన్న కాపలాదారు. అదీ ఇందులో ఉన్నటువంటి భావం. ఆవిధంగా ఆదివ్యమైన భవనంలో ప్రవేశించాలని ద్వారపాలకులను అడుగుతున్న అమ్మకు నమస్కారం చేసుకుంటూ

ఆండాళ్ తిరువడిగల్లై శరణం!!

DAY 17:

వ్యవహారాన్ని అనుసరించి మనం కాలగణనని ఆధారం చేసుకున్నాం. ప్రపంచమంతా దానిని వినియోగించికొని తేదీ ఇత్యాదులు నిర్ణయించుకుంటున్నాం. ఆ కాల గణనాన్ని అనుసరించి వచ్చినటువంటి నూతన సంవత్సర సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఈ భావంలో మొట్టమొదట నందగోపాలుడుని మేల్కొల్పుతున్నారు.

నందగోపాలుడు ఎటువంటి వాడు. అంటే

అంబరమే , తణ్ణీరే శోఱే అఱమ్ శెయ్యుమ్ – అంబరమే అంటే వస్త్రములు, తణ్ణీరే అంటే చల్లని నీరు, శోఱే అంటే అన్నం, అఱమ్ – ధర్మము, వీటన్నింటినీ మాకిచ్చువాడు అని. నీటిని, వస్త్రములను, అన్నాన్ని ధర్మముగా మాకిచ్చువాడైనటువంటి మా ఏలిక నంద గోపాలుడు. అటువంటి ఓ ఏలికా! నందగోపాలా!

ఎళున్దిరాయ్ – మేల్కొనుము. ఇక్కడ నందుని పట్ల కృతజ్ఞతను ప్రకటిస్తున్నారు. ఈ ఊరిలో మేము ఉన్నాము అంటే మాకు కూడు, గుడ్డ, గూడు ఇవన్నీ నువ్వు ఇచ్చినటువంటివే. మాకు ఆశ్రయమిచ్చినటు వంటి వాడివి. ప్రధానంగా వస్త్రము, అన్నము ఈ రెండూ చెప్పారు. ఇవి ఆయన అనుగ్రహం వల్ల వస్తున్నాయి. ఏలిక అయిన వాడు సమకూరుస్తున్నాడు. పాలకుడైన వాడు తనచేత పాలింపబడే



Copyright@gurujnanam.org 

వారికి ఇవి సమకూర్చాలి అనడం కూడా ఇందులో కనపడుతూ ఉన్నది. అలా సమకూర్చే వాడే పాలకుడౌతాడు. లేకపోతె పాలకుడు కాడు. అందుకు పాలకుడైన నంద గోపాలుడు అక్కడ అందరికీ సమకూర్చుతున్నాడు అని చెప్పారు. దానికి కృతజ్ఞతగా ఇక్కడ వారు నమస్కారం చేసుకొని నువ్వు మేల్కొవయ్యా!

కొమ్బనార్కెల్లామ్ కొళున్దే ! కులవిళక్కే – ఒక చక్కని చెట్టుకు చిగురు ఎలా ఉంటుందో అదేవిధంగా స్త్రీ జాతి అంతటికీ కూడా చిగురు లాంటిదిట తల్లి యశోదమ్మ. చిగురు చెట్టుకు అందం. పైగా చిగురు ఆశలను కూడా చిగురింపజేస్తుంది. అందుకే చిగురులా ఉండడమే కాకుండా కులవిళక్కే – చక్కటి మాట. మా కులమునకే నువ్వు మంగళ దీపంలాంటి దానవు అని. మొత్తం గోప కులం లోనే ఒక మంగళ దీపంలా ప్రకాశిస్తున్న యశోదమ్మ. మరి ఆ యింత స్వామి అవతరించాడు అంటే సామాన్య విషయమా?

ఎమ్బెరుమాట్టి! – అంటే మాకు ఏలికసాని. మాకు సానివి నువ్వు, నాయకురాలివి నువ్వు. నాయకుడు నందగోపుడు, నువ్వు నాయకురాలివి.

యశోదాయ్! అఱివురాయ్! – ఓ యశోదమ్మా! నువ్వు మేల్కొనుము. ఇప్పటి వరకు తల్లిదండ్రులను మేల్కొల్పారు కదా! ఇప్పుడు అబ్బాయిగారి దగ్గరికి వస్తున్నారు.

అమ్బర మూడఱుత్తోఙ్గి యులగలన్ద ఉమ్బర్ కోమానే ! – చక్కటి మాట అన్నారు ఇక్కడ. అంబరం అంటే ఆకాశాన్ని, మూడఱుత్ – మధ్యగా భేదించుకొని , ఓఙ్గి అంటే పెరిగి, యులగలన్ద – లోకాలను కొలిచిన వాడు. ఆకాశాన్ని భేదించుకుంటూ పెరిగిపోయి సమస్త లోకాలనీ కొలిచినటువంటి మహానుభావుడు అయిన ఓ కృష్ణా! నువ్వు మేల్కొనుము. అని చెప్పడంలో ఈయన బాలుడిలా కనిపిస్తున్నా త్రివిక్రముడు ఈతడు. వామనుడిలా వచ్చి త్రివిక్రముడు అవలే? అయినప్పుడు



Copyright@gurujnanam.org 

ఏం చేశాడు? ఆకాశాన్ని ఛేదించుకుంటూ పెరిగిపోయాడాయన. పెరిగి ముల్లోకాలనూ కొలిచినటువంటి మహానుభావుడు. కనుక బాలకృష్ణుడిలా కనపడుతున్నా ఈయన మాయ. ఏమిటా మాయావి? ముజ్జగాలనూ కొట్టిన త్రివిక్రముడు బాలుడులా కనపడడమే మాయ. అందుకే మాటిమాటికీ మాయనై మాయనై అని చెప్పడంలో అంతరార్థం అది. ఆ త్రివిక్రమ స్వరూపుడైనటువంటి వాడు. పైగా ఉమ్బర్ కోమానే – అంటే నిత్య శూరులకు రాజు అయిన వాడు. నిత్య శూరులు అని వైష్ణవ సంప్రదాయంలో చెప్తూ ఉంటారు. మహానుభావులైనటువంటి వారు, పరమ పదాన్ని, కైవల్యాన్ని పొందినటువంటి వారిని నిత్య శూరులు అంటారు. వాళ్లకు ఆయన ఏలిక. అటువంటి ఓ స్వామీ! ఉఱజ్గాద్ - ఇంక నువ్వు నిద్రపోకు. అంటే నిన్ను ఆశ్రయించి వచ్చామే! శరణు వేడుకున్నామే! ఇంక మమ్మల్ని ఉపేక్ష చేయకు. నిద్ర పోవడం అంటే మమ్మల్ని ఉపేక్షించడమే. మేల్కొనడం అంటే మమ్మల్ని కరుణించడం. సుప్రభాతం అంటే అర్థం స్వామీ! మమ్మల్ని కరుణించు. నీ చూపు ప్రసరింప జేయి. ఇదీ భావం.

ఉఱజ్గాదెళున్దిరాయ్ – ఇంక నిద్రింప రాదు మేలుకొనుము. ఇప్పుడు వాళ్ళ యొక్క సోదరుడిని మేల్కొల్పుతున్నారు.

శెమ్ పొర్కళ లడిచ్చెల్వా ! బలదేవా ! – ఇక్కడ దీని అర్థం ఏమిటంటే ఎర్రని బంగారంతో ఎరుపు భాగం, రాగి భాగం బాగా కలిపి తయారుచేసినటువంటి సువర్ణమైన కడియములు కలిగినటువంటి పాదములతో ఉన్న బలదేవా! అంటే ఇక్కడ బలదేవుని పాదాలను ఒక్కసారి తలంచుకుంటున్నారు.

బలరాముడు కృష్ణునికి అత్యంత ప్రీతిపాత్రుడు. పైగా బలరామ సహిత కృష్ణ ధ్యానం ఒక ప్రత్యేకత. ఇక్కడ చెప్పబడుతున్న ఈ నలుగురినీ మనం పరిశీలిస్తే ఇందులో ఒక భావాన్ని వైష్ణవ సంప్రదాయ ప్రకారంగా అద్భుతమైన భాష్యాన్ని ఇచ్చారు అనేకమంది ఆచార్యులు. ముందుగా నందుని మేల్కొల్పుట – నందుడు ఇక్కడ


Copyright@gurujnanam.org

ఆచార్యుడిని ఆశ్రయించాలి అనే భావనకు సంకేతంగా చెప్తున్నారు. నందుడు ఆచార్యుడికి సంకేతం. ముందు ఆచార్యుని ఆశ్రయించాలి. తర్వాత ఆచార్యుని ద్వారా భగవంతుని మంత్రాన్ని పొందాలి. ఆ మంత్రం ఇక్కడ యశోదమ్మగా చెప్పబడుతున్నది. ఆచార్యుడిని ఆశ్రయించడం నందుని మేల్కొల్పుట, మంత్రాన్ని పొందటం యశోదను మేల్కొల్పుట, ఇక భగవంతుడిని ఆశ్రయించాలి. శ్రీకృష్ణుడిని మేల్కొల్పుట అంటే భగవంతుణ్ణి ఆశ్రయించాలి. ఆచార్యుడిని ఆశ్రయించాలి, తర్వాత మంత్రాన్ని ఆశ్రయించాలి, ఈ రెండింటి ద్వారా భగవంతుణ్ణి ఆశ్రయించాలి. ఆ ఆశ్రయంలో మనకు సాధన గట్టి పడడానికి భాగవతులను ఆశ్రయించాలి. బలరాముడిని ఆశ్రయించడం భాగవతులను ఆశ్రయించడం. ఇది దీనిలో చెప్తున్న భావం. ఈవిధంగా నంద పరివారంలో ఉన్న కృష్ణ పరమాత్మ మనలను అనుగ్రహించుగాక!

DAY 18:

కృష్ణుడు నీలమేఘశ్యాముడు. ఈ తల్లి నీలాదేవి. ఇక్కడ లక్ష్మీ నారాయణుల తత్త్వమేదో నీలాకృష్ణుల తత్త్వం కూడా అదే అని మనం భావన చేయాలి. ఇక్కడ నీలాదేవిని మేల్కొల్పుతూ ఉన్నారు గోపికలందరూ.

ఇక్కడ నీలాదేవిని సంబోధిస్తున్నటువంటి సంబోధనలు ప్రత్యేకంగా నాలుగు మనకు కనపడుతున్నాయి. 1. మరుమగళే 2. నప్పిన్నాయ్ 3. కన్దమ్ కమళుమ్ కుళలీ 4. పన్దార్ విరలి. మరుమగళే అంటే ఓ కోడలా! అని అర్థం. ఎవరికి కోడలు? నన్ద గోపాలన్ మరుమగళే – నందగోపాలునియొక్క కోడలా! అంటే నందరాజు యొక్క కోడలు. నందుని కొడుకు కృష్ణుడు. కృష్ణుని యొక్క భార్య ఈమె గనుక నందగోపాలుని కోడలు. ఇక్కడ ఈ నీలాదేవిని కృష్ణ పరమాత్మ వివాహమాడడం అనేది ఒక అద్భుతమైన ఘట్టం. ఈ కుంభుడు అనేటటు వంటి



Copyright@gurujnanam.org 

వాని దగ్గర అసుర స్వరూపాలైనటు వంటి ఏడు వృషభాలున్నాయి. ఆ ఏడు వృషభాలనీ ఎవడు నిగ్రహిస్తాడో వాడికి నా కూతుర్ని ఇచ్చి వివాహం చేస్తాను అంటాడు ఆ కుంభుడు. కృష్ణ పరమాత్మ తనయొక్క పరాక్రమంతో ఆ ఏడు వృషభాలనూ నిగ్రహించి నీలాదేవిని చేపడతాడు.

ఉన్దు మదకళిత్త! నోడాద తోళ్వలియన్ నన్ద గోపాలన్ –మదాన్ని స్రవిస్తున్నటువంటి మదగాజాలని నిగ్రహించేటటువంటి నందగోపుడు. ఇక్కడ నందరాజు బలాన్ని వర్ణిస్తున్నారు. తోళ్వలియన్ అంటే మంచి బలము కలిగినటువంటివాడు నందగోపరాజు. ఎటువంటి బలము అంటే ఏనుగులను సైతం నిగ్రహించగలిగే బలము, ఏనుగువంటి బలము – రెండు అర్థాలూ ఇక్కడ తీసుకోవచ్చు. పరాక్రమము అంటే అభయ స్థానము అని అర్థం. ఎవరైతే పరాక్రమవంతుడో వారి నీడలో మనం ఉన్నాం అంటే అభాయంలో ఉన్నట్లే. కనుక ఈమె ఎటువంటి ఇంట్లో ఉన్నది అంటే బలవంతుడైన నందగోపాలునియొక్క కోడిలిగా ఉన్నది. అనగా అభయ స్థానములో ఉన్నది. నన్ద గోపాలన్ మరుమగళే – అని ఇక్కడ ప్రస్తావన.

నప్పిన్నాయ్ – ద్రవిడ భాషలో నప్పిన్నాయ్ అంటే ఓ నీలాదేవీ! అని అర్థం. కన్దమ్ కమళుమ్ కుళలీ – అంటే పరిమళిస్తున్నటువంటి జడ కలిగిన దానా! అమ్మయొక్క కురులు సహజ సౌరభాలతో ఉన్నాయిట. సాధారణంగా జుట్టుకి లేపనాల వల్లనో తైలము వల్లనో, కుసుమాలు పెట్టుకోవడం వల్లనో సువాసన వస్తుంది. కానీ మహాలక్ష్మి స్వరూపమైనటువంటి నీలాదేవి యొక్క కురులు సహజ సుగంధ బంధురంగా ఉన్నాయి అని చెప్పడమే ఇందులో ఉన్న భావం. దీనిని బట్టి ఈ సుగంధం ఏమిటి అంటే కళ్యాణ గుణములే సుగంధములు. అలాంటి దివ్యమైన కళ్యాణ గుణములతో శోభిల్లుతున్న ఓ తల్లీ!


Copyright@gurujnanam.org 

కడై తిరవాయ్- తలుపుయొక్క గడియను తెరువమ్మా. మేమందరం వచ్చి నీ వాకిట నిలబడి కృష్ణుని అనుగ్రహం కోసం ప్రార్తిస్తున్నాం. నువ్వే తలుపు తెరవాలి. అంటే లక్ష్మీదేవి కృప ఉంటేనే, నీలాదేవి కృప ఉంటేనే కృష్ణపరమాత్మయొక్క అనుగ్రహం లభిస్తుంది. ఆ కారణం చేతనే ఈ తల్లిని ఇక్కడ ప్రార్థించడం. ఇప్పుడు తెల్లవారిందమ్మా. నీ చుట్టూ ఇంటి వాతావరణం ఎలా ఉంది అంటే

వన్దెఙ్గుమ్ కోళి అళైత్తనకాణ్ – అన్ని వైపుల నుంచి వచ్చిన కోళ్ళు కూస్తూ ఉన్నాయి.

మాదవి ప్పన్దల్ మేల్ పల్ కాల్ కుయిలి నఙ్గల్ కూవినగాణ్ – మాధవీలత మీద కోయిలలు కూస్తూ ఉన్నాయి. ఒకవైపు అన్నివైపుల నుంచీ కోళ్ళు కూస్తున్నాయి అన్నారు. ఇప్పుడు మాధవీలత అల్లుకున్న పందిరి మీద కోయిలలు కూస్తున్నాయి. కోళ్ళు, కోయిలలు - ఈ రెండింటిలో భావం చూస్తే కోడి అంటే మేల్కొల్పే ధ్వని చేసేది కోడి. భక్తులలో జ్ఞాన ప్రబోధాన్ని కలిగించేటటువంటి పూర్వ ఆచార్యులే. ఇక్కడ కోడి కూతలు అంటే పూర్వాచార్యుల ప్రబోధములు అని అర్థం. కోయిలలు అంటే తీయగా గానం చేసేటటువంటి ఆచార్యులు. వీళ్ళు అంతా ఆళ్వారులు. ఆ ఆళ్వారుల యొక్క గానము వినిపిస్తూన్నది. భక్తులయొక్క గానములు వినపడుతూ ఉన్నాయి. పైగా ఇక్కడ కోయిలలు అని చెప్పడంలో ప్రత్యేకత అది కూడా మాధవీలతని ఆశ్రయించిన కోయిలలు. మాధవి అంటే ఇది కూడా మహాలక్ష్మీదేవియొక్క నామమే. లక్ష్మీదేవిని ఆశ్రయించి తద్వారా నారాయణ కృపకోసం తాపత్రయ పడేటటువంటి భక్తులు. ఆ భక్తులు గానం చేస్తూ ఉన్నారు.

పన్దార్ విరలి ! - అంతవరకూ కృష్ణ పరమాత్మతో పూలబంతులు ఆడుతూ నిద్రపోయింది ఆ తల్లి. ఆ చేతిలో ఆ బంతి అలాగే ఉందిట. దీని అర్థం ఏమిటంటే



Copyright@gurujnanam.org 

అది లీలా కందుకము అని చెప్తారు. ఈ జగతి అంతా అమ్మయొక్క లీల. ఈ బ్రహ్మాండములే బంతులు. వీటితో ఆడుకొనే ప్రకృతి స్వరూపిణే ఆ మహాలక్ష్మీ రూపిణి అయిన నీలాదేవి. అందుకు ఇప్పుడు ఆవిడ నిద్రపోతున్నప్పుడు ఆ బంతితోనే ఉంది. అంటే బ్రహ్మాండములను లీలగా ఆడిస్తున్నటువంటి అమ్మ. మేము వచ్చినది ఎందుకు? అంటే

ఉన్ మైత్తునన్ పేర్పాడ – నీ మేన బావని కీర్తించడానికి వచ్చాం. నీ మేనబావని అంటే నువ్వు వివాహం చేసుకున్నటువంటి ఆ మేనబావయైన కృష్ణుని కీర్తించడానికి వచ్చాం తల్లీ. నువ్వు తలుపు తెరువు. ఎలా వచ్చి తీయాలి అంటే చక్కని కంకణాలు/గాజులు మ్రోగుతున్నటువంటి పద్మాలలాంటి చేతులతో వచ్చి తలుపు తీయవమ్మా సంతోషంగా అన్నారు. దీని అర్థం ఏమిటంటే హరి సంకీర్తన పాడితే అమ్మవారు ఆనందంతో గాజులు మ్రోగుతున్న చేతితో తలుపు తెరిచింది. ఇక్కడ చెయ్యి పేర్కొనడం ఏమిటంటే పైగా పద్మము వంటి చెయ్యి అంటే "వందే పద్మకరాం" – అభయంకరమై, ఐశ్వర్యకరమైన హస్తంతో అమ్మ మనకి అభయాన్నిచ్చి ఆ పరమాత్మను చేరుకోవడానికి వీలును కలిపిస్తూన్నది. అందుకు ఓ తల్లీ! తలుపు తెరువమ్మా! అని ప్రార్థిస్తూ ఉన్నారు గోపికలు. అటువంటి ఆ నీలాంబకు నమస్కరిస్తూ

సర్వం శ్రీకృష్ణ చరణారవిందార్పణమస్తు!!

DAY 19:

కుత్తు విళక్కెరియ - ఇక్కడ ఈ పాశురంలో సగభాగం పరమాత్మని మేల్కొల్పుట, ఇంకోభాగం నీలాంబరిని మేల్కొల్పుట. ఈ రెండూ కనపడుతున్నాయి. ఇక్కడ కృష్ణ పరమాత్మని 'వాయ్ తిరవాయ్' అన్నారు. అంటే నోరు తెరవవయ్యా, అంటే పలకవయ్యా మాతో. పైగా ఏవిధంగా నిద్రపోతున్నాడు అతను. ఒక అద్భుతమైన


Copyright@gurujnanam.org 

దృశ్యాన్ని చూపిస్తున్నారు. ఒక ఎత్తైన మంచం మీద నిద్రపోతున్నాడుట. ఆ మంచం సమీపంలో గుత్తుల దీపములున్నాయి. కుత్తు విళ అంటే గుత్తులుగా ఉన్న దీపములు. గుత్తులు దీపములు అంటే ఒక ప్రమిదలో అన్ని వైపులా వత్తులు ఉంటే దానిని గుత్తి దీపము అంటారు. సాధారణంగా పంచవర్తి దీపములు అని అయిదు వత్తులతో దీపాన్ని పెడతారు. అలాంటి దీపాన్ని కుత్తు విళక్కు అని చెప్తారు. ఇక్కడ ఈ పంచవర్తి దీపములు అంటే అసలు దీపం అనగానే కాంతినిచ్చేది. జ్ఞానాన్నిచ్చేది అని అర్థం.

"ప్రాప్త్యస్య బ్రహ్మణోరూపం ప్రాప్త్యస్య ప్రత్యగాత్మనః!
ప్రాప్త్యుపాయం ఫలం ప్రాప్తేః యథా ప్రాప్తి విరోదినః!!

అని అర్థపంచక జ్ఞానం అని ఒక శాస్త్రం ఉన్నది మనకు వైష్ణవ సంప్రదాయం ప్రకారంగా. ఈ అర్థపంచక జ్ఞానంలో చెప్తున్నది ఏంటి అంటే పొందవలసిన పరబ్రహ్మ గురించి, పొందడానికి అర్హుడైన జీవుని స్వరూపం, పొందవలసిన ఉపాయం, ఇప్పటికి మూడు అయ్యాయి. మిగిలిన రెండూ కూడా ప్రాప్తి వల్ల వచ్చే ఫలము, అటుపై ఆ ప్రాప్తికి ఏవి ప్రతిబంధకాలో వాటిగురించి తెలుసుకొనుట. ఈ అయిదు విషయములపై అవగాహన ఉండాలి. ఒకటి బ్రహ్మము, రెండవది అర్హుడైన జీవుడు, మూడాది పొందవలసిన ఉపాయము, నాల్గవది ఫలము, అయిదవది ప్రతిబంధకము. అయిదింటి గురించిన జ్ఞానాన్ని అర్థపంచక జ్ఞానము అంటారు. ఈ అయిదూ తెలిస్తేనే మనం పరమాత్మను పొందగలం. అదే ఇక్కడ పంచలక్షణములు కలిగిన శయ్య అని అన్వయించడం జరుగుతున్నది. అలాంటి ఆ శయ్యపై

కొత్తలర్ పూఙ్గళల్ నప్పిన్నై కొంగైమేల్ - ఇందులో విశేషం ఏంటి అంటే చక్కటి పువ్వులు అలంకరించుకున్నటువంటి కేశపాశములు కలిగిన నీలాదేవి. ఆవిధంగా ఉన్నటువంటి నీలాదేవి వక్షస్థలంపై నిద్రిస్తున్నటువంటి కృష్ణపరమాత్మని ఇక్కడ



Copyright@gurujnanam.org 

వాయ్ తిరవాయ్ - నోరు తెరిచి మాతో పలకరించవయ్యా! అని ప్రార్థిస్తున్నారు.
మెత్తడజ్ఞ్కణ్ణినాయ్ - అంటే కాటుక అలదిన కన్నులు కల తల్లీ! అని ప్రార్థిస్తున్నారు.
నీ యున్మణాలనై - ఇక్కడ ఉన్మణాలనై అంటే నీ వల్లభుని అర్థం. నీ ప్రియుడైన కృష్ణ పరమాత్మని లేవదీయవా? ఏంటి? నువ్వు. అలా ఆయనని గాఢంగా ఆలింగనం చేసి పట్టుకున్నావు. మాకు కావాలి ఆయనయొక్క అనుగ్రహం. ఆయనని నువ్వు నిద్ర లేవనివ్వవా? నువ్వు లేచి, ఆయనకు కూడా మెలకువనిచ్చి మమ్మల్ని అనుగ్రహింప జేయవమ్మా! అని చెప్పడం ఇక్కడ. అందుకు
తుయిలెళ ఒట్టాయ్ కాణ్ ఎత్తనై యేలుమ్ పిరివాట్ర గిల్లాయాల్ - దీని భావమేమిటి అంటే ఆయన ఎడబాటు కాసింత సేపు కూడా నీవు సహించలేవా? అందుకే ఆయన నిద్రలేవకుండా నువ్వు చేత్తో పట్టుకొని నిద్ర పుచ్చుతూన్నావు. కాసింత కూడా ఆయన ఎడబాటు సహించలేవా? దయచేసి నువ్వు మేల్కొని ఆయనను మేల్కొననిచ్చి మీ ఇరువురి అనుగ్రహం మాకు కలిగించమ్మా! అని ప్రార్థిస్తున్నారు. పైగా ఆయనని మేల్కొనివ్వకుండా నువ్వు అలా ఉండడం అనేది నీ స్వభావానికి తగినది కాదు సుమా!
తత్తువ మన్రుత్తగవు - అంటే నీ స్వరూపానికీ, నీ స్వభావానికీ తగిన పని కాదు ఇది. అనగా నువ్వు అనుగ్రహ స్వరూపిణివి. మేమందరం ప్రార్థిస్తూ ఉన్నాం. కరుణ గల నీకు ఇది తగని పని సుమా! దయచేసి అనుగ్రహించి ఆ స్వామి యొక్క కృప మాకు కలిగేలా ఆయనను మేల్కొల్పమ్మా! ఆయనని మాతో మాట్లాడనీయమ్మా! అని ఇందులో మేల్కొల్పు భావం ఉన్నది.

DAY 20:


Copyright@gurujnanam.org

ముప్పత్తు మూవర్ అమరర్కు మున్ శెన్రు కప్పమ్ తవిర్కుమ్ కలియే - ముప్పది మూడు కోట్ల దేవతలకి రక్షణనిచ్చేటటువంటి పరమాత్మ. ఇదీ సంబోధన. ముప్పది మూడు కోట్లు దేవతలు ఉన్నారుట. ఎవరు వీరు? వీటికి సంబంధించినటువంటి వైదిక విశేషములున్నాయి. ద్వాదశాదిత్యులు, ఏకాదశ రుద్రులు, అష్టవసువులు, అశ్వినీ దేవతలు - మొత్తం వీళ్ళు ముప్పై ముగ్గురు. వీళ్ళకి ఉన్న గణములు, వీటితో కలిగి దేవగణములు అన్నీ ముప్పై మూడు కోట్లు. ఈ దేవగణములన్నింటికీ అధిపతియైన దేవాధిదేవుడు భగవానుడు శ్రీమన్నారాయణుడు, ఆయనే శ్రీకృష్ణ పరమాత్మ. అందుకు దేవతలను అనుగ్రహించడానికి అవతరించిన వాడు అనే భావము ఇక్కడ ఈ మొదటి పాదంలోనే చూపిస్తున్నారు. పైగా ఎలా అనుగ్రహిస్తున్నాడు అంటే మున్ శెన్రు కప్పమ్ తవిర్కుమ్ కలియే - మున్ శెన్రు - అంటే వాళ్లకి ఆపద కలగడం కంటే ముందే ఆయన అనుగ్రహిస్తున్నాడుట. ఆపద కలిగాక అనుగ్రహించడం ఒకటున్నది. అలా కాకుండా ఆపద రాకుండానే అనుగ్రహిస్తున్నాడు స్వామి. అనగా ఆయన యొక్క భక్త రక్షణలో ఉన్నటువంటి త్వర, తొందరగా అనుగ్రహించాలి అనేటటువంటి వాత్సల్యం, ఆ వాత్సల్యాన్ని ఇందులో చూపిస్తున్నారు. అటువంటి వాత్సల్య భావమూ, సామర్ధ్యమూ రెండూ. అటువంటి సమర్ధుడైన ఓ పరమాత్మా! కలియే - అంటే ఓ బలమైన వాడా! పరమాత్మయొక్క పరాక్రమాన్ని ఇక్కడ చెప్తున్నారు. ఈ పరాక్రమం రక్షించే పరాక్రమం. అటువంటి పరాక్రమం కల స్వామీ మేల్కొనవయ్యా! పైగా స్వామికి సంబోధనలో మరో రెండు ప్రత్యేకమైన సంబోధనలున్నాయి ఇక్కడ.

శెప్పముడైయాయ్ తిఱలుడైయాయ్ - ఇందులో భావం ఏమిటంటే శెప్పముడైయాయ్ - అంటే ఆర్జవము కలవాడా! ఇదీ అనువాదం. అదేవిధంగా తిఱలుడైయాయ్ అంటే బలము కలవాడా! ఆర్జవము, బలము - ఈ రెండూ


Copyright@gurujnanam.org

చెప్తున్నారు. ఇక్కడ అంతరంగ లక్షణము ఆర్జవము, బాహ్యామైన లక్షణము బలము. మనసు, మాట, చేత త్రికరణ శుద్ధి . ఈ మూడూ ఒకేలా ఉంటే దానిని ఆర్జవ శక్తి, ఋజుస్వభావము అని అంటారు. అది పరమాత్మ వద్ద ఉన్నది. అటువంటి ఋజు స్వభావం గల ఓ పరమాత్మా! పరాక్రమము గల స్వామీ!

శెప్పముడ్డైయాయ్ - అంటే ఆర్జవము గల దేవుడు. పైగా ఏ మాటిస్తే ఆ మాట పాటిస్తాడుట. ఈ మాట చెప్పడంలో విశేషం ఏమిటంటే ఆశ్రయించిన భక్తులను అనుగ్రహిస్తాను అని మాట ఇచ్చాడు స్వామి. మేము ఇప్పుడు ఆశ్రయించాం. కాబట్టి మమల్ని అనుగ్రహించాలి. అలా అనుగ్రహించడానికి కావలసిన సమర్థత కూడా ఆయన వద్ద ఉన్నది. అందుకే తిఱలుడ్డైయాయ్ - సమర్థత కలవాడు. బలం కలిగినటువంటి వాడు. పైగా ఆయన పరాక్రమం ఎటువంటిది అంటే

శెట్రార్కు వెప్పమ్ కొడుక్కుమ్ విమలా - అనగా శత్రువులకి జ్వరం పుట్టించేటటువంటి పరాక్రమం కలవాడు అని. విమలా - ఆ సంబోధన చాలా అద్భుతమైన సంబోధన. విమలా అంటే నిర్మలుడా! అని అర్థం. స్వామి ఏ దోషమూ లేనటువంటి వాడు.

తుయిలెళాయ్ - మేల్కొను.

శెప్పన్న మెన్ముల్లై - ఇక్కడ చెప్పేటప్పుడు ఆ తల్లిని సంబోధిస్తూ ఉన్నారు. చక్కని ఉన్నతమైన స్వర్ణ కలశముల వంటి వక్షస్థలము కలిగినటు వంటి తల్లీ! ఎఱ్ఱని పెదవులు గల తల్లీ! సన్నని నడుము కల తల్లీ! ఇక్కడ అమ్మయొక్క దివ్య శోభా లక్షణములతో కూడిన సర్వ లక్షణ సంపన్నమైన మంగళ విగ్రహాన్ని వర్ణిస్తున్నారు.

నప్పిన్నై - అంటే ఓ నీలాదేవీ!

నంగాయ్ ! - ఓ పరిపూర్ణురాలా! మేలుకో ఓ నీల పరిపూర్ణురాలా! అని అనువదించారు కృష్ణశాస్త్రి గారు ఇక్కడ. అందుకే



Copyright@gurujnanam.org 

తిరుపే ! అన్నారు. సంబోధనలో తిరుపే అంటే స్త్రీ స్వరూపిణి, లక్ష్మీ స్వరూపిణి
తుయిలెలాయ్ - మేల్కొనవమ్మా! అని నీలాదేవిని మేల్కొల్పారు. పైగా మేల్కొని ఆ కృష్ణ పరమాత్మ మాతోపాటు స్నానానికి రావాలి. చక్కటి భావం. గోపికలందరూ కలిసి స్నానానికి వెళ్ళడం కాదు. పరమాత్మ కూడా రావాలిట. ఇందులో విశేషం అది. అనగా గమనించవలసిన అంశం ఏమిటంటే ఇప్పుడు వ్రతం చేస్తున్నారు. వ్రతం ఫలితంగా పరమాత్మయొక్క అనుగ్రహం రావాలి. ఇది నిజమే. కానీ వ్రతంలో భాగమైన స్నానంలో కూడా పరమాత్మ ఉండాలిట. అంటే సాధనలో కూడా పరమాత్మ ఉంటాడు. సిద్ధిలోనే కాదు.

ఉక్కముమ్ - అన్నప్పుడు సంస్కృతంలో ఆలవట్టము అని అంటారు. అంటే మనం వింజామర, విసనకర్ర అని చెప్పుకోవచ్చు.

తట్టొళియుమ్ అంటే అద్దము అని అర్థం. ఆలవట్టము, అద్దము, ఈ రెండూ కూడా మాకు ఇచ్చి

ఉన్ మణాళనై - నీ వల్లభుని మాతో పాటు

ఇప్పోదే - అంటే ఇప్పుడే

యెమ్మై నీరాట్టు - మాతోపాటు నీరాడేటట్లు చేయుము. అంటే స్నానానికి వచ్చేటట్లు చేయమ్మా!అని ప్రార్థిస్తున్నారు. అంటే

పరమాత్మ సాంగత్యాన్ని ఇక్కడ అర్థిస్తూ ఉన్నారు. పైగా అడిగినది ఇక్కడ ఆలవట్టము, అద్దము. ఇందులో ఉన్న భావాన్ని చూద్దాం. వింజామర/విసనకర్ర - గాలివీచే సాధనం. ఇక్కడ విసనకర్ర అవసరం ఎప్పుడు అవుతుంది? ఉక్కపోత ఉన్నప్పుడు విసనకర్ర అవసరం ఉంటుంది. మరి విసనకర్రను అడగడంలో అర్థం ఏమిటి? అంటే తాపత్రయ నాశనం కలగాలి. తాపము తొలగాలి. జీవుడికి ఉన్నటువంటి ప్రకృతిలో పడిన దగ్గరనుంచి జన్మ పరంపరల నుంచి పట్టుకున్న



Copyright@gurujnanam.org 

తాపములు మూడు ఉన్నాయి. వీటిని తాపత్రయాలు అంటారు. ఆదిభౌతిక, ఆధ్యాత్మిక, ఆధిదైవిక తాపములు. ఈ మూడు తాపాలూ పోవాలి. భక్తిలో ఇది చాలా ప్రధానం. కనుకనే తాపత్రయ శాంతి కలగాలి అని చెప్పడమే అక్కడ వింజామర/విసనకర్ర ఇవ్వమని చెప్పడంలో అర్థం. ఇంకొకటి అద్దాన్ని అడిగారు. అద్దము అంటే స్వస్వరూప జ్ఞానము. తనను తాను తెలియజేసేది అద్దం. అందుకు తానేమిటో తెలియజేసేటటువంటి ఆ జ్ఞాన స్వరూపమైన దర్పణము ఇక్కడ ఇమ్మని. కనుకనే తాపశాంతి, జ్ఞానప్రాప్తి. ఈ రెండూ కావాలి. ఈ రెండింటితోనే పరమాత్మ లభిస్తున్నాడు. ఈ మూడూ ఇవ్వాలి అంటే అమ్మ అనుగ్రహం ఉండాలి. ఆ తల్లి అనుగ్రహం ఉంటేనే గానీ ఈ మూడూ లభించవు

DAY 21:

ముందుగా నందుని కుమారుడా! మేల్కొను. అయితే ఎటువంటి నందుడు అంటే ఏట్రకలంగ ళెదిరిపొంగి మీదళిప్ప మాట్రాదే పాల్ శొరియుమ్ వళ్లల్ పెరుమ్ పశుక్కల్ ఆట్ర ప్పడైత్తాన్ మగనే - ఇక్కడ మగనే అంటే కుమారుడా అని అర్థం. నందగోపుని కుమారుడు కృష్ణ పరమాత్మ. ఎటువంటి నందగోపుడు అని అంటే చక్కటి పశువులు కలిగినటువంటి నందగోపుడు. నందగోపుడి గొప్పతనం అంతా ఆయన గోపాలకుడు కనుక చక్కటి గోసంపద కలిగినటువంటి వాడు. అదీ ఆయనయొక్క గొప్పతనం. ఎటువంటి గోవులు? ఆ గోవులలో కూడా పెరుమ్ పశుక్కల్- చాలా పెద్ద పెద్ద పశువులుట. అంటే అన్నివిధాలా సమృద్ధి కలిగిన బలమైన పశువులు. ఎలాంటి పశువులు అంటే చక్కటి పాడిని ఇచ్చే పశువులు. పశువులు కలవాడు నంద గోపుడు. ఆ పశువుల గొప్పతనం ఇక్కడ చెప్తున్నారు. ఆ గోసంపదను బట్టి ఆయనకు గొప్పతనం పెరుగుతున్నది. అటువంటి ఆయనకు కుమారుడా! అని చెప్పడంలో ఇందులో విశేషం. ఆ గోవులు ఎటువంటివి? అంటే


Copyright@gurujnanam.org

వాటి దగ్గర కానీ కడవలు పెడితే ఆ కదవాలన్నీ వెంటనే నిండిపోతున్నాయిట. అంత సమృద్ధిగా పాలనిస్తున్నాయి. కడవలు పెట్టడం ఆలస్యం నిండిపోతూన్నాయి. ఎన్ని కడవలు తీసుకెళుతూన్నా నింపగలిగే సమృద్ధి కలిగిన పాడి కలిగిన గోవులు అవి. ఎలా నిండి పోతున్నాయి అంటే ఏట్రకలంగళ్ - పాల కోసం తెచ్చి పెట్టిన కుండలన్నీ కూడా ఎదిరిపొంగి - పైపైకి పొంగిపోయి పొరలిపోతున్నట్లుగా ఆగకుండా పాలను కురిపించేటటువంటి ఉదారముల్లైన పెద్ద గోవులు. ఉదారము అంటే ఎక్కడా దాపరికం లేకుండా అనుగ్రహించడాన్ని ఔదార్యము అంటారు. అలాంటి ఔదార్యంతో కూడిన పాలను ఇచ్చేటటువంటి ఆవులు. వేద వాక్యములకి గోవులు అని పేరు. ఆ వేదవాక్య విజ్ఞాన సంపద కలిగిన ఆచార్యుడే ఇక్కడ నందగోపుడు. ఇది గోసంపద కలిగిన ఆచార్యుడు. ఆ ఆచార్యుని నోటి వెంట పలికే పలుకులు కూడా గోవులే. వారు మనకు చేసే ఉపదేశములన్నీ వేదాది వాక్యములే. వాటిలో చెప్పినదాన్నే చెప్తారు. ఈ వాక్యముల ద్వారా మనకు దొరుకుతున్నదేమిటి? పరమాత్మయొక్క తత్త్వములే క్షీరము. ఆ క్షీరాన్ని సమృద్ధిగా అందించే గోసంపదలే వేదం విజ్ఞాన వాక్యములు. అవి సమృద్ధిగా కలిగిన ఆచార్యుడాయన. అది ఆ నందగోపుడు అని చెప్పడంలో ఉన్న ప్రత్యేకత. అటువంటి నందగోపుని కుమారుడా!

యరివురాయ్ - మేల్కొనవయ్యా! నువ్వు ఎటువంటి వాడివి?

ఊట్రముడై యాయ్ ! పెరియాయ్ ! - రెండు సంబోధనలు ఇక్కడ. చాలా చక్కటి దృఢత్వము కలిగినటువంటి వాడా! అంటే పెంపు కలిగినటువంటి వాడా!

పెరియాయ్ - పెద్దవాడా! రెండు సంబోధనలు - పెంపు కలిగిన వాడు, పెద్దవాడు.

ఊట్రముడై యాయ్ - అనేమాట సంస్కృతంలో చూస్తే బృహత్వాత్ అనే అర్థాన్ని చెప్తోంది. పెరియాయ్ అన్నప్పుడు బృహ్మణత్వాత్ అని అర్థాన్ని చెప్తున్నది. బృహత్వాత్ బృహ్మణత్వాత్ ఇతి బ్రహ్మ అని. బ్రహ్మము శ్రీకృష్ణుడు. బ్రహ్మము అనే


Copyright@gurujnanam.org

మాటకు పెద్దవాడు, సర్వవ్యాపకుడు రెండు అర్థాలు. అందుకే ఇక్కడ అంతటా వ్యాపించిన వాడు, అన్నింటికంటే పెద్దవాడు, ఆయనను మించిన పెద్ద వస్తువు మరొకటి లేదు ప్రపంచంలో. ఆ పరబ్రహ్మ ఈ ప్రపంచంలో కృష్ణ పరమాత్మగా అవతరించాడు. అవతరించి ప్రకాశిస్తున్నాడు. తన లీలలతో ప్రకాశించాడు. అదే తోట్రమాయ్ నిన్ర శుడరే - వెలిగిపోయాడు. తనయొక్క తేజఃస్వరూపాన్ని ప్రకటించాడు. ఆయన చేసిన లీలలు అన్నీ ఇన్నీ కావు. ఆ లీలలన్నింటిలో కూడా ఆయనయొక్క వెలుగు కనిపిస్తోంది. ఆవిధంగా తన లీలలతో ప్రకాశించిన ఓ తేజఃస్వరూపా!

తుయిలెళాయ్ - మేల్కొనుము. ఆయనయొక్క వైభవాన్ని కీర్తించాలి. ఆ కీర్తనమే మనకి మంగళం కలిగిస్తున్నది. పైగా ఎలా కీర్తిస్తున్నాము అంటే పెద్ద పెద్ద శత్రువులు కూడా నీ పరాక్రమం దగ్గర ఓడిపోయి

ఉన్ వా శర్కణ్ - నీవాకిటి వద్దకు వచ్చి

మాట్రారునక్కు వలితులైన్దు ఉన్ వా శర్కణ్

ఆట్రాదు - ఇంక ఓర్వలేక నిన్ను కీర్తిస్తున్నారు. పైగా వాళ్ళు

వన్దు ఉన్నడి పణియు మాప్పోలే - నీపాదాలపై పడి స్తుతిస్తూ ఉన్నారు. ఇక్కడ చెప్పడంలో విశేషం ఏమిటంటే గొప్ప గొప్ప వదరుబోతులైన శత్రువులు కూడా పరమాత్మ పరాక్రమం దగ్గర ఓడిపోయారు. ఓడిపోయి ఏమయ్యారు? శరణువేడారు. లోకంలో అహాన్ని అణచుకోవడం కష్టం. అహంకారం అణచుకోవడం అనేటటువంటిది ఉన్నదే అది గొప్ప విశేషం. అదే పెద్ద శత్రువు అహంకారం. అహంకారాన్ని అణచుకొని నిన్ను స్తుతిస్తున్నాం. అందుకే భగవత్ స్తుతికి ప్రధాన అర్హత అహంకారం అణగాలి. అంతేకానీ గొప్పగా స్తోత్రం చేశాను అని కొత్త అహంకారం రాకూడదు. అందుకు అహంకారములు అణగి నిన్ను స్తుతిస్తూ ఉన్నాం. ఇది సంపూర్ణ శరణాగతి. ఇటువంటి శరణాగతితో నిన్ను ఆశ్రయించాము


Copyright@gurujnanam.org 

స్వామీ! మేల్కొని అనుగ్రహించవయ్యా అని ఇక్కడ కృష్ణ తత్త్వాన్ని, శరణాగతి తత్త్వాన్ని ఈ పాశురంలో అమ్మకి నమస్కారం చేసుకుంటూ

ఆండాళ్ తిరువడిగలై శరణం!!

DAY 22:

ముందుగా నందుని కుమారుడా! మేల్కొను. అయితే ఎటువంటి నందుడు అంటే ఏట్రకలంగ ళెదిరిపొంగి మీదళిప్ప మాట్రాదే పాల్ శొరియుమ్ వళ్లల్ పెరుమ్ పశుక్కల్ ఆట్ర ప్పడైత్తాన్ మగనే - ఇక్కడ మగనే అంటే కుమారుడా అని అర్థం. నందగోపుని కుమారుడు కృష్ణ పరమాత్మ. ఎటువంటి నందగోపుడు అని అంటే చక్కటి పశువులు కలిగినటువంటి నందగోపుడు. నందగోపుడి గొప్పతనం అంతా ఆయన గోపాలకుడు కనుక చక్కటి గోసంపద కలిగినటువంటి వాడు. అదీ ఆయనయొక్క గొప్పతనం. ఎటువంటి గోవులు? ఆ గోవులలో కూడా పెరుమ్ పశుక్కల్- చాలా పెద్ద పెద్ద పశువులుట. అంటే అన్నివిధాలా సమృద్ధి కలిగిన బలమైన పశువులు. ఎలాంటి పశువులు అంటే చక్కటి పాడిని ఇచ్చే పశువులు. పశువులు కలవాడు నంద గోపుడు. ఆ పశువుల గొప్పతనం ఇక్కడ చెప్తున్నారు. ఆ గోసంపదను బట్టి ఆయనకు గొప్పతనం పెరుగుతున్నది. అటువంటి ఆయనకు కుమారుడా! అని చెప్పడంలో ఇందులో విశేషం. ఆ గోవులు ఎటువంటివి? అంటే వాటి దగ్గర కానీ కడవలు పెడితే ఆ కదవాలన్నీ వెంటనే నిండిపోతున్నాయిట. అంత సమృద్ధిగా పాలనిస్తున్నాయి. కడవలు పెట్టడం ఆలస్యం నిండిపోతూన్నాయి. ఎన్ని కడవలు తీసుకెళుతూన్నా నింపగలిగే సమృద్ధి కలిగిన పాడి కలిగిన గోవులు అవి. ఎలా నిండి పోతున్నాయి అంటే ఏట్రకలంగళ్ - పాల కోసం తెచ్చి పెట్టిన కుండలన్నీ కూడా ఎదిరిపొంగి - పైపైకి పొంగిపోయి


Copyright@gurujnanam.org

పొరలిపోతున్నట్లుగా ఆగకుండా పాలను కురిపించేటటువంటి ఉదారములైన పెద్ద గోవులు. ఉదారము అంటే ఎక్కడా దాపరికం లేకుండా అనుగ్రహించడాన్ని ఔదార్యము అంటారు. అలాంటి ఔదార్యంతో కూడిన పాలను ఇచ్చేటటువంటి ఆవులు. వేద వాక్యములకీ గోవులు అని పేరు. ఆ వేదవాక్య విజ్ఞాన సంపద కలిగిన ఆచార్యుడే ఇక్కడ నందగోపుడు. ఇది గోసంపద కలిగిన ఆచార్యుడు. ఆ ఆచార్యుని నోటి వెంట పలికే పలుకులు కూడా గోవులే. వారు మనకు చేసే ఉపదేశములన్నీ వేదాది వాక్యములే. వాటిలో చెప్పినదాన్నే చెప్తారు. ఈ వాక్యముల ద్వారా మనకు దొరుకుతున్నదేమిటి? పరమాత్మయొక్క తత్త్వములే క్షీరము. ఆ క్షీరాన్ని సమృద్ధిగా అందించే గోసంపదలే వేదం విజ్ఞాన వాక్యములు. అవి సమృద్ధిగా కలిగిన ఆచార్యుడాయన. అది ఆ నందగోపుడు అని చెప్పడంలో ఉన్న ప్రత్యేకత. అటువంటి నందగోపుని కుమారుడా!

యరివురాయ్ - మేల్కొనవయ్యా! నువ్వు ఎటువంటి వాడివి?

ఊట్రముడై యాయ్ ! పెరియాయ్ ! - రెండు సంబోధనలు ఇక్కడ. చాలా చక్కటి దృఢత్వము కలిగినటువంటి వాడా! అంటే పెంపు కలిగినటువంటి వాడా!

పెరియాయ్ - పెద్దవాడా! రెండు సంబోధనలు - పెంపు కలిగిన వాడు, పెద్దవాడు.

ఊట్రముడై యాయ్ - అనేమాట సంస్కృతంలో చూస్తే బృహత్త్వాత్ అనే అర్థాన్ని చెప్తోంది. పెరియాయ్ అన్నప్పుడు బృహ్మణత్వాత్ అని అర్థాన్ని చెప్తున్నది. బృహత్త్వాత్ బృహ్మణత్వాత్ ఇతి బ్రహ్మ అని. బ్రహ్మము శ్రీకృష్ణుడు. బ్రహ్మము అనే మాటకు పెద్దవాడు, సర్వవ్యాపకుడు రెండు అర్థాలు. అందుకే ఇక్కడ అంతటా వ్యాపించిన వాడు, అన్నింటికంటే పెద్దవాడు, ఆయనను మించిన పెద్ద వస్తువు మరొకటి లేదు ప్రపంచంలో. ఆ పరబ్రహ్మ ఈ ప్రపంచంలో కృష్ణ పరమాత్మగా అవతరించాడు. అవతరించి ప్రకాశిస్తున్నాడు. తన లీలలతో ప్రకాశించాడు. అదే తోట్రమాయ్ నిన్ర శుడరే - వెలిగిపోయాడు. తనయొక్క తేజఃస్వరూపాన్ని


Copyright@gurujnanam.org

ప్రకటించాడు. ఆయన చేసిన లీలలు అన్నీ ఇన్నీ కావు. ఆ లీలలన్నింటిలో కూడా ఆయనయొక్క వెలుగు కనిపిస్తోంది. ఆవిధంగా తన లీలలతో ప్రకాశించిన ఓ తేజఃస్వరూపా!

తుయిలెళాయ్ - మేల్కొనుము. ఆయనయొక్క వైభవాన్ని కీర్తించాలి. ఆ కీర్తనమే మనకి మంగళం కలిగిస్తున్నది. పైగా ఎలా కీర్తిస్తున్నాము అంటే పెద్ద పెద్ద శత్రువులు కూడా నీ పరాక్రమం దగ్గర ఓడిపోయి

ఉన్ వా శర్కణ్ - నీవాకిటి వద్దకు వచ్చి

మాట్రారునక్కు వలితులైన్దు ఉన్ వా శర్కణ్

ఆట్రాదు - ఇంక ఓర్వలేక నిన్ను కీర్తిస్తున్నారు. పైగా వాళ్ళు

వన్దు ఉన్నడి పణియు మాప్పోలే - నీపాదాలపై పడి స్తుతిస్తూ ఉన్నారు. ఇక్కడ చెప్పడంలో విశేషం ఏమిటంటే గొప్ప గొప్ప వదరుబోతులైన శత్రువులు కూడా పరమాత్మ పరాక్రమం దగ్గర ఓడిపోయారు. ఓడిపోయి ఏమయ్యారు? శరణువేడారు. లోకంలో అహాన్ని అణచుకోవడం కష్టం. అహంకారం అణచుకోవడం అనేటటువంటిది ఉన్నదే అది గొప్ప విశేషం. అదే పెద్ద శత్రువు అహంకారం. అహంకారాన్ని అణచుకొని నిన్ను స్తుతిస్తున్నాం. అందుకే భగవత్ స్తుతికి ప్రధాన అర్హత అహంకారం అణగాలి. అంతేకానీ గొప్పగా స్తోత్రం చేశాను అని కొత్త అహంకారం రాకూడదు. అందుకు అహంకారములు అణగి నిన్ను స్తుతిస్తూ ఉన్నాం. ఇది సంపూర్ణ శరణాగతి. ఇటువంటి శరణాగతితో నిన్ను ఆశ్రయించాము స్వామీ! మేల్కొని అనుగ్రహించవయ్యా అని ఇక్కడ కృష్ణ తత్త్వాన్ని, శరణాగతి తత్త్వాన్ని ఈ పాశురంలో అమ్మకి నమస్కారం చేసుకుంటూ

ఆండాళ్ తిరువడిగళె శరణం!!



Copyright@gurujnanam.org 

DAY 23:

స్వామీ! ఒక సింహం గుహలోంచి వచ్చినట్లు నువ్వు నిద్రమేల్కొని వెలికివచ్చి మమ్మల్ని అనుగ్రహించు. పైగా గుహలోంచి వెలికివచ్చి ఇక్కడ ఈ సింహాసనం మీద కూర్చొని మమ్మల్ని చూడవయ్యా అన్నారు. సింహాన్ని ఎవరో నిద్రలేపలేరు. తనంత తాను నిద్రలేవాలి. అలా నిద్రలేవాలి అనే భావం సింహానికి కలగాలి. ఆ భావం సింహానికి కలగాలి అంటే ముందు మనం ప్రార్థించాలి. ఆ ప్రార్థన వల్ల కారుణ్య భావం కలిగి ఆ కృష్ణ సింహం/పరమాత్మ సింహం ఆ అంతర్ గుహలోంచి వెలికి రావాలి. ఇదీ భావం. ఆ సింహం వెలికి వచ్చినప్పుడు ఎలా వచ్చిందో అనేదాన్ని అద్భుతమైన కవితా శక్తితో అమ్మ గోదాదేవి ఇక్కడ వర్ణిస్తూ ఉన్నది.

మారి మలై ముఱైంజిల్ మన్ని క్కిడందుఱంగుం - మారి అంటే వర్షాకాలంలో; మలై ముఱైంజిల్ - అంటే కొండ గుహలో; మన్ని క్కిడందుఱంగుం - నిశ్చలంగా పడుకొని నిద్రపోతున్నటువంటి

శీరియ శింగం - శౌర్యము, శ్రేష్ఠత్వమూ కలిగిన సింహము వలె రావయ్యా! అని. ఆ రావడం ఎలా వస్తున్నది అంటే

అరివుత్తు త్తీవిరిత్తు వేరి మయర్ పొంగ - అద్భుతమైన చిత్రాన్ని ఇక్కడ అందిస్తున్నది అమ్మ. కవితా రూప చిత్రమిది. అరివుత్తు త్తీవిరిత్తు - అరివుత్తు అంటే మెలకువ తెచ్చుకొని; త్తీవిరిత్తు - తీక్ష్ణముగా చూస్తూ; వేరి మయర్ పొంగ - తనయొక్క జూలంతా కూడానూ నిక్కి నిగిడ్చేలాగా ఒళ్ళంతా సాగదీసుకుందిట ఆ సింహం వెలికివచ్చి. పైగా జూలు ఎలా ఉన్నది అంటే ఒక చక్కని పరిమళంతో ఉందిట. సుగంధ బంధురంగా ఉన్నది. సహజ సుగంధ బంధురమైన నారాయణ తత్త్వమిది. జూలు అంటే కేశములు అని అర్థం. ఆయన పేరే కేశవుడు. అందమైన కేశములు కలవాడు అన్నారు ఇక్కడ. సుగంధ బంధురమైనటువంటి కేశములు



Copyright@gurujnanam.org 

ఎప్పాడుం పేరుందుదబి - అలాంటి ఆ దివ్యమైన కేశములు నిక్కి నిగిడ్చేలాగా అన్నివైపులా ఒక్కసారి శరీరాన్ని కదిల్చి; ఉదరి - శరీరాన్ని దులుపుకొని

మూరి నిమిరుందు - ముందుకు సాగి

మురంగి - గర్జించి

ప్పుఅప్పట్టు - బయలువెడలె. ఒక అద్భుతమైన చిత్రమిది. ముందుగా నిద్రలేచి తీక్షణంగా చుట్టూ చూసి తన వెంట్రుకలను తానే వంగదీసి శరీరాన్ని సాగదీసి ముందుకు వచ్చి గర్జించి గుహలోంచి వెలికి వచ్చిందిట సింహం. ఆవిధంగా వస్తున్నటువంటి స్వామీ!

పోదరుమా పోలే - ఆ సింహం ఎలా సాగి వస్తున్నదో ఆ విధంగా సాగి వచ్చేటటువంటి స్వామీ!

నీ పూవైప్పూ వణ్ణా - ఇది చాలా చక్కటి సంబోధన. అతసీ కుసుమము వంటి కాంతి కలవాడా! అతసీ కుసుమము అంటే అవిసె పువ్వు. అవిసెపువ్వు వంటి కాంతి కలవాడా! స్వామియొక్క ప్రతాపాన్ని సింహంతో పోల్చి వెంటనే పువ్వు వంటి కాంతి కలవాడా అంటే సుకుమారమైన వస్తువుతో పోల్చారు. తీక్ష్ణమైన సింహం పోలిక ఎక్కడ? సుకుమారమైన కుసుమం పోలిక ఎక్కడ? రెండు భావాలకీ ఏవిధంగా కుదురుతున్నది? అని అంటే స్వామిలో ఎంత తీక్ష్ణమైన ప్రతాప లక్షణం కనపడుతున్నదో అంత సౌకుమార్యం కూడా ఉంది.

ఉన్కోయిల్ నిన్టు-ఇంగనే పోందరుళి - నీమందిరం నుంచి నువ్వు ఇక్కడికి వచ్చి; అంటే ఆ మందిరంలో నిద్రపోతున్న స్వామి వీళ్ళు ప్రార్థిస్తున్న సభా ప్రాంగణంలోకి రావాలిట. వచ్చి

క్కోప్పుడైయ శీరియ శింగాశనత్తి - మనోహరమైనటువంటి ఈ శ్రేష్ఠమైన సింహాసనం పై

ఇరుందు - అంటే కూర్చొని; మేము వచ్చినటువంటి కార్యాన్ని


Copyright@gurujnanam.org 

ఆరాయ్-అందరుళ్ - పరిశీలించి కృప చేయవయ్యా! మేము చేసుకున్న విన్నపాన్ని నువ్వు ఇక్కడకు వచ్చి ఈ సింహాసనం మీద కూర్చొని పరిశీలించి మాకు ఫలితాన్ని ప్రసాదించు. దయ చూపించు. అని దీనియొక్క భావం.

DAY 24:

ఇందులో వివిధములైన మంగళములు స్వామివారి యొక్క పాదములకు, బలమునకు, కీర్తికి, ఇలా వివిధములైన భావాలతో మంగళము ఈ గీతంలో కనపడుతూ ఉన్నది. ఇందులో చెప్తున్నటువంటి ఈ మంగళ గీతంలో 'పోత్తి పోత్తి' అనే పదం వస్తూ ఉన్నది. 'పోత్తి' అంటే మంగళము అని అర్థం.

అన్టివ్వులగమ్ అళందాయ్ అడి పోత్తి - అన్రు అంటే ఆనాడు; ఏనాడు? పూర్వకాలంలో స్వామి ఒకప్పుడు అవతరించి చూపించిన ఒక లీలని ఈ వాక్యంలో స్మరిస్తూ ఉన్నది తల్లి. ఇవ్వులగమ్ అళందాయ్ - ఈలోకాన్ని కొలిచినటువంటి; అడి - నీపాదములకు; పోత్తి - మంగళము. ఆనాడు ఈ సమస్త లోకాలను కొలిచినటువంటి నీపాదములకు మంగళము. ఆనాడు అంటే పూర్వకాలమునందు. అనగా వామనావతార సమయంలో నువ్వు వామనుడిగా వచ్చి త్రివిక్రముడిపై ముల్లోకాలనీ కొలిచావు. అలా ముల్లోకాలనూ కొలిచినటువంటి నీపాదములకు వందనం.

శెన్టంగు త్తెన్-ఇలంగై శెత్తాయ్ తిఱల్ పోత్తి - ఇందులో ఉన్న విశేషం ఏమిటంటే శెన్టంగు త్తెన్- అంటే దక్షిణం వైపు ఉన్నటువంటి అందమైన లంకా నగరాన్ని చేరి దానిని ధ్వంసం చేసినటువంటి; తిఱల్ - నీ బలానికి మంగళము. అంటే రావణాసురుడు చాలా అందంగా దిద్ది తీర్చుకున్నాడు లంకా నగరాన్ని. అలాంటి లంకా నగరంలో ప్రవేశించి ఆ లంకా నగర వైభవాన్ని మొత్తం నాశనం చేసినటువంటి నీ బలానికి నమస్కారం.



Copyright@gurujnanam.org 

పొన్ఱచ్చకడం ఉదైత్తాయ్ పుగర్ పోత్తి - నీ కీర్తికి మంగళం. ఎటువంటి కీర్తి అంటే చకడం పొన్ఱ ఉదైత్తాయ్ - అంటే శకటాన్ని ధ్వంసం చేసినటువంటి నీయొక్క దివ్యమైన కీర్తికి మంగళము. శకటాసుర సంహారం చేసినటువంటి బాలకృష్ణ లీలని ఇందులో స్మరించారు. ఉదైత్తాయ్ - అంటే కాలితో తన్నడం. కేవలం ఒక బండిని తన కాలితో తన్ని ఆ శకటాసుర సంహారం చేశాడు స్వామి. ఆవిధమైన నీ కీర్తికి. అది గొప్ప కీర్తి. చూడడానికి పసిపిల్లవాడు. కానీ అంత ఉన్నటువంటి శకటాన్ని అవలీలగా తన పాదం చాపి దానిని తన్ని రక్షించాడు జగతిని. శిక్షించాడు శకటాసురుణ్ణి. ఈవిధంగా అనుగ్రహించిన నీ కీర్తికి నమస్కారం. నీ కీర్తికి మంగళము.

కన్ఱుకుణిలా వెఱిందాయ్ కరిల్ పోత్తి - ఇక్కడ కూడా అమ్మ పాదములకు నమస్కారం చేస్తున్నారు. మొదట చెప్పిన పాదములు ముల్లోకాలనూ కొలిచిన త్రివిక్రమ పాదములు. ఇప్పుడు చెప్తున్నటువంటి పాదములు కృష్ణ పదములు. ఈ కృష్ణ పదములు ఎటువంటివి అంటే కన్ఱుకుణిలా వెఱిందాయ్ కరిల్ పోత్తి - వత్సాసుర సంహారం చేసినటువంటి స్వామియొక్క పాదములు అన్నారు. వత్సాసురుడు - వత్స అంటే దూడ అని అర్థం. దూడ రూపంలో ఒక రాక్షసుడు ప్రవేశించాడు నందవ్రజం లోకి. ఎవరూ పోల్చుకోలేక పోయారు. దూడల్లో దూడలా, ఆవులలో ఆవులా కలిసిపోతే గోపాలకులు ఎలా పోల్చగలరు? కానీ పరమాత్మ పోల్చుకున్నాడు. పోల్చుకొని తన కాలు పట్టి గిరగిరా త్రిప్పి విసిరివేశాడు ఆ రాక్షసుణ్ణి. ఆ విసిరివేయడం ఎలా విసిరాడు అంటే ఒక వడిశల రాయిని విసిరినట్లు విసిరాడుట. అది ఇక్కడ 'కన్ఱుకుణిలా వెఱిందాయ్' అని తల్లి చెప్పడంలో భావం. వత్సాసురుణ్ణి అలా విసిరాడు. ఈ విసురుతున్నప్పుడు ఆ పాదములు ఎలా పెట్టి ఉంటాడు అంటే ముందుకు ఒక పాదం చాచి వెనక ఒక పాదం లాగి ఉంటాడు.



Copyright@gurujnanam.org 

అలా ఉన్నటువంటి కృష్ణ పరమాత్మయొక్క ఆ దివ్యమైనటువంటి చిన్ని పాదాలను ఇక్కడ తలంచుకొని అలాంటి పాదములకు మంగళము అని.

కున్టుకుడైయా వెడుత్తాయ్ కుణమ్ పోత్తి - ఇక్కడ కున్టుకుడైయా అంటే గోవర్ధన పర్వతాన్ని గొడుగుగా ఎత్తినటువంటి నీ గుణానికి మంగళము. గుణము అన్నప్పుడు శౌర్యగుణమూ కావచ్చు, కారుణ్య గుణమూ కావచ్చు. రెండు భావాలు. అందుకు గుణమునకు నమస్కారం. మొత్తం వ్రజం అంతాకూడాను ఇంద్రుడు కురిపిస్తున్నటువంటి రాళ్ళ వానతో కంపించి పోతూ ఉంటే అల్లకల్లోల పడుతూ ఉంటే పరమాత్మ దయచూపించి గోవర్ధన పర్వతాన్ని అవలీలగా అరచేత్తో ఎత్తాడు. ఎత్తి మొత్తం అందరినీ కాపాడాడు. ఈ కాపాడడంలో రెండున్నాయి. ఒకటి అందరిపై కారుణ్యము, రెండవది రక్షించగలిగే సమర్థత. ఆ రెండూ చూపించాడు. దీనికితోడు ఇంద్రుడి గర్వాన్ని అణచాలి అనేటటువంటి ఒకవిధమైన శిక్షా నైపుణ్యం. అదికూడా ఉన్నది స్వామివద్ద. దేవాధిదేవుడు. సర్వదేవతలకంటే అధికుడు అన్న తత్త్వాన్ని ప్రకటించాడు ఈ లీలలో. అందుకే గోవర్ధనోద్ధరణ లీల చాలా విశేషమైన లీల నారాయణుని లీలలలో. అందుకు ఆ లీలలను స్మరించక పోతే కృష్ణావతారం పరిపూర్ణం కాదు. గోవర్ధన గిరిధారియైనటువంటి స్వామియొక్క దివ్య తత్త్వాన్ని ఇక్కడ అమ్మ స్మరించుకొని అటువంటి నీ శౌర్య గుణానికీ, కారుణ్య గుణానికీ, సౌజన్య గుణానికీ, నీ ఆధిక్య గుణానికీ మంగళము అని కీర్తిస్తూ ఉన్నది.

వెన్టు పకై కెడుక్కుమ్ నిన్ కైయిల్ వేల్ పోత్తి - శత్రువులను జయించడంలో సమర్థత కలిగినటువంటి నీ చేతిలో ఉన్న వేలాయుధానికి మంగళము. ఇక్కడ వేలాయుధము అంటే బల్లెము అని అర్థం. స్వామి శత్రు సంహారము చేసినప్పుడు పట్టుకున్న ఆయుధము అని భావన చేయవచ్చు. అటువంటి నీ



Copyright@gurujnanam.org 

ఆయుధమునకు నమస్కారము. ఇంతవరకూ చేసినవన్నీ స్వామియొక్క వీర చరిత్రలను గానం చేయడం.

ఉమ్ శేవకమే యేత్తి - అంటే నీయొక్క వీర చరిత్రమునే మేము స్తుతిస్తూ వచ్చాము. ఈ స్తోత్రముయొక్క ప్రయోజనము ఏంటంటే

ప్పఱైకొళ్వాన్ - పరమును పొందుటకు గానూ మేము ఈనాడు వచ్చాము. నువ్వు మమ్మల్ని అనుగ్రహించాలి. ఇక్కడ ఈ 'పోత్తి పోత్తి' అనే మాట ఉన్నదే మంగళము, మంగళము అని చెప్పడం ఈ తల్లియొక్క తండ్రి ఉన్నారే ఎవరు? విష్ణుచిత్తుడు - పెరియాళ్వార్ ఆయన పల్లాండు పల్లాండు అని కీర్తిస్తారు స్వామివారిని. ఆ భావం ఇక్కడ మనకు కనిపిస్తున్నది. 'పల్లాండు పల్లాండు' అంటే స్వామియొక్క దివ్య సౌందర్యాన్ని చూసి దానికి దిష్టి తీస్తూ వాటికి మంగళం పలికినట్లుగా 'పల్లాండు పల్లాండు పల్లాయిరత్తాండు పలకోడి నూరాయిరమ్' అని విష్ణుచిత్తుడు పలికినట్లుగా ఇక్కడ పోత్తి పోత్తి అని ఆ స్వామియొక్క ముద్దుల బిడ్డయైనటువంటి తల్లి గోదాదేవి కీర్తించింది.

అటువంటి ఆ తల్లికి నమస్కరిస్తూ

ఆండాళ్ తిరువడిగలై శరణం!!

DAY 25:

ఒరుత్తి మగనాయ్ – ఒకామెకి కుమారుడై పుట్టి

ఓరిరవిల్ – ఆ ఒక్క రాత్రి నాడే

ఒరుత్తి మగనాయ్ యొళిత్తు వళర – మరొక ఆమెకి పుత్రుడిగా దాక్కొని;

ఇందులో విశేషం ఏమిటంటే ఒకామెకి నువ్వు పుత్రుడిగా పుట్టావు. అదేరాత్రి మరొక ఆమెకి పుత్రుడిగా దాక్కున్నావు. ఇందులో చెప్పిన విశేషం దేవకీ దేవికి పుత్రుడిగా ఉద్భవించాడు స్వామి. అదే రాత్రిలో నందుని ఇంటికి చేరి



Copyright@gurujnanam.org 

యశోదమ్మకు పుత్రుడిగా అక్కడ దాక్కున్నాడు. అంటే తనని తాను కంసునికి తెలియనీయకుండా అక్కడ పెరిగాడు. అదే ఇక్కడ యొళిత్తు వళర అంటే ఒదిగి దాగి అని అర్థం. ఆవిధంగా అక్కడ ఉండి పెరిగాడు. అలా పెరిగినటువంటి స్వామిని ఎలాగైనా దెబ్బతీయాలని ప్రయత్నించాడు, కీడు చేయాలని తలంచుకున్నాడు కంసుడు. కానీ అతని అంచనాలను తలక్రిందులు చేశాడట పరమాత్మ. కంసుడు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ కూడా ఆ ప్రయత్నాలను వ్యర్థం చేశాడు స్వామి.

తరిక్కిలానాకి త్తాన్ తీంగు నినైంద కరుత్తై పిరపిత్తు – వాడియొక్క కుత్సితమైన వ్యూహాన్ని తలక్రిందులు చేశాడు. ఎవరయ్యా అంటే

కంజన్ – కంసుడియొక్క వ్యూహాన్ని తలక్రిందులు చేసినటువంటి స్వామీ! పైగా ఎలా తయారయాడు అంటే కృష్ణ పరమాత్మ

కంజన్ వైత్తిల్ నెరుప్పెన్న నిన్న – ఆ కంసుడి కడుపులో నిప్పులా ఉన్నాడుట. అంటే కడుపుమంట గా ఉన్నాడు. తల్లి ఇక్కడ

నెడుమాలే – అన్నది. అంటే ఆశ్రయించిన వారిని రక్షించే వాత్సల్యం కలవాడా! ఆశ్రితుల పట్ల వ్యామోహం. ఆయనకి ఏ మొహమూ లేదు పరమాత్మకి. కానీ ఆశ్రయించిన భక్తుల పట్ల మాత్రం దయ ఉంటుంది.

ఉన్నైఅరుత్తిత్తు వందోం – ఆశ్రిత వత్సలుడు గనుక నిన్ను ఆశ్రయించి అర్థులమై వచ్చాము.

తిరుత్తక్క శెల్వముమ్ శేవకముమ్ – తిరుత్తక్క అంటే లక్ష్మీదేవికి తగిన అని అర్థం. లక్ష్మీ దేవి అంటే సమస్త సంపదలకీ అధిదేవత. ఆ తల్లికి తగిన ఐశ్వర్యం ఈయన వద్ద ఉందిట. అందుకే శెల్వము, శేవకముం – అనగా ఐశ్వర్యము, వీరత్వము రెండూ ఉన్నాయి.

యాంపాడి – మేము కీర్తన చేసి



Copyright@gurujnanam.org 

వరుత్తముమ్ తీరుంద్ ముగిరుంద్- మాయొక్క పాపాలు తీరేలా నీకీర్తన చేస్తాం. ఆనందాన్ని అనుభవిస్తాం. ఇందులో చెప్పడంలో భగవంతుణ్ణి కీర్తించడం వల్ల రెండు ప్రయోజనాలున్నాయి. 1. తాపాలు పోతూన్నాయి. 2. ఆనందం లభిస్తూన్నది. తాపం పోతే కానీ శాంతం రాదు.

పఱై తరుతియాగిల్ – ఇక్కడ పరవాద్యము కైసేయుము. మొత్తం ఈ పాశురాలలో పరవాద్యము ఇమ్మని ఒక మాట కనపడుతూ ఉన్నది. ఇక్కడ గోపికా భావంతో ఆశ్రయించి తల్లి చెప్తూన్నది. ఈ గోపికలకు, ఆ గోపకులకు కూడా ఒక తప్పెట అనే వాద్యం ఒకటి ఉంటుంది. ఈ తప్పెట వాద్యం వాళ్ళకి చాలా ముఖ్యం. ఆ తప్పెట వాద్యం ఇవ్వమని పరమాత్మను అడుగుతున్నారు. ఏమిటి దీనిలో ఉన్న విశేషం అని మనం పరిశీలించినట్లయితే ఇక్కడ పరమును ఇవ్వు, పరవాద్యమును ఇవ్వు అన్నప్పుడు ఇక్కడ పరము అంటే పరమార్థము, మోక్షము. ఆ మోక్షాన్ని ఇమ్మని అడగడమే కనపడుతున్నది. ఈ కీర్తనలో స్వామియొక్క అవతార వైభవాన్నంతటినీ వర్ణించారు. పైగా ఒక అమ్మకి కుమారుడవై ఉదయించావు. మరో అమ్మ ఒడిలో చేరి ప్రకాశించావు అనే భావం ఉన్నది. ఇందులో మనం గమనించినట్లయితే దేవకీదేవికి పుత్రుడిగా పుట్టాడు, యశోదమ్మ ఇంత పెరిగాడు. కొన్ని పురాణాల ప్రకారంగా చూసినట్లయితే నారాయణుడు దేవకీదేవికి పుత్రుడిగా రావడమే కాకుండా మరొక స్వరూపంగా సూక్ష్మ రూపంతో యశోదానందులకు కూడా పుత్రుడయ్యాడు. ఇక్కడున్నటువంటి వసుదేవ పుత్రుడైన పరమాత్మ ఆ నందవ్రజానికి చేరుకొని అక్కడున్న తన స్వరూపంతో తాను ఏకమై ఉన్నాడు. ఈభావం మనకు బ్రహ్మవైవర్త పురాణంలో కనపడుతున్నది. అందుకే ఇక్కడ ఇద్దరు తల్లుల్నీ స్మరించడం, యశోదానందనుడు అనడం కూడా చక్కటి విశేషమిది. కేవలం కృష్ణుడు యశోదమ్మకు పెంపుడు కొడుకు అనే భావం ఆ పురాణకర్తకి తృప్తి కలిగించలేదు. యశోదమ్మకు కూడా ఇతను తనయుడే


Copyright@gurujnanam.org 

అనేటటువంటి భావం ఉన్నది. అది కూడా మనం గమనించవలసిందే. అక్కడ సూక్ష్మ రూపంలో ఉన్న తేజస్సు, ఇక్కడ ఉన్న ఈ నారాయణ తేజస్సు రెండూ ఒకటే. అదే అక్కడ కృష్ణ రూపంలో ప్రకాశించింది. అందుకే ఇక్కడ 'దాగి' అన్న మాటను ఈ తల్లి ప్రయోగించింది. 'యొళిత్తు వళర' – దాగి, అంటే గుప్తముగా; అక్కడ గుప్తముగా యశోదానందనుడిగా ఆవిర్భవించాడు. ఇక్కడ ప్రకటంగా వాసుదేవ పుత్రుడిగా చతుర్భుజాలతో, శంఖచక్రగదాపద్మాలతో ఆవిర్భవించాడు. ఈ స్వరూపం క్రమంగా వసుదేవుని ద్వారా ఆ యశోదవద్దకు చేర్చబడి అక్కడ గుప్తమైనటువంటి నారాయణ తేజస్సు, కృష్ణ తేజస్సు ఏకమై అక్కడ కృష్ణ మూర్తిగా వ్యక్తమయింది. అది ఇక్కడ గుప్తముగా దాగడం అనే భావంలో చూపిస్తున్నది. ఈ భావాన్ని వ్యక్తం చేస్తూ లక్ష్మణ యతీంద్రుల వారు అనువదించుతూ "ఒక అమ్మ దేవకికి ఉదయించినావు, ఒండు తల్లి యశోద ఒడి చేరినావు, గోప్యముగా నీవు గోకులమందు' అనే భావాన్నిక్కడ ప్రకటించారు. 'నీదు శౌర్యాతిశయము పాడుచూ నీ ఎడబాటుచేసైన తాపంబు నశియింప ధన్యత చెంది ఆనందమున ఓలలాడుదుమయ్యా, మా విన్నపముల మన్నింపుమయ్యా, మననోము జగతికి మంగళ ప్రదము'.

ఆండాళ్ తిరువడిగలై శరణం!!

DAY 26:

మాలే మణివణ్ణా మార్-గరి నీరాడువాన్

మేలైయార్ శేయ్-వనగళ్ వేండువన కేట్టియేల్

ఞాలత్తై యెల్లాం నడుంగ మురల్వన

పాలన్న వణ్ణత్తు ఉన్-పాంచజన్నియమే



Copyright@gurujnanam.org 

పోల్వన శంగంగళ్ పోయ్ ప్పాడుడైయనవే

శాలప్పెరుం పఱైయే పల్లాండిశైప్పారే

కోలవిళక్కే కొడియే వితానమే

ఆలిన్-ఇలైయాయ్ యరుళ్-ఏలోర్ ఎంబావాయ్

మాలే అనేటటువంటి మాటకి ఆశ్రితులపట్ల దయకలవాడా! అని అర్థం. తనని ఎవరైతే ఆశ్రయించారో వారిపట్ల ప్రేమ కలవాడు. పరమాత్మ ప్రేమ స్వరూపుడు. ఆశ్రయించిన వారికి ఆ ప్రేమయొక్క రుచి తెలుస్తుంది. దయ నీయొక్క స్వభావం స్వామీ.

మణివణ్ణా - తర్వాత సంబోధన ఇది. మణివర్ణా అని సంస్కృతంలో అనుకోవచ్చు. స్వామియొక్క స్వభావం ఎటువంటిది అంటే ఆశ్రిత దయ ఉన్నది ఆయన వద్ద. ఇంకొకటి ప్రకాశం. అది మణి వర్ణము. ఎటువంటి మణి అంటే ఇంద్రనీల మణి. ఇంద్రనీలమణి వలె ప్రకాశిస్తున్నాడు. ఈ మణివర్ణ అనే మాట గతంలో కూడా మనం చెప్పుకున్నాం. మణికి ఉన్నటువంటిది స్వయం ప్రకాశ లక్షణం. తనంత తాను ప్రకాశిస్తుంది. అదేవిధంగా సమస్త జగతినీ ప్రకాశింప జేస్తూ తనకు తానే ప్రకాశమైనటువంటి స్వయం ప్రకాశ స్వరూపుడే పరమాత్మ. అందుకే స్వయంప్రకాశకుడా అనే భావం కూడా ఇందులో ఉన్నది. ఇంద్రనీల మణివలె వెలిగిపోతున్నటువంటి వాడా! అనే అర్థం కూడా ఉన్నది. ఈవిధంగా స్వామి సౌందర్యము, సౌజన్యము, రెండూ చెప్పారు. మాలే అనేదానిలో సౌజన్యము, మణివణ్ణా అనేదానిలో సౌందర్యము రెండూ చెప్పబడుతున్నాయి. సౌజన్య సౌందర్యాల సమైక్య స్వరూపమే కృష్ణ రూపము. మార్గళి నీరాడువాన్ - మేము మార్గళి స్నానం చేయడానికి సిద్ధపడ్డాం. ఇప్పుడు ఈ వ్రతము ఏదో మాతో మొదలైంది కాదు.


Copyright@gurujnanam.org 

మేలైయార్ శేయ్-వనగళ్ - మాకు పూర్వీకులు చేసినటువంటి పద్ధతిలోనే మేము ఈ వ్రతాన్ని అవలంబించాం.

వేండువన కేట్టియేల్ - మాకు కావలసినవి చెప్తూ ఉన్నాం, వింటావా? అని అంటూన్నారు ఇక్కడ. ఏమిటి కావాలో అడుగుతున్నారిక్కడ. ఏమిటి కావాలి? భౌతికమైన సంపదలా వీళ్ళు అడుగుతున్నది? అడుగుతున్నవి చాలా అద్భుతమైనవి. అవి ఏమిటంటే మాకు శంఖాలు కావాలి, పరవాద్యములు కావాలి, నీపై మంగళ గీతములు పాడేటటువంటి భాగవతుల సాంగత్యం కావాలి. అద్భుతమైనటువంటి జెండాలు కావాలి. వితానము కావాలి. ఇవన్నీ కూడాను ఏమిటి అంటే పరమాత్మను కీర్తించే సాధనలు. మార్గళి వ్రత సాధనలు. అయితే శంఖాలు కావాలి. ఎలాంటి శంఖం కావాలి అంటే

నడుంగ ముఱల్వన పాలన్న వణ్ణత్తు ఉన్-పాంచజన్నియమే పోల్వన శంగంగళ్ పోయ్ ప్పాడుడైయనవే శాలప్పెరుం పఱైయే - నడుంగ ముఱల్వన - అంటే ఆ శంఖనాదం చేస్తే మొత్తం ఈ ప్రపంచం అంతా వణికి పోయేటట్లుగా, భూమి అంతా దద్దరిల్లేటట్లు నాదం చేయగలిగే శంఖాలు కావాలి. ఆ శంఖం ఎలా ఉండాలి అంటే ఉన్-పాంచజన్నియమే - నీ పాంచజన్య శంఖం లాగా ఉండాలి. పైగా అది పాలన్న వణ్ణత్తు - పాలువంటి వన్నె కలిగి ఉండాలి. అంటే పాలు ఎంత తెల్లగా ఉంటాయో అంత తెల్లగా ఉండాలి. అది నాదం చేస్తూ ఉంటే భూమి అంతా కంపించి పోవాలి. అలాంటి నాదం పుట్టే శంఖం కావాలి. అది నీ పాంచజన్యంలా ఉండాలి. మూడు చెప్పారు ఇక్కడ. శంఖము ఓంకార స్వరూపము. అందుకు ఇక్కడ మొట్టమొదట శంఖాన్ని కోరుకోవడం ఏంటి అంటే నాదాలలో ప్రధానమైన ప్రణవ నాదాన్ని కోరుకుంటున్నారు. అది ఓంకారనాదానుసంధానం కావాలి. పైగా పోయ్ ప్పాడుడైయనవే శాలప్పెరుం పఱైయే - ఈమాటలో ఉన్న ప్రత్యేకత ఏమిటి అంటే చాలా వైశాల్యము కలిగినటువంటి పెద్దదైన పరవాద్యము. తప్పెట - పెద్ద తప్పెట -


Copyright@gurujnanam.org 

దానిని మోగించుతారు. ఈ తప్పెట కూడా హృదయానికి సంబంధించినది. అది మన హృదయంలో ఉన్నటువంటి నాద స్వరూపాన్ని అనుసంధానం చేయడం. పైగా

పల్లాండిశైప్పారే - నీకు మంగళాశాసనం పలికేటటు వంటి గాయకుళ సాంగత్యం కావాలి. భాగవతులతో కలిసి గానం చేయాలి. నీకు మంగళాశాసనం పలికే భాగవతులు. భాగవతుల సాంగత్యం కావాలి.

కోలవిళక్కే - ఆ గానం చేసేటప్పుడు దీపం వెలిగించి గానం చేయడం. ఇది కూడా సంకీర్తన పద్ధతి. చక్కగా భగవంతుడి దగ్గర దీపం వెలిగించి గానం చేయడం. ఈ దీపం ఏమిటంటే జ్ఞాన దీపం. ఆ జ్ఞానదీపంతో భగవంతుణ్ణి గానం చేయాలి. పైగా ధ్వజము కావాలి, వితానము కావాలి. వితానము అనేటటువంటి మాటకి మేలు కట్టు అనేది చక్కటి తెలుగు మాట. మేలు కట్టు -దీనిని హిందీలో చాందినీ అంటారు. వితానం అనేది సంస్కృత పదం. అందుకే ఇక్కడ

కొడియే వితానమే - ధ్వజము, వితానము - జెండాలు. సాధారణంగా మనం ఉత్సవాలు అవీ చేసేటప్పుడు కూడా జెండాలు పెడతాం. జెండాలు దేనికి సంకేతం అంటే అక్కడ ఉన్నటువంటిది ఏదో తెలియజేస్తుంది ఆ జెండా. జెండా బట్టి అక్కడ ఉన్నది తెలియజేస్తుంది. సూచిస్తుంది. అందుకే భగవత్తత్త్వాన్ని సూచించేటటువంటి జ్ఞానమే ధ్వజము. ఇక వితానము అంటే పైకప్పు. అనగా అంతర్ముఖ స్థితిలో మనం ఉంటూ ప్రపంచానికి తెలియకుండా బహిర్ముఖత్వం లేకుండా అంతర్ముఖం అవడమే ఇక్కడ మేలుకట్టు ఉండడం. పైగా

ఆలిన్-ఇలైయాయ్ - ఇది ఒక సంబోధన. ఓ వటపత్ర శాయీ! అని సంబోధించడం. ప్రళయ కాలంలో కూడా నశించకుండా ఆ ఏకార్ణవమైనటువంటి జల మధ్యంలో కేవలం ఒక వటపత్రంపై ఉండే బాలకృష్ణా! మాకు ఇవన్నీ


Copyright@gurujnanam.org 

అనుగ్రహించి నిన్ను సంకీర్తన చేసే భాగ్యాన్నియ్యవయ్యా! కృప చూపించు. "అవధరింతువా అనుగ్రహింతువా ఆశ్రిత జన వత్సలా నీవనుగ్రహింతువా" అని కృష్ణ శాస్త్రి గారు చక్కటి అనువాదం చేశారు. అటువంటి సంకీర్తన సౌభాగ్యాన్ని ఆశించినటువంటి అమ్మకి నమస్కరిస్తూ

ఆండాళ్ తిరువడిగలై శరణం!!

DAY 27:

ఇంచుమించు పాశురముల చివరి భాగాలలో మనం ఉన్నాం. గోవింద నామతో ఉండడం ప్రత్యేకించి గమనించవలసిన అంశం. కృష్ణావతారంలో గోవింద నామానికి అత్యంత ప్రాధాన్యం ఉన్నది. మొత్తంగా ఆయన నందవ్రజంలో, బృందావనంలో చేసిన లీలలన్నింటికీ అధిపతిగా పేర్కొని మనం ఆశ్రయించితే గోవింద అనేది సరియైన శబ్దం. గోకుల పాలకుడు, గోపీజన వల్లభుడు, గోపజన రక్షకుడు, గోవిందుడు. ఈ గోవింద నామం మహామంత్రమిది. గోవింద అనే నామం ఒక్కటి చాలు మనల్ని పవిత్రం చేస్తుంది. మన ప్రాణాలు, మన ఇంద్రియాలు పని చేస్తున్నాయంటే ఏ చైతన్యం వల్ల పనిచేస్తున్నాయో ఆ పరమాత్మ గోవిందుడు. అలాగే వేద వాక్యములంతటా వ్యాపించి ఆ వేద వాక్యములచేత తెలియబడేవాడు గోవిందుడు. కాంతి కిరణ రూపముతో ప్రపంచమంతా వ్యాపించే తేజఃస్వరూపుడు గోవిందుడు. ఈ గోపకులకు, గోపికలకు, గోవులకు పతియైన వాడు గోవిందుడు. అందుకు ఎవరికీ గోపీజన భావం ఉంటుందో వారికి గోవిందుడి రక్ష లభిస్తుంది. అమ్మ గోదాదేవి గోపీ తత్త్వాన్ని తన హృదయంలో నింపుకొని తాను గోపికగా మారింది. ఎవరు గోపిక అవుతారో వారికి గోవిందుడు పతియై రక్షిస్తాడు. అందుకే మనందరం గోపికలం కావాలి. గోపికలు అన్నప్పుడు సమస్త ఇంద్రియములతో భక్తిరసాన్ని పానం చేసేవాళ్ళే గోపికలు అని మనం గతంలో చెప్పుకున్నాం. "గోభిః


Copyright@gurujnanam.org

ఇన్ద్రియైః భక్తిరసం పిబతీతి గోపీ" - సమస్త ఇంద్రియములతో కృష్ణ భక్తి రసాన్ని పానం చేసే ప్రతిజీవుడూ గోపిక. అంతేకానీ గోపిక అంటే స్త్రీ అనే భావం కాదు. భక్తిభావమే గోపిక. భక్తి భావం కలిగిన జీవుడే గోపిక. అలాంటి గోపికల వల్లభుడే గోవిందుడు. సృష్టిలో అన్నింటికంటే గొప్ప కీర్తి ఏమిటి అంటే భగవంతుని వాడను అని చెప్పుకోవడమే గొప్ప కీర్తి. అందుకే హనుమంతుడు ఎంత ప్రతాపవంతుడు, ఎంత ఘనుడు అయినప్పటికీ ఆయన గర్వంగా చెప్పుకున్న మాట ఒక్కటే - "దాసోహం కోసలేన్ద్రస్య" - రామచంద్రమూర్తి దాసుడిని అన్నాడు. "రాముని వారము మాకేమి విచారము" అన్నాడు రామదాసు. భక్తి రుచి తెలిసినటువంటివారు గోపికలు ఎంత ధన్యులో! యశోదమ్మ ఎంత ధన్యురాలో! నందుడు ఎంత ధన్యుడో! అర్జునుడు ఎంతధన్యుడో పరమాత్మను చూడగలిగాడు. పరమాత్ముని మాటలు వినగాలిగాడు. అని ఆర్జునుడిని పొగుడుతాం, గోపికలను పొగుడుతాం. ఎందువల్ల? పరమాత్మ కృపకి నోచుకున్నారు. కనుక అర్జునుడికీ, గోపికలకీ నిజమైన సన్మానం ఏమిటి? - పరమాత్మ చేత మీరు అనుగ్రహింప బడ్డారు. ఆయన యొక్క కృపకు నోచుకున్నారు అనడమే పెద్ద సన్మానం. అలాంటి సన్మానం మాకు కావాలి. రకరకాలైనటువంటి ఆభరణాలు మాకు కావాలి. మేము ధరించాలి. ఏమిటి ఇందులో ఉన్నటువంటి అంతరార్థం? చేతికి అలంకారం కావాలి. చేతికి అలంకారం ఏమిటి అంటే చేతులారంగ పూజించడమే చేతికి అలంకారం. ఈ భుజకీర్తులు నీ చిహ్నములు ధరించడమే భుజాలకి అలంకారం. ఇక చెవులకి అలంకారం నీ కథలు వినడమే చెవులకి అలంకారం. నీ చుట్టూ తిరగడమే పాదాలకి అలంకారం. నిన్ను పాడడమే కంఠానికి అలంకారం. ఇలాంటి మా ఇంద్రియములన్నీ నీ సేవలో వినియోగింపబడాలి. నువ్వు అనుగ్రహించాలి. ఈ అలంకారములన్నీ ధరించి నీతోపాటు మేము తిరుగుతూ ఉండాలి. మాకు చక్కని వస్త్రము కావాలి. అందమైన బట్టలు కావాలి. నిజానికి స్త్రీలు కోరుకునే


Copyright@gurujnanam.org 

కోరికల లాగా కనపడతాయి. కానీ ఇవన్నీ కూడా భాగవతోత్తముల కోరిక. నీతో కలిసి మేము మధుర పదార్థాలు తినాలి. వ్రత నియమ పాలన చేస్తున్నప్పుడు పాలు ముట్టుకోం, నెయ్యి ముట్టుకోం కానీ వ్రతం పూర్తి అయిన తర్వాత పాలతో కలిపిన పాయసం వండి దానిలో చక్కగా నెయ్యి నింపుకొని తినాలి. ఆ తినడం ఎలా తినాలి అంటే ఆ తినేటప్పుడు ఆ నెయ్యి మోచేతి నుంచి జాలువారేలా తినాలి. అదీ నీతో కలిసి. చక్కటి మాట కూడి ఇరుందు కుళిరుంద్ - నీతో కలిసి మీము ఆరగించి సుఖపడాలి. అంటే పరమాత్మతో కలిసి తినాలి. గోపకులు కృష్ణునితో కలిసి చల్దులు తిన్నారు. ఎంత ఆనందంగా తిన్నారో! ఆయనతో కలిసి తినడం అన్నప్పుడు భగవదనుభవంతో కూడి ఉన్నారు. పాలు అనగానే శుద్ధమైనటువంటి భగవత్ గుణ సముద్రం. అది అనంతము, మధురమైనటువంటిది. దానిలో నెయ్యి కూడా కలిసిందిట. నెయ్యి అంటే ప్రీతిభావం, ప్రేమభావం అని అర్థం. నెయ్యము, స్నేహము అంటాం. కనుక ప్రీతి భావంతో కూడి నీ గుణగణములను మేము ఆస్వాదించాలి. అదీ నీతో కలిసి. అంటే నిరంతరం భగవత్ సాన్నిధ్య భావనతో ఆయన దివ్య గుణములని ప్రీతిగా ఆస్వాదన చేయాలి. ఆస్వాదన చేసేటప్పుడు ఆ గుణములను చెవితో ఆస్వాదిస్తే చెవికి ఆభరణం, చేతితో అర్చన చేస్తూ ఆస్వాదిస్తే చేతికి ఆభరణం. ఇలా ఇవే మాకు అలంకారములై కావాలయ్యా! ఇవి అనుగ్రహించు. అని ఈ కీర్తనలో వేడుకుంటున్నారు. "వేడవచ్చునా మరికొన్ని మా వేడుకకై కొన్ని కూడని వారిని ఓడించే శుభగుణములు గల గోవిందా" అని దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారు ఈ పాశురాన్ని చక్కని గీతంగా అనువాదం చేశారు. "చూడిగములు జుమికీలు చవాకులు పాడగములు కేయూరములు తొడవులన్ని కయిసేయగవలదో తొడగవలదో పలువన్నెల వలువలు! ఆడవారి కోరికలనుకోకు



Copyright@gurujnanam.org 

కూడదనకు గోవిందా! నీరాడి వచ్చి వ్రతమూనిన ముదమున అడిగెదమంతే స్వామీ! వేడవచ్చునా మరికొన్ని
అందమైన గీతంలో అనువదించారు.
అందుకు "నీతోడ కూడి పెన్నేతిలో మున్గి పాయసమ్మును నేయి వరదలు కట్టి మోచేతులకు కార భుజియింప వలయు మాకదే గొప్ప సమ్మానమ్ము స్వామీ! మాకదే మేల్ బహుమానమ్ము స్వామీ! మననోము జగతికి మంగళ ప్రదము" అని లక్ష్మణ యతీంద్రుల వారు అనువదించారు. ఆ గోదాదేవిని శరణు వేడుతూ ఆండాళ్ తిరువడిగలై శరణం!!

DAY 28:
అమ్మ గోదాదేవి అనుగ్రహించిన శ్రీవ్రత పాశురములలో 28వ పాశురాన్ని ఈరోజు చెప్పుకుంటున్నాం. ఈ దివ్యమైన పాశురములలో గోపికా తత్త్వంతో పూర్తి తన్మయం చెందిపోయి అమ్మ కృష్ణ పరమాత్మని ప్రార్థిస్తున్నటువంటి దివ్యమైనటువంటి కీర్తన ఇది. ఇందులో గోపికా తత్త్వం చెప్పబడుతున్నది. ముఖ్యంగా భగవంతుణ్ణి ఆశ్రయించినప్పుడు ఉండవలసినది నిష్కపటత్వము, నిరహంకారము. ఈ రెండూ చాలా ప్రధానం. ఆ రెండిటితో మనయొక్క తెలియనితనాన్ని తెలుసుకుంటే చాలు. అన్నీ తెలుసు అని సాధన చేస్తే ఏమీ లాభం లేదు. మాకేమీ తెలియదు స్వామీ నీ కృపయే దిక్కు అనేటటువంటి శరణాగతి కావాలి. పరతంత్రత - పరమాత్మయందు మనం ఆశ్రయించాలి. పరాధీనులం కావాలి. పరమాత్మకి పరాధీనులం కావాలి. ఆయనకు మనం స్వాధీనం అయిపోవాలి. ఆ తత్త్వం ఇందులో కనపడుతున్నది.


Copyright@gurujnanam.org

స్వామీ! మేము కేవలం ఏమీ తెలియనటువంటి అజ్ఞానులం. ఏదో పొట్ట పోసుకోవడానికి ఆవులవెంటే వెళ్ళిపోతున్నటువంటి వాళ్ళం. కఱవైగళ్ పిన్ శెన్రు - అంటే పశువుల వెంట వెళుతూ
కానమ్ శేర్-నుంద్-ణ్బోమ్ - అడవులకు చేరుకొని అక్కడ; శేర్-నుంద్-ణ్బోమ్ - అలా చేరుతూ పొట్ట పోషించుకుంటున్నటువంటి వాళ్ళం. పైగా అఱివొన్రు మిల్లాద - ఏమీ లోకజ్ఞానం లేనటువంటి వాళ్ళమయ్యా! అయితే మాకున్న పుణ్యమంతా ఒక్కటే. ఏమీ తెలియని అజ్ఞానమైనటువంటి మా గోపవంశంలో నువ్వు పుట్టావు. ఆ పుణ్యం మాకుంది. అమాయకులమైన మమ్మల్ని ఉద్ధరించడం కోసం మాతో సమానముగా ఉన్నట్లుగా గోకులంలో ఉద్భవించావు నువ్వు. నీతో మాకున్నటువంటి సంబంధం పోగొట్టుకోవాలన్నా పోగొట్టేది కాదు. ఇది ఇంక వీడని సంబంధం. కృష్ణుడెవడు అంటే మావాడు. ఈ మావాడు అనేటటువంటి సంబంధం ఉన్నదే ఇది తెగనిది. అలాగే మేము నీవారము. మేము భగవంతుని వారం. భగవంతుడు మనవాడు. ఈభావం చాలా గొప్పది. గోపికల ప్రేమ నిష్కపటమైన ప్రేమ, నిస్వార్థమైన ప్రేమ. పరమాత్మ తప్ప ఏమీ కోరని ప్రేమ. మేము అర్హులము కనుక అనుగ్రహించు అనని ప్రేమ. అలాంటి నిష్కపటమైన ప్రేమ గనుకనే స్వామీ వివేకానంద గోపికాభక్తిని కీర్తిస్తూ ఎంతో ఘనంగా పాశ్చాత్యుల చెవులలో మారుమ్రోగేలాగా పాంచజన్య శంఖారావం చేశాడు. గోపికలు పవిత్రమైనటువంటి వ్యక్తులు. గోపికా కృష్ణ ప్రేమ అత్యంత పవిత్రమైనది. అది అర్థం కావాలంటే first make yourselves pure అని చెప్పాడు ఆ మహానుభావుడు. అందుకే పవిత్రమైన హృదయాలకు మాత్రమే అర్థం అవుతుంది ఆ గోపీతత్త్వం. ఆయన మొత్తం హిందూ ధర్మానికి, భారతీయ ధర్మానికీ, దేశభక్తికీ, దైవభక్తికీ సాకారమై ఉద్భవించినటువంటి మహాపురుషుడు. ఆయన అవతరించిన రోజు ఇది. పైగా ఇది నూట యాభైవ జన్మదినం. ఈ సంవత్సరమంతా కూడా వివేకానంద జయంతి


Copyright@gurujnanam.org

సంవత్సరంగా ప్రకటించుకుంటున్నాం. భారతీయులందరూ కూడా ఆచార్యుని తలంచుకోవాలి. లేకపోతే కృతఘ్నతా దోషం వస్తుంది. ప్రతివాడూ కూడా వివేకానంద సాహిత్యాన్ని చదవాలి కంకణం కట్టుకొని ఈరోజు నుంచి ఆ దీక్షతో వివేకానంద సాహిత్యాన్ని చదువుకొని దానిలో ఉన్న తత్త్వాన్ని ఆకళింపు చేసుకుంటేనే భారతదేశం పూర్వ వైభవాన్ని పొందగలదు. ప్రపంచానికి మార్గదర్శకం కాగలదు. అటువంటి వివేకానందుని స్మరిస్తూ ఈవిషయంలోకి మళ్ళీ ప్రవేశిద్దాం. గోవుల వెంబడి తిరిగి వెళుతున్నటువంటి అమాయకులం స్వామీ! పైగా మా పుణ్యం చేత నువ్వు ఇక్కడ అవతరించావు. అతీతమైన వాడిని మేము చిన్న చిన్న నామాలతో, చిన్న చిన్న వాక్యాలతో కీర్తిస్తున్నామే! ఇది పొరపాటే. దీనిని క్షమించవయ్యా! అందని వాడిని అందుకోవడానికి మేము చెప్పే వాక్యాలు సరిపోతాయా? పరమాత్మ వాక్కులకు అందడు. చిన్న చిన్న పేర్లని పిలిచినందుకు కోపించకు, కృప చూపడం మానకయ్యా! మాకు ఆ పరమును ప్రసాదించు అని అడుగుతున్నారు. ఇక్కడ అన్నమాచార్య తన చివరి కీర్తనగా చెప్పబడుతున్నటువంటి దానిలో చెప్పినటువంటి భావం గుర్తుకు వస్తున్నది. "నా నాలుకపై నుండి నానా సంకీర్తనలు పూని నాచే పొగడించితివి వేనామాల వెన్నుడా వినుతించ నెంత వాడా, కానిమ్మని నాకీ పుణ్యము కట్టితివింతేనయ్యా, దాచుకో నీపాదాలకు తగనే చేసిన పూజలివే" అని చెప్పినట్లుగా స్వామీ ఈ చిన్న చిన్న పేర్లని ఇలా పిలిచినందుకు మమ్మల్ని మన్నించు. ఏమీ తెలియనటువంటి, లోక మర్యాదలు తెలియనటువంటి పిల్లలం మేము. పేరు పెట్టి నిన్ను పిలుస్తూన్నాం. కోపం తెచ్చుకోకయ్యా! అనుగ్రహించవయ్యా! "ఆలమందల వెన్క అడవులకేగి పరచుచూ కాచుచూ బ్రతికెదము మేము, ఏ తెలివియును లేని జాతి మాదయ్యా, వెంగలి విత్తులో వెర్రి గొల్లలము, అట్టి మాకులమున అవతరించితివి, ఆ పుణ్యమే చాలు అదే పదివేలు, కొదవయింతయు లేని గోవింద దేవా!" - గొప్ప



Copyright@gurujnanam.org 

మాట అన్నారు కొదవ లేని గోవిందుడా! ఈమాట చాలా విశేషం. ఏ లోపమూ లేని గోవిందుడా! ఏలోపమూ లేని అంటే పరిపూర్ణుడా! అని అర్థం. కృష్ణ పరమాత్మ యొక్క దివ్య చరిత్రలు లోపమనేది లేదు. కొందరికి కనపడింది అంటే వాళ్ళది శిశుపాల దృష్టి. వాళ్లకి లోపాలు కనపడతాయి అజ్ఞానం చేత. వాడి పేరు శిశిపాలుడు - శిశువు అంటేనే ఎదగని వాడు అని అర్థం. ఎదగనితనం అంటే అజ్ఞానం. అజ్ఞానానికి ప్రభువు వాడు. అందుకే శిశుపాలుడు అంటే. "నీతోడ మాకునూ, మాతోడ నీకు స్నేహ సంబంధంబు చెండాడ రాదు. వలదన్న నోటాడు బంధమ్ము కాదు" - నీతో మాకు ఉన్న బంధం వద్దంటే తెగేది కాదు. ఇది చాలా చక్కని మాట.

భగవంతునికీ మనకీ ఉన్న అనుబంధం ఉన్నదే అది తెగేది కాదు. అదే శాశ్వతం, అదే నిత్యం. మిగిలిన బంధాలన్నీ కూడా భ్రాంతులు మాత్రమే. ఇది నాది అని లోకంలో దేనితో పెట్టుకున్నా అది భ్రాంతే. పరమాత్మతో అనుబంధమే సత్యం. దానిని గుర్తించడమే భక్తి. గుర్తించి బ్రతకడమే గొప్ప జీవితం. ఆ గొప్ప జీవితమే గొప్ప సాధన. అదే తల్లి ఇందులో చూపిస్తూ ఉన్నది. భగవంతునితో ఉన్నటువంటి శాశ్వత సంబంధాన్ని గుర్తించాలి. అందుకే "మా అమృతాత్" అని చెప్తున్నది వేదమంత్రం. అమృత బంధం తెగరాదు. అమృతబంధం అంటే భగవంతుడితో ఉన్న బంధం అమృతబంధం. లోకంతో ఉన్న బంధం మృతబంధం. కనుక ఈ మృత బంధం తెగాలి. అమృత బంధం తెగరాదు. తెగదు. కొలతకందని స్వామిని చేతనైనట్లు ఆరాధించడమే కోలుచుకోవడం. ఇది చక్కటి మాట. అయితే మనం ఎంత కొలిచామో అంతే అనుకోరాదు. మనం ఎంత చేయగలిగామో అంత చేశామే తప్ప ఎంత చేయాలో అంత చేయలేదు. పరమాత్మ యొక్క వైభవాన్ని తత్త్వాన్ని తెలిసి పలుకగలమా! ఏదో తెలిసినంత పలుకుతూన్నాం. ఆ భావం భక్తిలో చాలా ప్రధానం. అంతేగానీ నేను కీర్తించాను, నేను చేశాను అని అహం పనికిరాదు.


Copyright@gurujnanam.org

అటువంటి నిష్కపటమైన నిరహంకారమైనటువంటి సాధనని తల్లి ఇందులో బోధిస్తూ ఉన్నది. "వ్రతము ఫలింపంగ వాద్యమీవయ్యా, మా విన్నపములా మన్నింపుమయ్యా, మననోము జగతికి మంగళప్రదము."
ఆండాళ్ తిరువడిగలై శరణం!!

DAY 29:

శిత్తమ్ శిఱుకాలే వంద్ ఉన్నై చ్చేవిత్తు ఉన్
పొత్తామరై యడియే పోట్రుం పొరుళ్ కేళాయ్
పెత్తం మేయ్ త్తుణ్ణుం కులత్తిల్ పిఱందు, నీ
కుత్తేవల్ ఎంగలై క్కోళ్ళామల్ పోగాదు
ఇత్తై పఱై కోళ్వాన్ అన్ఱు కాణ్ గోవిందా!
ఎత్తైక్కుం ఏరేర్ పిఱవిక్కుం ఉన్ తన్నో
డుత్తోమేయావోం ఉనక్కే నాం అట్చేయ్ వోం
మత్తై నం కామంగళ్ మాత్త్-ఏలోర్ ఎంబావాయ్

శిత్తమ్ శిఱుకాలే వంద్ ఉన్నై చ్చేవిత్తు - శిత్తమ్ శిఱుకాలే - అంటే బాగా తెల్లవారకుండానే ఇంకా చీకటి ఉంటూ ఉండగానే తెల్లవారుఝామున; వంద్ - అనగా వచ్చి మిమ్మల్ని సేవించి నీయొక్క పాదాలని కీర్తించి మేము పాడుతున్నాం.
పొత్తామరై యడియే పోట్రుం పొరుళ్ కేళాయ్ - లేత తామరల వంటి నీపాదాలను కీర్తిస్తూ మంగళ శాసనాలను చేస్తున్నాం. ఇక్కడ చెప్పినప్పుడు బాగా తెల్లవారకుండానే రావడం అంటే అర్థం ఏమిటి? అనగా అంతర్ముఖమైనటువంటి ధ్యాన స్థితి అని మనం ముందే చెప్పుకున్నాం. అంతేకాదు భగవత్ సాధనకు కావలసినది ఏమిటి అంటే తపన. ఆ తపన ఏమిటి అంటే తెల్లవారకుండానే


Copyright@gurujnanam.org

నిద్రలేచి వెళ్ళడం అనేది తీవ్రమైన శ్రద్ధను తెలియజేస్తుంది. అదే కావాలి అనే లక్ష్య శుద్ధిని, ఏకాగ్రతని తెలియజేస్తున్నది. స్వామియొక్క అందమైన పాదములు తలంచుకోగానే తల్లి చెప్తున్నది

పొత్తామరై యడియే - అన్నదిక్కడ. అంటే క్రొత్త తామరలవి. సుందరమైనటువంటి తామరపువ్వులను పోలినటువంటి నీ పాదాలకు మేమిప్పుడు మంగళాశాసనములు చేస్తున్నాం. చక్కటి మాటలు ఇక్కడ. భగవంతుణ్ణి కీర్తించిన దానికి ఫలితం ఏమిటి? అమ్మ కోరుకుంటున్నది ఏమిటి?

పోట్రుం పొరుళ్ కేళాయ్

పెత్తం మేయ్ త్తుణ్ణుం కులత్తిల్ పిఱందు, నీ కుత్తేవల్ ఎంగలై క్కోళ్ళామల్ పోగాదు - ఓ స్వామీ! నువ్వు ఈ గోపవంశంలో అవతరించావు. ఎలాంటి గోపవంశం అంటే పశువుల్ని మేపుతూ పోషించుకుంటున్నటువంటి లేదా పశువుల్ని మేపుతూ బ్రతుకుతున్నటువంటి గోపవంశంలో అవతరించిన నీకు మేమిచ్చేటటువంటి కైంకర్యాలు తగదు అనరాదు అన్నారు. మేము మీ నుంచి కోరుకుంటున్నది ఇత్తై పఱై కోళ్వాన్ అన్ఱు కాణ్ గోవిందా! - నీనుంచి మేము పరం తీసుకోవడానికి వచ్చిన వారము కాదు. మొదటి నుంచీ ఏమున్నది? పరవాద్యమును ఇవ్వు అనేటటువంటిది శ్రీవ్రత ఫలంగా చెప్పినది. కానీ పరవాద్యం ఇమ్మని మాట వరుసకి అన్నానే కానీ కేవలం పరవాద్యం కాదు నాకు కావలసినది. మరేం కావాలి? ఇక్కడ పరవాద్యం అంటే మనం చెప్పుకున్నాం. మోక్షమని, పరమార్థమని. కానీ అంతకంటే గొప్పమాట ఒకటి చెప్తున్నది ఇక్కడ. భక్తులు మోక్షం కావాలి అని కూడా అనరు. మోక్షం కంటే గొప్పది అంటే ఏంటి అంటే "నమోక్షస్యాకాంక్షా" అన్నారు కదా మహానుభావులు కులశేఖరఆళ్వారులు. మోక్షాకాంక్ష కూడా భక్తులకి ఉండదు. వాడికి కావలసింది భగవంతునితో నిత్య సంబంధం. నిరంతరం మనస్సు ఆ మాధవుడితో తన్మయం చెందాలి. అది ఒక్కటి



Copyright@gurujnanam.org 

చాలు. అంతేకానీ నాకు జన్మరాహిత్యం కావాలి, జననమరణ పరంపర వద్దు అని కూడా భక్తుడు అడగడు. అందుకని ఆ పరమివ్వు అని కూడా నేను అనను. నాకు కావలసింది ఏంటి అంటే ఎప్పటికీ

ఎత్తైక్కుం ఏరేర్ పిఱవిక్కుం ఉన్ తన్నోడుత్తోమేయావోం - అనగా ఎప్పటికైనా ఎన్నెన్ని జన్మలకైనప్పటికీ కూడా నీతో విడదీయరాని బంధము కావాలి. ఇది చాలా చక్కటి కోరిక. అంటే జన్మలు వచ్చినా ఫరవాలేదు అనేటటువంటి ధైర్యం భక్తుడికి మాత్రమే ఉంది. ఎందుకంటే శరీరం ఎలా ఉంటే ఏమున్నది? ఉపాధి ఎలా ఉంటే ఏమున్నది? మనస్సు నీపాదాలపై ఉన్నప్పుడు ఏ జన్మ వస్తే ఆ జన్మే కైవల్యము. కనుకనే శరీరం లేకపోవడమో, జన్మ లేకపోవడమో మోక్షం కాదు. మనస్సు పరమాత్మతో తాదాత్మ్యం చెందడమే మోక్షం. అందుకు నీలో లయమై తన్మయమైనటువంటి స్థితి ఏ జన్మ వచ్చినా ఫరవాలేదయ్యా అదీ చెప్తున్నారు ఇక్కడ. పైగా

ఉనక్కే నాం అట్చెయ్ వోం - నిరంతరం నీకు కైంకర్యం చేసుకోవాలి. కైంకర్యము అంటే మనం చేసే ప్రతి పనీ భగవదర్పణంగా భగవత్ ప్రీతిగా చేయడమే కైంకర్యము. అది మాయొక్క అన్ని కోరికలను పోగొట్టుగాక! చిత్రం. కోరికలు తీర్చుగాక అనలేదు. కోరికలను పోగొట్టుగాక అన్నారిక్కడ. అందుకే భగవత్ కామం ఎటువంటిది అంటే భగవంతుణ్ణి కోరుకోవడం కోరిక కాదుట. ఎందుకంటే "స న కామయమనా నిరోధ రూపత్వాత్" అంటున్నారు నారదుల వారు. అది కోరిక కాదు. భక్తి కామిని కాదు. కోరుకొనేది కాదు. ఎందుకంటే అన్ని కోరికలూ ఎక్కడ ఆగిపోతాయో ఆ కోరిక భగవత్కామం. మోక్షమే అది. అందుకు అన్నీ భగవంతుడే. అదే సంబంధం. లోకంలో మనకి ఎన్నో సంబంధాలుంటాయి. తల్లి, తండ్రి, పుత్రులు, భార్య, స్నేహితులు ఇంకా శత్రువులు రకరకాల బంధాలుంటాయి. కానీ తీయనైన ప్రగాఢమైన అనుబంధం భగవంతుడితోటే



Copyright@gurujnanam.org 

ఉండాలి. అందుకే "మాతా పితా భ్రాతా నివాస శరణం సుహృత్ గతిః నారాయణ ప్రభుః" అని శాస్త్రం చెప్తున్నది. సర్వమూ నారాయణుడే. ఇది శ్రీవ్రత ఫలంగా తల్లి చెప్పినటువంటి గొప్ప మాట.

DAY 30:

వంగ క్కడల్ కడైంద మాదవనై క్కేశవనై
తింగళ్ తిరుముగత్తు శేయిరైయార్ శెన్టిఱైంజి
అంగ ప్పఱై కొండవాత్తై అణి పుదువై
ప్పైంగమల త్తణ్ తెరియల్ పట్టర్బిరాన్ కోదై శొన్న
శంగ త్తమిర్ మాలై ముప్పదుం తప్పామే
ఇంగిప్పరిశురైప్పర్ ఈరిరండు మాల్ వరైత్తోళ్
శెంగణ్ తిరుముగత్తు చ్చెల్వ త్తిరుమాలాల్
ఎంగుం తిరువగుళ్ పెత్తిన్బుఱువర్ ఎంబావాయ్
ఈ దివ్యమైనటువంటి ఈ సంకీర్తన ఈ పాశురంతో పూర్తి అవుతున్నది. ఇక్కడ పరమాత్మను ఆశ్రయించినటువంటి గోపికలు ఏవిధంగా వ్రతాన్ని ఆచరించారో ఆవిధంగా చేసినటువంటి వ్రతమిది అని తల్లి తాను గోపికా భావాన్ని ఆదర్శంగా తీసుకున్నాను అని ఇందులో వాచ్యముగా స్పష్టముగా చెప్పినది. అయితే ఆ గోపికలు ఎటువంటి వారో చెప్తున్నారు.
వంగ క్కడల్ కడైంద మాదవనై క్కేశవనై - అనగా క్షీర సముద్రాన్ని మథనం చేసినటువంటి మాధవుని, కేశవుని ఆశ్రయించినటువంటి గోపికలు. ఇక్కడ క్షీరసముద్రాన్ని మథనం చేసినటువంటి మాధవుడు - ఇది చెప్పడంలో ఉన్న ప్రత్యేకత గమనించాలి. క్షీర సాగరాన్ని మథనం చేసిన వాళ్ళు నిజానికి దేవతలు, దానవులు. మరి మాధవుడు చేశాడు అన్నారేమిటి? అనగా క్షీర సముద్రంలో


Copyright@gurujnanam.org Sri Gurubhyo Namaha

మునిగిపోయిన త్రిలోక సంపద వెలికి రావాలి అంటే దేవతలకి ఆ ఉపాయం చెప్పిన వాడు నారాయణుడు. ఉపాయం చెప్పడమే కాదు సాధనకు కావలసినవన్నీ సమకూర్చాడాయన. కనుక క్షీర సాగర మధనం ఒక యోగ సాధన, ఒక ఆధ్యాత్మిక సాధన. అందుకే ఈ ఒక్క వాక్యంలోనే అమ్మ ఎన్నో విషయాలని ప్రస్తావించింది. పైగా మాదవనై క్కేశవనై - అని చెప్పడంలో మధుర స్వభావమే మాధవుడు. పైగా లక్ష్మీపతి అతడు. కేశవనై - బ్రహ్మ విష్ణు శివాత్మకమైనటువంటి పరంజ్యోతి కేశవుడు.

తింగళ్ తిరుముగత్తు శేయిరైయార్ శెన్టిఱైంజి - ఆయనని ఆశ్రయించినటువంటి గోపికలు ఎటువంటి వారో చెప్తున్నారు ఇక్కడ. వాళ్ళు చంద్రుని వంటి ముఖము కలిగినటువంటి వారు. చంద్ర ముఖులు అని చెప్పడం. పైగా దివ్యాభరణములు ధరించినటువంటి గోపికలు. ఈ రెండు మాటలు జాగ్రత్తగా చూడాలి. వాళ్ళ ముఖములు చంద్రుని వలె ఉన్నాయిట. అనగా నిరంతరం భగవత్ భావన చేత ప్రసన్నమైన వదనం వారిది. ఆ నేత్రములు పరమాత్మనే దర్శిస్తూ ఉన్నాయి. ఆ చెవులు పరమాత్మ గాధలను వింటూ ఉన్నాయి. ఆ కంఠము పరమాత్మనే గానం చేస్తూన్నది. అందువల్ల వాళ్ళు నిరంతరం ఆనందంతో ఉన్నారు. ఆనంద ప్రసన్న ఆహ్లాద లక్షణములే వాళ్ళ ముఖంలో ద్యోతకమవుతూ ఉన్నాయి. అందుకు వాళ్ళు చంద్రముఖులు. పరమాత్మ అనుభవం పొందుతూ ఆయనను ఆశ్రయించారు. పైగా దివ్యాభరణ సంపన్నులు. ఆభరణములు అంటే ఏమిటో గతంలో మనం చెప్పుకున్నాం. నిరంతరం భగవత్ భోగాన్ని అనుభవించడమే ఆభరణం. నిరంతరం భగవత్ కైంకర్య పరాయణులైనటువంటివారు ఆ స్వామిని ఆశ్రయించి

అంగ ప్పఱై కొండ - అంటే అక్కడ వ్రేపల్లెలో స్వామిని ఆశ్రయించి వారు పరాన్ని పొందారు. అంటే పరమార్థాన్ని పొందారు. ఆవిధముగానే ఇప్పుడు


Copyright@gurujnanam.org Sri Gurubhyo Namaha

అణి పుదువై ప్పెంగమల త్తణ్ తెరియల్ పట్టర్బిరాన్ కోద్రై - ఇక్కడ భూమికి అలంకారముగా ఉన్నటువంటి; పుదువై - అంటే పుత్తూరు అని అర్థం. పుత్తూరు అంటే విల్లిపుత్తూరు. కొత్త ఊరు అని అర్థం. విల్లిపుత్తూరులో ఆనాడు వ్రేపల్లెలో గోపికలు ఏవిధంగా పరమాత్మను ఆశ్రయించి పరమార్థాన్ని పొందారో అదేవిధంగా ఇప్పుడు ఇక్కడ విల్లిపుత్తూరులో భట్టనాధునియొక్క పుత్రికయైనటువంటి గోదాదేవి ఈ తమిళ భాషలో కీర్తించినటువంటి ముప్పది పాశురములు. ఇది దీనియొక్క భావం. పైగా విల్లిపుత్తూరు ఎటువంటిది అంటే అక్కడ వటపత్ర శాయి అయినటువంటి నారాయణుడున్నాడు. అక్కడ ఈమె ఈ వ్రతాన్ని ఆశ్రయించి రంగనాథుని కొలుచుకున్నది. పైగా ఈమె ఆ దివ్యమైన విష్ణుచిత్తునికి తులసికోటయందు తనంత తాను దొరికినటువంటి అయోనిజ యైన తల్లి ఈ గోదాదేవి. అందుకు ఆ తండ్రిని ఇక్కడ తలంచుకుంటూన్నది. ఆ తండ్రి ఎటువంటి వాడు అంటే చక్కటి తామర పూసల మాల ధరించాడట. అంటే భాగవతోత్తముడు అని. జపమాలని ధరించి ఉన్నాడు. పట్టర్బిరాన్ - అంటే భట్టనాధుడు అని పేరు ఆయనకి. ఆయనయొక్క కుమార్తె అయినటువంటి ఈగోదాదేవి కీర్తించింది ఈ దివ్యమైనటువంటి ప్రబంధాన్ని. పైగా

శంగ త్తమిర్ మాలై - చక్కటి మాట ఇది. తమిర్ మాలై అంటే ద్రవిడ భాషలో రచించినటువంటి గీతికా మాల ఇది. మొత్తం ముప్పై పాశురములు ముప్పై రత్నాల మాల. పైగా ఇది సంఘముగా పాడినా చక్కటి మాట ఇది. గుంపుగా పాడినా అనేకమంది గోపికలు కలిసి ఆ వ్రతాన్ని చేశారు. ఇక్కడ మరి గోదాదేవితో కలిసిన గోపికలు ఎవరు అని ప్రశ్నించవచ్చు. ఆమెయొక్క మనోభావాలే గోపికలు. పైగా సంఘముగా -పదిమందీ కలిసి పరమాత్మను కోలుచుకోవడం అనేది భాగవత సహవాసం విస్తరిస్తూంది. భాగవత సాంగత్యంతో భగవంతుణ్ణి కీర్తించడం గొప్ప విశేషం. అందరూ ఒకే హృదయం కలిగినటువంటి భాగవతులు భగవంతుణ్ణి


Copyright@gurujnanam.org

కీర్తించి తరించుతారు. అందుకే ఇది సంఘముగా పాడినటువంటి తమిళ గీతాల మాల.

ముప్పదుం తప్పామే - ఈ ముప్పది పాశురాలనీ క్రమము తప్పకుండా ఇంగిప్పరిశురైప్పర్ - ఈ పద్ధతిలో చదివినటువంటి వారు నారాయణుని అనుగ్రహానికి పాత్రులు అవుతున్నారు అని చెప్పారు. అంటే ముప్ఫై పాశురములు క్రమం తప్పకుండా చదివినటువంటివారికి నారాయణుని యొక్క దివ్య కృప లభిస్తుంది. చాలు. ఇంకేంకావాలి? నారాయణుని కృప ఉంటే ఇహము, పరము, పరమార్థము అన్నీ లభిస్తున్నాయి. అందుకు ఆ నారాయణుడు ఎటువంటి వాడు? అని ఒక్కసారి అమ్మ తన్మయంతో వర్ణిస్తూ ఉన్నది.

ఈరిరండు మాల్ వరైత్తోళ్శాం గణ్ తిరుముగత్తు చ్చెల్వ త్తిరుమాలాల్ ఎంగుం తిరువగుళ్ పెత్తిన్బుఱువర్ - నాలుగు భుజముల వాడు - చతుర్భుజాలతో ఉన్నటువంటి వాడు, పైగా పర్వత శిఖరాలలాంటి భుజాలు అవి. అనగా అంత దృఢమైనటువంటి, జగద్రక్షణ సమర్థములైనటువంటి శంఖ చక్ర గదా పద్మములు ధరించిన దివ్యమైన నాలుగు భుజములతో ప్రకాశిస్తున్నటువంటి వాడు. లేత ఎర్రని కాంతులతో ఉన్నటువంటి విశాలమైన నేత్రములు కలిగినటువంటి వాడు, తిరుముగమ్ - దివ్యమైన ముఖ మండలము కలిగినటువంటి వాడు, చెల్వ త్తిరుమాలాల్ - ఐశ్వర్య పరిపూర్ణుడు, లక్ష్మీపతి యైన నారాయణుడు. లక్ష్మీ సమేతుడైన నారాయణుడు, షడ్గుణైశ్వర్య సంపన్నుడు పరిపూర్ణుడు అయినటువంటి నారాయణుడు; ఎంగుం తిరువగుళ్ - అంతటా కూడా సాటిలేని దివ్య కరుణని ఆయన కురిపిస్తాడు. ఆ కరుణ వల్ల ఈ పాశురములని పారాయణ చేసినటువంటివారు దివ్యానందాన్ని అనుభవిస్తారు అని అమ్మ చెప్పింది. ఇది తల్లిమాట ఎప్పుడూ తప్పదు, వ్యర్థము కాదు.



Copyright@gurujnanam.org

పాశురముల ఫలశ్రుతి ఇది. ఎవరైతే తిరుప్పావైని భక్తితో గానం చేస్తారో శ్రవణం చేస్తారో వారు అటువంటి దివ్య ఫలితాన్ని పొందుతారు అని చెప్పింది.



Copyright@gurujnanam.org Sri Gurubhyo Namaha